

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 301
శనివారం 15-7-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'


అల్‌కరాజ్‌తో జొకోవిచ్ 'ఢీ'
వింబుల్డన్ టోర్నీ సెమీఫైనల్స్‌లో వరుస సెట్‌లలో విజయం - 13లో


రాకెట్ స్పీడుతో మార్కెట్ ర్యాలీ
తొలిసారి 66వేలపైకి సెన్సెక్స్.. 19,500 ఎగువున నిఫ్టీ - 13లో


ఫ్రాన్స్‌లోనూ భారత యూపీఐ
యూపీఐ సేవలను ఫ్రాన్స్‌లోనూ ఉపయోగించుకొనేలా అక్కడి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.
వివరాలు 10లో ▸


కునో పార్కులో 8వ చీతా మృతి
మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో 3 రోజుల వ్యవధిలో మరో చీతా మృతి చెందింది. ఇప్పటి వరకు 8 చీతాలు చనిపోయాయి.
వివరాలు 6లో ▸


శాంతించిన యమునా నది
ఢిల్లీలో యమునా నది శాంతించింది. అక్కడ వరద ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. ఇంకా ముంపులోనే పలు ప్రాంతాలున్నాయి.
వివరాలు 6లో ▸


అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం
అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారత్‌లో అంతర్భాగమంటూ అగ్రరాజ్యం అమెరికా సెనేట్ కమిటీ తీర్మానం చేసింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బాబు మిత్రుడు, సింగపూర్ మంత్రి ఎస్.ఈశ్వరన్ అరెస్టు



అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చంద్రబాబు మిత్రుడు, సింగపూర్ రవాణా శాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్‌ను ఈ నెల 11న అరెస్టు చేసినట్లు సీపీఐబీ తెలిపింది.
వివరాలు 6లో ▸

సంస్కృతం లేనిదే సంస్కృతి లేదు



సంస్కృత భాష లేనిదే భారతీయ సంస్కృతి లేదని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ సంస్కృత సమ్మేళనం శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
వివరాలు 5లో ▸

'ఏకలవ్య' పాఠశాలల్లో 4,062 పోస్టుల భర్తీ



ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల్లో టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ భర్తీకి కేంద్రం చర్యలు చేపట్టింది. ఎన్ఈఎస్‌టీఎస్ ఇటీవల 4,062 ఖాళీల భర్తీకి ఏకలవ్య మోడల్ పాఠశాల స్టాఫ్ సెలక్షన్ ఎగ్జామ్–2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.
వివరాలు 6లో ▸

విజయవాడలో 28 నుంచి సీ ఫుడ్ ఫెస్టివల్



స్థానిక వినియోగాన్ని పెంచడం, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాల కల్పనే లక్ష్యంగా విజయవాడలో 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కూనపురెడ్డి కన్నబాబు సచివాలయంలో శుక్రవారం తెలిపారు.
వివరాలు 5లో ▸



ఢిల్లీ మీద సర్వహక్కులూ కేంద్రానికిస్తే బెటరేమో సర్!

మామా.. మేమొస్తున్నాం

చంద్రయాన్‌-3 దిగ్విజయం

ముచ్చటగా మూడోసారి విజయవంతం

నూటిగా కక్ష్యలోకి చేరిన చంద్రయాన్‌–3 | చంద్రుని చేరే దిశగా కీలక ముందడుగు..

నెరవేరిన ఇస్రో పదేళ్ల కల

ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి
ఆగస్టు 23న చంద్రుడిపై దిగనున్న ల్యాండర్, రోవర్
ఆ తర్వాత చంద్రుడిపై కీలక పరిశోధనలు
ఫలించిన శాస్త్రవేత్తల కృషి, దేశమంతా సంబరాలు
రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సీఎం జగన్ ప్రశంసలు

➤ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పదేళ్ల కల నెరవేరింది. చంద్రయాన్–1, 2 ప్రయోగాలు నిరాశ పరిచినా పట్టు వీడకుండా మొక్కవోని దీక్షతో మన శాస్త్రవేత్తల బృందం రాత్రింబవళ్లు పడిన కష్టం ఎట్టకేలకు ఫలించింది. ముచ్చటగా మూడోసారి చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైంది. మూడు దశల ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ చంద్రయాన్–3 త్రీ–ఇన్–వన్ మిషన్‌ను విజయవంతంగా రోదసి చేర్చి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్ మొదలుకుని ప్రముఖులంతా ఇస్రోను, ఇంతటి విజయానికి కారకులైన శాస్త్రవేత్తల బృందాన్ని అభినందనలతో ముంచెత్తారు.

6లో



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న చంద్రయాన్‌–3

రైతుల పంట ఉత్పత్తులకు భరోసా

కనీస మద్దతు ధర కల్పించేలా ప్రత్యేక చట్టం

ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- ఆర్బీకే స్థాయిలో మార్కెటింగ్ శాఖ కార్యకలాపాలు
- వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, డెయిరీ ఉత్పత్తులకు భరోసా
- రైతుల నుంచి ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ఎమ్మెస్పీకే సేకరించాలి
- తక్కువ ధరకు సేకరిస్తే కఠిన చర్యలుండేలా నిబంధనలు
- దిగుబడి అంచనాల రూపకల్పనలోనూ డ్రోన్ టెక్నాలజీ
- ఆర్బీకే స్థాయిలో పక్కాగా భూసార పరీక్షలు
- మరింత సమర్థవంతంగా ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్
- అక్టోబర్‌లో 2022–23 రబీ సీజన్ పంటల బీమా పరిహారం
- టమాటా, ఉల్లి లాంటి పంటల ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి

2లో



వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందుతున్న మహిళల ద్వారా సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించి వారి స్వయం ఉపాధికి ఊతమివ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం ఆరు వేల మైక్రో యూనిట్లు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలి. మార్కెట్‌తో సమన్వయం చేసుకుంటూ ఇతర పంటల్లో కూడా మధ్య వర్తుల ప్రమేయాన్ని పూర్తిగా నిరోధించేలా అడుగులు ముందుకు వేయాలి.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

దళిత రైతులకు సంపూర్ణ హక్కులు

'భూమి కొనుగోలు' పథకం భూములపై ఇప్పుడున్న రుణాలు మాఫీ

- రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు
- రుణాలు తీర్చినా 22 (ఎ)లో ఉన్న భూములకూ విముక్తి
- నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు
- దళిత రైతుల కష్టాలు తీర్చే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం



సాక్షి, అమరావతి: భూమి కొనుగోలు పథకం ద్వారా భూములను పొందిన దళిత రైతుల దశాబ్దాల ఆకాంక్షను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం నెరవేరుస్తోంది. ఆ భూములపై రుణాలన్నింటిని మాఫీ చేసి వాటిపై రైతులకు పూర్తి హక్కులను కల్పిస్తోంది. రుణాలు చెల్లించిన తర్వాత కూడా నిషేధిత జాబితాలో కొనసాగుతున్న భూములకు సైతం విముక్తి కల్పిస్తోంది. మొత్తం 22 వేల మందికిపైగా రైతులకు మేలు చేసే ఈ రెండు అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలకు
మిగతా 10వ పేజీలో ▶

'అసైన్డ్'పై హక్కులు అతి పెద్ద సంస్కరణ

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- సీఎం జగన్ నిర్ణయం సాహసోపేతం.. పేద రైతుల హోదాను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

10లో



నాడు-నేడు రెండో దశ స్కూళ్లలోనూ

డిజిటల్ విద్య

- 6 నుంచి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు.. 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలతో పాఠాలు
- ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్ టీవీ
- మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు విద్యాశాఖ ఆదేశం.. ఆగస్టు నెలాఖరులోగా ఈ పనులు పూర్తి చేయాలని స్పష్టీకరణ
- ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలను తరగతి గదుల్లోనే అమర్చాలని వెల్లడి

2లో

రామోజీ! ఇవన్నీ సాధ్యమయ్యాయిగా?

- ఉన్నత విద్యపై ముఖ్యమంత్రి విజన్‌కు 'ఈనాడు' వక్రభాష్యం
- ప్రాథమిక స్థాయి నుంచి ఎన్ని సంస్కరణలు తెచ్చినా వంకర రాతలే.. 'ఉన్నత విద్య–ఉపాధి' అనుసంధానిస్తూ ముందుకెళుతున్న సర్కారు
- బాబు హయాంలో ఒక్క పోస్టూ భర్తీ చేయకున్నా ప్రశ్నించని రామోజీ.. అప్పట్లో బాబు బంధుమిత్రులకే వర్సిటీల్లో, పాలక మండళ్లలో పదవులు
- వారు అడ్డగోలుగా పోస్టులు భర్తీ చేయటంతో ఎక్కడికక్కడ కోర్టు కేసులు

4లో

ఏది నిజం?

- వాటిని పరిష్కరించకుండా ఖాళీలను వదిలేసిన బాబు.. ప్రశ్నించని 'ఈనాడు'
- వాటిని పరిష్కరించుకొని పోస్టుల భర్తీ దిశగా ప్రస్తుత ప్రభుత్వం అడుగులు
- దీన్ని అడ్డుకోవటానికి సీఎం విజన్‌ను తప్పుబట్టేలా 'ఈనాడు' కథనం
- రాష్ట్రంలో పెరుగుతున్న ప్లేస్‌మెంట్లు... ఓర్వలేక ఎల్లో మీడియా ఆక్రందనలు

చంద్రయాన్‌-3లో తెలుగు రక్షణ కవచం!



- శాటిలైట్ బ్యాటరీని కాపాడే విడిభాగాల తయారీలో కీలక పాత్ర
- రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్‌లో బ్యాటరీ స్టాండ్స్, నాసిల్స్, స్లీవ్స్ సరఫరా.. విజయవాడకు చెందిన బీఎన్ రెడ్డి కంపెనీ ఘనత
- చంద్రయాన్1, 2తో పాటు ఇస్రో ఇతర ప్రయోగాల్లోనూ భాగస్వామ్యం
- 1998 నుంచి 50కి పైగా ఉపగ్రహాలకు విడిభాగాలు అందజేత



సాక్షి, అమరావతి: జాబిలిపై అన్వేషణకు బయల్దేరిన చంద్రయాన్–3 ఉపగ్రహానికి రక్షణ కవచం తొడిగారు బెజవాడకు చెందిన ఇంజినీరు బొమ్మారెడ్డి నాగభూషణరెడ్డి (బీఎన్ రెడ్డి). ఉపగ్రహంలో గుండెకాయ వంటి అత్యంత కీలకమైన బ్యాటరీలను కాపాడే రక్షణ కవచాన్ని, మరికొన్ని విడిభాగాలను బీఎన్ రెడ్డి స్థాపించిన 'నాగసాయి ప్రెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీనే అందించింది. ఉపగ్రహాల్లో బ్యాటరీలకు రక్షణ కవచాల తయారీలో ఈ సంస్థ దేశంలోనే పేరెన్నికగన్నది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఈ కంపెనీ ఇప్పటివరకు 50 శాటిలైట్లకు విడి భాగాలను అందించింది. తాజాగా చంద్రయాన్–3లో రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్‌లో బ్యాటరీలను అమర్చే అల్యూమినియం స్టాండ్స్, నాసిల్స్, స్లీవ్స్‌ను సమకూర్చింది. గతంలో చంద్రయాన్–1, చంద్రయాన్–2తో పాటు ఇస్రో నిర్వహించిన అనేక ప్రయోగాల్లో ఈ సంస్థ భాగస్వామి అయ్యింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో కలిసి పని చేయడంతో పాటు ఏరో స్పేస్, యుద్ధ విమానాల విడిభాగాలను కూడా వివిధ విమాన తయారీ సంస్థలకు సమకూరుస్తోంది.

ఏరో స్పేస్ రంగంలో ఉజ్వల భవిష్యత్తును ఊహించి..

బీఎన్ రెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి విజయవాడ, గన్నవరంలో రైల్వే ఇంజినీరుగా పని చేసేవారు. బీఎన్ రెడ్డి విద్యాభ్యాసం కేబీఎన్, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీల్లో సాగింది. 1982లో హైదరాబాద్ వెళ్లిన ఆయన ఓ చిన్న పరిశ్రమలో ఉద్యోగిగా చేరారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్స్, డిజైనింగ్స్‌లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. అల్విన్ లిమిటెడ్‌లో ఉద్యోగంలో చేరారు. 1994లో సొంతంగా 'నాగసాయి ప్రెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్'ను స్థాపించారు. తొలినాళ్లలో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్ పరికరాలను తయారు చేసేవారు. 1998 నుంచి ఇస్రో ప్రయోగాలకు అవసరమైన వివిధ ఉపకరణాలను అందించడంపై దృష్టి పెట్టారు. బీఎన్ రెడ్డి పనితీరు, నైపుణ్యాన్ని ఇస్రో ఉన్నతాధికారులు 6 నెలల పాటు పరీక్షించారు. పూర్తిగా సంతృప్తి చెందిన తర్వాత అవకాశం కల్పించారు.

'ప్లాంటు' ఏర్పాటుకు కృషి

ఒకప్పుడు శాటిలైట్‌లో విడి భాగాల తయారీకి ఉపయోగించే ప్రత్యేక అల్యూమినియాన్ని ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ఇది అధిక సమయం, ఖర్చుతో కూడుకున్నది. ఆ తర్వాత హైదరాబాద్‌లోనే నాణ్యమైన అల్యూమినియం ప్లాంటు ఏర్పాటు జరిగింది. ఈ ప్లాంటు ఏర్పాటుకు బీఎన్ రెడ్డి విశేష కృషి చేశారు. దీని ద్వారా ఖర్చు, సమయం ఆదా అవుతున్నాయి.

ఇస్రో, నాసాతో భాగస్వామ్యమే లక్ష్యం

''ఇస్రో, నాసాల శాటిలైట్ ప్రయోగాల్లో నా కంపెనీ భాగస్వామ్యం ఉండాలన్నదే నా లక్ష్యం. స్వదేశీ పరిజ్ఞానంతో పరికరాల తయారీ ద్వారా ప్రయోగాల ఖర్చు చాలా వరకు తగ్గుతుంది. ఇప్పుడు చంద్రయాన్–3ని కూడా తక్కువ ఖర్చుతోనే చేపట్టారు'' అని బీఎన్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.



వలంటీర్లలో క్రిమినల్

శక్తులున్నాయి

- గంజాయి స్మగ్లింగ్ రాష్ట్రంలోనే అత్యధికం
- ఏపీలో నాసిరకం మద్యం అమ్ముతున్నారు.. అన్నవరంలో పురోహితులను వేలం పెట్టడం రాజ్యాంగ విరుద్ధం
- నేను 4వ తరగతి చదివే రోజులకి ఇప్పటికీ నిత్యావసరాలు చాలా పెరిగిపోయాయి
- తణుకు వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్


- వివరాలు 12లో

చెప్పుతో కొట్టేవారు లేకే వలంటీర్లు

ప్రశ్నలడుగుతున్నారు

- ప్రజల ఇళ్లల్లోకి చొరబడుతున్నారు
- రాష్ట్రంలో 22,278 మంది ఆడబిడ్డలు కనిపించకుండా పోయారు
- మహిళల స్థితిగతులను 'మహాశక్తి'తో మార్చేస్తా
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు వ్యాఖ్యలు

3లో



క్లుప్తంగా...

చంద్రయాన్‌-3 ఫలప్రదం కావాలి: గవర్నర్‌ అబ్దుల్‌ నజీర్‌



సాక్షి, అమరావతి: చంద్రయాన్‌-3ని శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలను ఏపీ గవర్నర్‌ జస్టిస్‌ అబ్దుల్‌నజీర్‌ అభినందించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే మిషన్‌ ఫలప్రదం కావాలని అభిలషించారు.

సీఎం వైఎస్‌ జగన్‌ అభినందనలు
చంద్రయాన్‌-3 విజయవంతంపై సీఎం వైఎస్‌ జగన్‌ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు. అంతరిక్ష యాత్రలో చంద్రయాన్‌ 3 విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ శాఖకు సీఎం జగన్‌ అభినందనలు



సాక్షి, అమరావతి: వ్యవసాయ శాఖ అధికారులను సీఎం జగన్‌ అభినందించారు. 100 శాతం సూక్ష్మ సేద్యాన్ని అమలు చేస్తూ ఉత్తమ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించినందుకుగాను వైఎస్సార్‌ జిల్లా ఈ.కొత్తపల్లి పంచాయతీకి కేంద్ర వ్యవసాయ శాఖ అవార్డుని అందజేసిన విషయం తెలిసిందే. ఈ అవార్డును తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు సూక్ష్మనీటి పథకం పీవో హరినాథ్‌రెడ్డి శుక్రవారం చూపించారు. ఈ సందర్భంగా అధికారులను సీఎం ప్రశంసించారు.

కంగ్రాట్స్‌ జ్యోతి యర్రాజీ..
ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ట్వీట్‌

సాక్షి, అమరావతి : ఆసియన్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన జ్యోతి యర్రాజీకి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. 'వైజాగ్‌కు చెందిన జ్యోతి యర్రాజీకి నా శుభాకాంక్షలు. 25వ ఆసియన్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి.. ఎవరికీ సాధ్యం కాని రికార్డును అందుకున్నావు. నీ ప్రతిభతో అందరినీ గర్వపడేలా చేశావు. కంగ్రాట్స్‌ జ్యోతి యర్రాజీ' అంటూ సీఎం జగన్‌ శుక్రవారం ట్వీట్‌ చేశారు.

ఎన్జీటీ జరిమానాపై సుప్రీంకోర్టు స్టే

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక తవ్వకాలకు సంబంధించి జయ ప్రకాశ్‌ పవర్‌ వెంచర్స్‌ లిమిటెడ్‌కు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ (ఎన్జీటీ) విధించిన జరిమానాపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఎన్జీటీ ఆదేశాలు సవాల్‌ చేస్తూ ఆ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్‌ అభయ్‌ ఎస్‌ ఓకా, జస్టిస్‌ సంజయ్‌ కరోల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎన్జీటీ విధించిన రూ. 18 కోట్ల జరిమానాపై స్టే విధించిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

క్రిమినల్‌ కేసులు దాస్తే వేటే!
కీలక తీర్పు వెలువరించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల అక్రమాలకు సంబంధించి హైకోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. ఎన్నికల అఫిడవిట్‌లో క్రిమినల్‌ కేసు వివరాలను దాచిపెట్టి శాసనమండలి ఎన్నికల్లో గెలుపొందిన మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డిపై కఠిన చర్యలకు ఆదేశాలిచ్చింది. కేసు వివరాలను దాచిపెట్టడం ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటమే అవుతుందని తేల్చి చెప్పింది. ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనలను అనుసరించి భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా శ్రీనివాసులరెడ్డిపై అనర్హత విధించేలా సంబంధిత ఫైల్‌ను రాష్ట్రపతి ముందుంచాలని శాసనమండలి కార్యదర్శిని ఆదేశించింది. కేసు విషయాన్ని దాచిపెట్టినందుకు ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్‌ 125 ఏ ప్రకారం ఆయన్ను ప్రాసిక్యూట్‌ కూడా చేయొచ్చంది. శ్రీనివాసులురెడ్డి ఎన్నికల నామినేషన్‌ చట్టవిరుద్ధమంటూ జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు శుక్రవారం తీర్పు వెలువరించారు.

ఎన్నిక చెల్లదని ప్రకటించాల్సి ఉన్నా..
'సత్యమేవ జయతే అన్నది ఓ నామమాత్రపు నినాదంగా మిగిలిపోకూడదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు మనదేశ ప్రజాస్వామ్యానికి మౌలిక స్వరూపం. ఏ రకంగానూ ఈ ప్రక్రియ కలుషితం కావడానికి వీల్లేదు. శ్రీనివాసులురెడ్డి లాంటి బాగా చదువుకున్న వ్యక్తి చట్టం నుంచి తప్పించుకోవడానికి వీల్లేదు' అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. 2017లో ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల నియోజవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌కు చెందిన యండపల్లి.శ్రీనివాసులురెడ్డి విజయం సాధించారు. ఆయన ఎన్నికను సవాల్‌ చేస్తూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అదే ఏడాది హైకోర్టులో ఎన్నికల పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ అనంతరం తాజాగా హైకోర్టు తీర్పు వెలువడింది. శ్రీనివాసులురెడ్డి ఎన్నిక చెల్లదని ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. 2023 ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడి ఎన్నికలు కూడా పూర్తైనందున ఆయన ఎన్నికను చెల్లనిదిగా ప్రకటించడం లేదని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారా? లేదా? అనే అంశానికే పరిమితం అవుతున్నట్లు తెలిపారు.

రైతుల పంట ఉత్పత్తులకు భరోసా

- కనీస మద్దతు ధర కల్పించేలా ప్రత్యేక చట్టం
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్‌ జగన్‌
- ఆర్బీకే స్థాయిలో మార్కెటింగ్‌ శాఖ కార్యకలాపాలు
- వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా, డెయిరీ ఉత్పత్తులకు భరోసా



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి : రైతులు పండించిన ప్రతి పంటకు కనీస మద్దతు ధర దక్కేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంలో ఉండే ప్రతి ఒక్కరిపైనా ఉందని, ప్రభుత్వం నిర్ధేశించిన కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఏ ఒక్క రైతూ పంట ఉత్పత్తులను అమ్ముకోడానికి వీల్లేదని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ఎవరైనా సరే.. కనీస మద్దతు ధర చెల్లించిన తర్వాతే రైతుల నుంచి పంట ఉత్పత్తులు సేకరించేలా చూడాలన్నారు. డిమాండ్‌ లేదనో మరే కారణంతోనైనా మద్దతు ధర దక్కకుండా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏపీ ఎంఎస్‌పీ యాక్టు-2023 తీసుకురావాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో జరుగుతోన్న వివిధ కార్యక్రమాల పురోగతిపై శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించే ఎమ్మెస్పీ ధీమా కల్పించేలా ఈ చట్టం ఉండేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకే కాకుండా ఆక్వా, డెయిరీ రైతుల ఉత్పత్తులకు కూడా రక్షణ కల్పించేలా ఈ చట్టాన్ని రూపొందించాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎం జగన్‌ ఇంకా ఏమన్నారంటే..

మార్కెటింగ్‌లో ఆర్బీకేల ప్రమేయం

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు.. వేటిలోనూ నకిలీ, కల్తీ లేకుండా నివారించడంలో ఆర్బీకేలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదే రీతిలో మార్కెటింగ్‌లో కూడా ఆర్బీకేల ప్రమేయం ఉండాలి. పంటల సాగు, బీమా కల్పన, ధాన్యం కొనుగోలులో ఆర్బీకేలు ఇప్పటికే రైతులను చేయి పట్టుకుని నడిపిస్తున్నాయి.
- ధాన్యం సేకరణలో ఆర్బీకేల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చేశాం. కనీస గిట్టుబాటు ధరలు రాని ఏ పంట కొనుగోళ్లలో అయినా ఆర్బీకే జోక్యం చేసుకుంటుంది. మిగిలిన పంటల కొనుగోలు కూడా ఆర్బీకే కేంద్రంగా జరిగేలా చూడాలి. ఏ రకమైన కొనుగోళ్లకు అయినా ఆర్బీకే కేంద్రం కావాలి.

డ్రోన్‌ టెక్నాలజీ విస్తృతం

- వ్యవసాయ రంగంలో డ్రోన్లను విస్తృతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. డ్రోన్‌ టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగంలో బహుళ ప్రయోజనాలు పొందాలి. ఇప్పటికే సూక్ష్మ ఎరువులు, పురుగు మందుల వినియోగం లాంటి కార్యక్రమాలు డ్రోన్ల ద్వారా చేస్తున్నాం. ఇదే కాకుండా డ్రోన్ల ద్వారా భూసార పరీక్షలు చేయించే పరిస్థితిని తీసుకురావాలి. తద్వారా ఆర్బీకే స్థాయిలో భూసార పరీక్షలు జరిగేలా చూడాలి.
- భూసార పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడమే కాకుండా, ఎప్పటికప్పుడు డ్రోన్ల ద్వారా తెలుసుకునే పరిస్థితి వస్తే ప్లాంట్‌ డాక్టర్‌ కాన్సెప్ట్‌ను సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుంది. పైగా సేకరించే డేటాలో కచ్చితత్వం ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- సాగులోనే కాదు పంట దిగుబడులపై అంచనాలకు కూడా డ్రోన్లను వినియోగిస్తున్నారు. వరి దిగుబడులను డ్రోన్ల సాయంతో అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మిగిలిన పంటల విషయంలో కూడా ఇదే తరహా ప్రయోజనాలు డ్రోన్‌ టెక్నాలజీ ద్వారా పొందేలా చూడాలి. బహుళ ప్రయోజనకారిగా డ్రోన్లను వినియోగించు కోవడం వల్ల వ్యవసాయ రంగానికి, రైతులకు మరింత మేలు జరుగుతుంది.

వీడియోల ద్వారా సాగులో శిక్షణ

- 10 వేల ఆర్బీకేల్లో 10 వేల డ్రోన్ల ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాలి. సాగులో శిక్షణ కార్యక్రమాలపై మరిన్ని వీడియోలు రూపొందించి ఆర్బీకే ఛానెల్‌ ద్వారా మరింతగా రైతులకు చేరువ చేయాలి. ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో సాధ్యమైనంత ఎక్కువ మంది కౌలుదారులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలి. వీరికి రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలి.
- వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ నాలుగేళ్లలో ఇప్పటి వరకు 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.5 కోట్లు పరిహారంగా అందించాం. రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పరిహారాన్ని అక్టోబర్‌లో ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

పంటల ఆధారంగా ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లు

- జిల్లాల్లో స్థానికంగా పండే పంటల ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు దిశగా కృషి చేయాలి. నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్‌ చేయాలి. ఫుడ్‌ ప్రాసెసింగ్‌ విషయంలో మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాధ్యమైనంత త్వరగా ఈ యూనిట్లను అందుబాటులోకి తీసుకురావాలి.
- రెగ్యులర్‌ మార్కెట్‌కే కాకుండా ఫుడ్‌ ప్రాసెసింగ్‌కు అనుకూలమైన వంగడాలను ఉద్యానవన పంటల్లో ప్రోత్సహించాలి. గత నాలుగేళ్లలో 4.34 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటల నుంచి ఉద్యానవన పంటల వైపు మళ్లింపు జరిగింది. ఏటా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలి.
- తరచూ ధరల్లో తీవ్ర హెచ్చు తగ్గులకు గురయ్యే టమాటా, ఉల్లి లాంటి పంటల ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ పంటల సాగు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రాసెసింగ్‌ యూనిట్లు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలి. ఆయా జిల్లాల్లో మహిళలతో నడిచేలా సెకండరీ ప్రాసెసింగ్‌ యూనిట్లను తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి.
- ఇందుకోసం అవసరమైన వ్యవసాయ ఉపకరణాలు, డ్రైయింగ్‌ ప్లాట్‌ ఫామ్‌లతో పాటు ప్రైమరీ ప్రాసెసింగ్‌ యూనిట్లు ఏర్పాటు చేయాలి. గోడౌన్లు, కలెక్షన్‌ సెంటర్లు, కోల్డ్‌ రూమ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలి. వీటి వల్ల పంట ఉత్పత్తుల జీవితకాలం పెరుగుతుంది. రైతులకు మంచి ధరలు వస్తాయి. ఉద్యానవన పంటలకు ఈ మౌలిక సదుపాయాలు ఎంతగానో అవసరం.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఏపీ అగ్రి మిషన్‌ వైస్‌ చైర్మన్‌ ఎంవీఎస్‌ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ సలహాదారు ఐ.తిరుపాల్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ కేఎస్‌ జవహర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ స్పెషల్‌ సీఎస్‌ గోపాలకృష్ణ ద్వివేది, మార్కెటింగ్‌, ఫుడ్‌ ప్రాసెసింగ్‌ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, వ్యవసాయ శాఖ స్పెషల్‌ కమిషనర్‌ చేవూరు హరికిరణ్‌, ఉద్యాన శాఖ కమిషనర్‌ ఎస్‌ఎస్‌ శ్రీధర్‌, ఏపీ మార్క్‌ఫెడ్‌ ఎండీ రాహుల్‌ పాండే, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్‌ గెడ్డం శేఖర్‌బాబు, ఏపీడీడీసీఎఫ్‌ ఎండీ అహ్మద్‌ బాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఆర్బీకేకు అనుబంధంగా కిసాన్‌ డ్రోన్లు

ఖరీఫ్‌ సన్నద్ధతతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని అధికారులు సీఎం వైఎస్‌ జగన్‌కు వివరించారు. 'ఖరీఫ్‌-2023 సీజన్‌లో ముందస్తుగానే ఈ క్రాపింగ్‌కు శ్రీకారం చుట్టాం. ఎప్పటికప్పుడు డేటాను అప్‌లోడ్‌ చేస్తున్నాం. ఈసారి కొత్తగా జియో ఫెన్సింగ్‌ ఫీచర్‌ను ప్రవేశపెట్టాం. నిర్దేశిత గడువులోగా 100 శాతం ఈ క్రాపింగ్‌ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం. 2.2 లక్షల భూసార శాంపిళ్లను సేకరించి అగ్రి ల్యాబ్‌ల ద్వారా పరీక్షించి ఫలితాలను రైతులకు అందించేలా చర్యలు తీసుకున్నాం. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈ ఏడాది ఇప్పటికే 4.74 లక్షల కార్డులు జారీ చేశాం. మరింత మందికి సీసీఆర్సీలు జారీ లక్ష్యంగా ముందుకెళ్తున్నాం' అని వివరించారు. ప్రతి ఆర్బీకేకు అనుబంధంగా కిసాన్‌ డ్రోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'తొలి దశలో 2 వేల డ్రోన్లు తీసుకువస్తున్నాం. ఇందుకోసం ఇప్పటికే డ్రోన్‌ టెక్నాలజీలో 222 మంది రైతులకు శిక్షణ ఇచ్చి పైలట్‌ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నాం. డ్రోన్లు ఖరీదైనవి కాబట్టి వాటి భద్రత, రక్షణ, నిర్వహణ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. డైరెక్టరేట్‌ జనరల్‌ ఆఫ్‌ సివిల్‌ ఏవియేషన్‌ (డీజీసీఏ) నిబంధనలు పాటిస్తున్నాం. అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎదురుగా వచ్చే వస్తువులను ఢీ కొట్టకుండా నిలువరించే వ్యవస్థ ఉండేలా, నిర్దేశించిన మార్గంలోనే ఎగిరేలా, ఒకవేళ ఇంధన సమస్య వస్తే వెంటనే ఆటో పద్ధతిలో లాంచింగ్‌ ప్యాడ్‌కు చేరుకునేలా ఈ డ్రోన్ల డిజైన్‌ ఉంటుంది' అని అధికారులు వివరించారు.

నాడు-నేడు రెండో దశ స్కూళ్లలోనూ డిజిటల్‌ విద్య

- 6 నుంచి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెళ్లు
- 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్‌ టీవీలతో పాఠాలు
- ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్‌ టీవీ
- మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశం
- ఆగస్టు నెలాఖరులోగా ఈ పనులు పూర్తి చేయాలని స్పష్టీకరణ
- ఐఎఫ్‌పీ, స్మార్ట్‌ టీవీలను తరగతి గదుల్లోనే అమర్చాలని వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను అత్యున్నత స్థాయి బోధన ద్వారా గ్లోబల్‌ సిటిజన్లుగా తీర్చి దిద్దాలన్నది సీఎం వైఎస్‌ జగన్‌ సంకల్పం. అందుకు అనుగుణంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్‌ విద్యకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలి దశ నాడు-నేడు స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి వరకు 30,230 తరగతి గదుల్లో ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెల్స్‌ (ఐఎఫ్‌పీ)ను ఏర్పాటు చేస్తున్నారు. 1 నుంచి 5 వ తరగతి స్కూళ్లలో 10,038 స్మార్ట్‌ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా నాడు-నేడు రెండో దశ స్కూళ్లలో కూడా ఐఎఫ్‌పీ, స్మార్ట్‌ టీవీల ఏర్పాటుకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ఈ స్కూళ్లలో డిజిటల్‌ తరగతులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్కూల్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కమిషనర్‌ కాటంనేని భాస్కర్‌ జిల్లా విద్యా శాఖ అధికారులు (డీఈవోలు), అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ల (ఏపీవో)కు శుక్రవారం ఆదేశాలిచ్చారు. రెండో దశలో పనులు పూర్తి చేసుకున్న అన్ని స్కూళ్లకు ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌ టీవీలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్‌ టీవీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌ టీవీలను బోధనా తరగతి గదుల్లో మాత్రమే అమర్చాలన్నారు. డిజిటల్‌ మౌలిక సదుపాయాల పనులను వెంటనే చేపట్టి ఆగస్టు నెలాఖరుకి పూర్తి చేయాలని డీఈవోలు, ఏపీవోలను ఆదేశించారు. ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌ టీవీలకు అవసరమైన కేబులింగ్‌, ఇతర ఏర్పాట్లకు అంచనాలు రూపొందించాలని, రెండో దశలో అందుబాటులో ఉన్న నిధులతో వాటిని అమర్చాలన్నారు. ఏఐఎఫ్‌పీలు, స్మార్ట్‌ టీవీలకు సమీపంలో రెండు సాకెట్లు, స్విచ్‌లతో కూడిన రెండు సాకెట్‌ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. బ్రాడ్‌ బ్యాండ్‌ సిగ్నల్‌ పాయింట్‌ అన్ని తరగతి గదుల మధ్యలో ఉంచాలని తెలిపారు.



డెహ్రాడూన్‌లోని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన సమావేశంలో కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులతో వైద్య శాఖ మంత్రి రజిని

ఏపీ విధానాలు అనుసరించండి

- ఇతర రాష్ట్రాలకు కేంద్రమంత్రుల సూచన
- వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ అమలు భేష్‌
- ఏబీడీఎం అమలులో దేశంలో మొదటిస్థానంలో ఏపీ
- ప్రజారోగ్యం పట్ల సీఎం జగన్‌ ప్రభుత్వ చిత్తశుద్ధిపై స్వాస్థ్య చింతన్‌ శిబిర్‌లో కేంద్రమంత్రుల ప్రశంసలు

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ ఆదర్శంగా ఉందని కేంద్రమంత్రులు, అధికారులు చెప్పారు. డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకం అమలు భేష్‌గా ఉందన్నారు. ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఆరోగ్య కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌ సర్కార్‌ను ప్రశంసించారు. ఉత్తరాఖండ్‌ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్వాస్థ్య చింతన్‌ శిబిర్‌ పేరుతో రెండురోజులు నిర్వహిస్తున్న కేంద్ర సమాఖ్య 15వ కాన్ఫరెన్స్‌ శుక్రవారం ప్రారంభమైంది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్‌ మన్సూక్‌ మాండవీయ, సహాయమంత్రులు భారతీప్రవీణ్‌పవార్‌, ఎస్పీ సింగ్‌ భాగేలా, పలువురు సీఎంలు, 15 రాష్ట్రాలకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు ఈ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాలు అనుసరిస్తున్న వైద్యవిధానాలు, ఆరోగ్య పథకాల అమలుపై కేంద్ర ఆరోగ్యశాఖ ప్రజెంటేషన్‌ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏపీలో అమలు చేస్తున్న వైద్యకార్యక్రమాలు, పథకాలపై కేంద్రమంత్రులు ప్రశంసలు కురిపించారు. వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకం, ఆయుష్మాన్‌ భారత్‌ డిజిటల్‌ మిషన్‌ (ఏబీడీఎం) అమలుతోపాటు పలు అంశాల్లో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చాలా బాగున్నాయని పేర్కొన్నారు. రెండువేలకుపైగా నెట్‌వర్క్‌ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద సేవలు అందిస్తుండటం గొప్ప విషయమన్నారు. ప్రజలకు డిజిటల్‌ వైద్యసేవల కల్పనకు సీఎం జగన్‌ ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకమని చెప్పారు. ఏబీడీఎం కార్యక్రమం అమలులో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, ఇతర రాష్ట్రాలు ఏపీ విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 80 శాతం మందికి ఆబా ఐడీలను ఏపీ ప్రభుత్వం జారీచేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ విధానాలపై కేంద్ర ప్రభుత్వ స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్యం పట్ల సీఎం జగన్‌ ప్రభుత్వం చూపుతున్న చొరవకు కేంద్ర సహకారం మరింతగా తోడైతే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌ జె.నివాస్‌ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష' నిర్వహణకు రూ.25 కోట్లు

- గ్రామ సచివాలయానికి రూ.15 వేలు, క్యాంపు జరిగే వార్డు సచివాలయానికి రూ.25 వేలు
- అదనంగా ప్రతి జిల్లాకు రూ.3 లక్షల చొప్పున కలెక్టర్లకు
- ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేసిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ



సాక్షి, అమరావతి: వ్యక్తిగత ప్రజా వినతులను సైతం సంతృప్తస్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణ ఖర్చుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు విడుదల చేసింది. ప్రభుత్వ ఆఫీసుల్లో అవసరం పడే వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు సంక్షేమ పథకాల అమలులో అర్హులైన వారు ఒక్కరూ మిగిలిపోకూడదన్న లక్ష్యంగా ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ఇంటింటా జల్లెడపడుతూ సర్వే నిర్వహించి, వారికి సంబంధించిన వినతుల పరిష్కారం కోసం జగనన్న సురక్ష పేరుతో ప్రత్యేకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సచివాలయాల వద్ద క్యాంపుల నిర్వహణకు గ్రామ సచివాలయానికి రూ.15 వేల చొప్పున, పట్టణ ప్రాంతాల్లో క్యాంపులు జరిగే వార్డు సచివాలయానికి రూ.25 వేల చొప్పున ఈ నిధులను విడుదల చేశారు. వీటికి తోడు అదనంగా ప్రతి జిల్లాకు రూ.మూడు లక్షల చొప్పున కలెక్టర్లుకు విడుదల చేశారు. ఈ నిధులను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ శుక్రవారం ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది.

తక్కువ రేట్లకే బియ్యం, కందిపప్పు విక్రయాలు

- నేటి నుంచే బియ్యం అమ్మకాలు • 15–20 శాతం తక్కువకు విక్రయం
- కార్పొరేట్‌ సామాజిక బాధ్యతలో భాగంగా సబ్సిడీ రేట్లకు విక్రయించనున్న వ్యాపారులు
- మూడ్రోజులుగా మిల్లర్లు, టోకు వర్తకులతో ప్రభుత్వం చర్చలు.. వ్యాపారుల సమ్మతి
- రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని మార్కెట్‌ రేట్లను బట్టి ధరల నిర్ణయం
- రైతుబజార్లు, కళ్యాణ మండపాలు, వ్యాపార సంస్థల వద్ద ప్రత్యేక కౌంటర్లు
- పైలెట్‌ ప్రాజెక్టు కింద పౌరసరఫరాల సంస్థ సైతం సొంతంగా బియ్యం విక్రయాలు
- 17 నుంచి పూర్తిస్థాయిలో కందిపప్పు విక్రయాలు కూడా..



సాక్షి, అమరావతి : నిత్యావసరాల ధరలను సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. కార్పొరేట్‌ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్‌)లో భాగంగా మిల్లర్లు, టోకు వ్యాపారులను ఇందులో భాగస్వాములను చేస్తోంది. మార్కెట్‌ ధరల కంటే 15–20 శాతం తక్కువ రేట్లకే బియ్యం, కందిపప్పును విక్రయించేలా ప్రోత్సహిస్తోంది. ఏపీలోని 26 జిల్లాల్లో శనివారం నుంచి తక్కువ ధరకు బీపీటీ, సూపర్‌ ఫైన్‌, ఫైన్‌ వెరైటీ బియ్యం విక్రయాలను ప్రారంభిస్తోంది. ఆయా జిల్లాల్లోని మార్కెట్‌ ధరల ప్రకారం జాయింట్‌ కలెక్టర్లు ఈ సబ్సిడీ రేట్లను నిర్ణయిస్తారు.

ప్రత్యేక కౌంటర్లలో..

దేశవ్యాప్తంగా గడిచిన రెండు నెలలుగా నిత్యావసరాల ధరలు వేగంగా పెరిగాయి. ఒక్కసారిగా బియ్యం, కందిపప్పు ధరలు అమాంతం పెరిగాయి. ఈ క్రమంలో ప్రజలపై అధిక రేట్ల భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. గత మూడ్రోజులుగా పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్లు, టోకు వ్యాపారులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా బియ్యం, కందిపప్పును మార్కెట్‌ ధర కంటే తక్కువకు విక్రయించాలని కోరగా.. అందుకు వ్యాపారులు ముందుకొచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలతో పాటు రైతుబజార్లు, కళ్యాణమండపాలు, రద్దీగా ఉండే మార్కెట్లు, వ్యాపారుల దుకాణాల ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ రేట్లకు బియ్యం, కందిపప్పును విక్రయించనున్నారు. ఒక వ్యక్తికి గరిష్టంగా ఒక కేజీ కందిపప్పు, 10 కేజీల ఫైన్‌ వెరైటీ బియ్యాన్ని అందిస్తారు.

వ్యాపారులను సమన్వయం చేస్తూ..

కొన్ని జిల్లాల్లో ఫైన్‌ వెరైటీ బియ్యం రకాల్లేవు. అయితే, వాటిని ఇతర జిల్లాల నుంచి వ్యాపారులతో కొనుగోలు చేయించి ప్రజలకు విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేస్తుంది. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పప్పుమిల్లులు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ చర్యలతో ఆయా ప్రాంతాల్లోని వ్యాపారులు సైతం తక్కువ రేటుకు కందిపప్పును విక్రయించేందుకు అంగీకరించారు. దీంతో అక్కడి నుంచి కందిపప్పు నిల్వలను మార్కెట్‌లోకి తరలిస్తారు. ఇక వచ్చే సోమవారం నుంచి కందిపప్పును పూర్తిస్థాయిలో తక్కువ రేటుకు అందిస్తారు.

కార్పొరేషన్‌.. కొత్త బ్రాండ్‌..

ఏపీ పౌరసరఫరాల సంస్థ సైతం సొంత బ్రాండింగ్‌తో బియ్యం రకాలను విక్రయించేందుకు ఏర్పాట్లుచేస్తోంది. ఇప్పటికే కర్నూలు నుంచి 50 టన్నుల బీపీటీ రకం ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వాటిని మిల్లింగ్‌ చేయగా 32 టన్నుల బియ్యం వస్తున్నట్లు గుర్తించారు. వీటిని పైలెట్‌ ప్రాజెక్టు కింది ప్రత్యేక ప్యాకింగ్‌లో మార్కెట్‌ రేటు కంటే తక్కువకు విక్రయించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. వచ్చే సీజన్‌ నుంచి పౌరసరఫరాల సంస్థ స్థానిక రైతుల నుంచి కందులను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయనుంది. అవసరమైతే మద్దతు ధరకు మించి మార్కెట్‌ రేటు ఉన్నా కొనుగోలు చేసి ప్రజా ప్రజలకు చేర్చనుంది. నవంబర్‌, డిసెంబర్‌లలో కందుల సేకరణకు ప్రత్యేకంగా కార్పస్‌ పెట్టడంతో పాటు కొనుగోలు చేసిన వెంటనే రైతులకు నగదు చెల్లించేలా ప్రతిపాదనలు రూపొందిస్తోంది.

నిల్వలపై పటిష్ట నిఘా

వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి నిత్యావసరాల రేట్లను పెంచకుండా పౌరసరఫరాల శాఖ పటిష్ట నిఘా ఏర్పాటుచేసింది. వివిధ వర్గాల వ్యాపారుల వద్ద సరుకు నిల్వలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ http://fcainfoweb. nic.in/psp వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని హెచ్చరిస్తోంది. నిల్వలు అధికంగా ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. గుంటూరు కోల్డ్‌ స్టోరేజీల్లోని కందుల నిల్వలను సైతం తనిఖీచేసి వాటిని కూడా బయట మార్కెట్‌లోకి తరలించనుంది.

111 ప్రత్యేక కౌంటర్లు..
రాష్ట్రవ్యాప్తంగా సీఎస్‌ఆర్‌ ద్వారా చౌకగా బియ్యం, కందిపప్పు విక్రయాలకు వీలుగా 111 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఇందులో 42 రైతుబజార్లలో, 56 ఓపెన్‌ మార్కెట్లలో ఉన్నాయి. వీటిల్లో సూపర్‌ ఫైన్‌ వెరైటీలతో పాటు బీపీటీ, సోనా మసూరి, సాంబామసూరి, ఆర్జీఎల్‌, స్టీమ్డ్‌ బియ్యం రకాలను అందుబాటులో ఉంచనున్నారు.

కేవలం ప్రజల కోసమే..



ప్రజలకు నిత్యావసరాల ధరలు అందుబాటులో ఉంచేందుకు మిల్లర్లు, వ్యాపారులతో చర్చించాం. వారి ద్వారా మార్కెట్‌ రేటు కంటే 15–20 శాతం తక్కువకు సరుకులు అందిస్తాం. ప్రజల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి తదుపరి నిర్ణయం తీసుకుంటాం. హోల్‌సేల్‌ వ్యాపారులు ఈ విక్రయాలను కేవలం ప్రజల కోసమే చేపడుతున్నారు. – హెచ్‌.అరుణ్‌కుమార్‌, కమిషనర్‌, పౌరసరఫరాల సంస్థ

చెప్పుతో కొట్టేవారు లేకే వలంటీర్లు ప్రశ్నలడుగుతున్నారు

- ప్రజల ఇళ్లల్లోకి చొరబడుతున్నారు
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: చెప్పు తీసుకుని కొట్టేవారు లేకే ప్రభుత్వ సర్వేల పేరుతో వలంటీర్లు ప్రజలను వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. వాళ్లు ఇళ్లలోకి చొరబడుతున్నారని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మేనిఫెస్టోలో చెప్పిన మహాశక్తి పథకాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజకీయం చేయవద్దని వలంటీర్లను కోరుతున్నట్లు చెప్పారు. ఆడపిల్లల వ్యక్తిత్వంపై పోస్టులు పెట్టే వైఎస్సార్‌సీపీ నేతలకు టీడీపీ నేతలు దీటుగా సమాధానం చెప్పాలని, చెప్పు ఫోటో తీసి వారికి పంపాలని సూచించారు. తప్పు చేసిన ప్రతి వైఎస్సార్‌సీపీ నేతనూ బోనెక్కిస్తానన్నారు. రాష్ట్రంలోని మహిళల స్థితిగతులను మహాశక్తి కార్యక్రమం ద్వారా మార్చేస్తానని తెలిపారు. అన్ని సమస్యలకు పరిష్కారం మహాశక్తి సంకల్పమన్నారు. మహాశక్తి కంకణం ధరించి 41 రోజులు దీక్ష చేస్తామని సంకల్పం చేయాలని చెప్పారు. సీఎం జగన్ చెప్పినట్లు ఒక బిడ్డకే అమ్మఒడి కింద రూ. 15 వేలు ఇచ్చి ఆ బిడ్డనే చదివిస్తే మరో బిడ్డ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అందుకే తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని తెలిపారు. సంపద సృష్టించే మంత్ర దండం టీడీపీ అని చెప్పారు. ఇసుకను అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలించి వైఎస్సార్‌సీపీ నేతలు కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. మళ్లీ జగన్ వస్తే ఇళ్లు, పొలాలు కొట్టేస్తారని, ఎవరికీ రక్షణ ఉండదని ఆరోపించారు. ఈ నాలుగేళ్లలో మహిళలపై 52,587 దాడులు, వేధింపుల ఘటనలు జరిగాయని అన్నారు. 22,278 మంది ఆడబిడ్డలు కనిపించకుండా పోయారని కేంద్రం చెబుతోందన్నారు. 3,372 అత్యాచారాలు, 41 సామూహిక అత్యాచారాలు జరిగాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర ధరల్ని పెంచేశారని విమర్శించారు. అనంతరం మహాశక్తి చైతన్య రథయాత్రను చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు.

చంద్రబాబు హిందూ వ్యతిరేకి

మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు హిందూ వ్యతిరేకి అని మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ఆరోపించారు. దేశంలోని ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ప్రముఖమైనదైన తిరుమల తిరుపతి దేవాలయం (టీటీడీ)పై బాబు, పవన్‌కళ్యాణ్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హిందూ దేవాలయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా రాజకీయాలు చేసుకోవాలని హితవు పలికారు. హిందూ దేవాలయాలను కించపరిస్తే సహించేది లేదన్నారు. ఢిల్లీలో న్యాయవాది సత్య సభర్వాల్‌తో కలిసి స్వామి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. చంద్రబాబు, పవన్ ఇద్దరూ కలిసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ఇష్టారీతిన అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. నిజానికి, చంద్రబాబు హిందువులకు ఏమీచేయలేదు. స్వయానా మామకే గౌరవం ఇవ్వని వ్యక్తి హిందువులకు ఎలా ఇస్తాడు? టీటీడీ చైర్మన్ క్రిస్టియన్ అని, తిరుమల ఆలయం సమీపంలో అన్యమత ప్రచారం జరుగుతోందనడం అబద్ధం. ప్రజా క్షేత్రంలో పోరాడలేకే చంద్రబాబు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. నిజానికి.. కాగ్ ద్వారా ఆడిట్‌కు టీటీడీ స్వచ్ఛందంగా ముందుకొచ్చింది.

వారి ఆరోపణలు అసత్యమని రుజువుచేస్తా

అలాగే, వైఎస్సార్‌సీపీ నేతలు తప్పుడు రశీదులిచ్చి శ్రీవాణి ట్రస్టు ద్వారా సొమ్ములు లూటీ చేస్తున్నారని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆరోపిస్తున్నారు. నేను స్వయంగా శ్రీవాణి ట్రస్టును సందర్శించి వారిరువురి ఆరోపణలు అవాస్తవమని రుజువు చేస్తా. టీటీడీపై చేస్తున్న ఆరోపణలు అసత్యమని నేను బలంగా నమ్ముతున్నాను. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల వ్యాఖ్యలు మతప్రాతిపదికన శతృత్వం సృష్టించేలా ఉన్నాయి. ఉద్దేశ, దురుద్దేశపూర్వకంగా శ్రీవారి భక్తుల మతపరమైన భావాలు రెచ్చగొట్టేలా ఉన్నాయి. ఇక టీటీడీలో అవకతవకలు జరిగాయంటూ ఢిల్లీ వచ్చి అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. తిరుమల ఆలయ ప్రతిష్ట తగ్గించేలా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై నేను వేసిన పరువు నష్టం దావా కేసు పురోగతిలో ఉంది.

త్వరలో చంద్రబాబు అరెస్టు ఖాయం: మంత్రి రోజా


మాట్లాడుతున్న రోజా, పక్కన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతిలో సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిసి గతంలో చేసిన అవినీతిపై సింగపూర్ ప్రభుత్వం విచారణ చేస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. ఆ కేసులో త్వరలోనే సింగపూర్ పోలీసులు చంద్రబాబుని అరెస్టు చేస్తారని, ఆయన జైలుకు వెళ్లటం ఖాయమని అన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఆవహించిన చంద్రముఖి పవన్ కళ్యాణ్ అని ప్రజలు అర్థం చేసుకున్నారని రోజా చెప్పారు. పవన్‌కు ధైర్యం ఉంటే జనసేన 175 స్థానాల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు.

నాపై ఆరోపణలు చేస్తే పరువు నష్టం కేసులు: లోకేశ్

మంగళగిరి: నాపై అసత్య ఆరోపణలు చేసిన ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ నాయకుడు దేవేందర్‌రెడ్డిలపై పరువు నష్టం కేసుతో పాటు, రూ.50 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కేసు వేసినట్టు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. ఇందుకోసం శుక్రవారం మంగళగిరి కోర్టుకు హాజరైన లోకేశ్ అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తన తల్లి, భార్య పాల వ్యాపారం చేయడం లేదని, సారా వ్యాపారం చేస్తున్నారని, వారిద్దరూ సారా తాగుతారంటూ ఎమ్మెల్సీ పోతుల సునీత అవమానించారని తెలిపారు. తన చిన్నమ్మ చావుకు తానే కారణమంటూ ట్విట్టర్ వేదికగా దేవేందర్‌రెడ్డి ఆరోపణలు చేశారని చెప్పారు. అవమానాలు భరించలేకే వారిపై కోర్టులో పరువు నష్టం దావా వేసినట్టు చెప్పారు. గతంలో తనపై పలు ఆరోపణలు చేశారని, ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని చెప్పారు.

పిన్ని ఆత్మహత్యపై సీబీఐ విచారణకు లోకేశ్ సిద్ధమా?

- ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి సవాల్
- లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాపయ్యింది
- అందుకే ఏడాది తర్వాత ఆయనకు పిన్ని గుర్తుకువచ్చింది

సాక్షి, అమరావతి: పిన్ని ఆత్మహత్యపై సీబీఐ విచారణకు నారా లోకేశ్ సిద్ధమా అని ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుర్రంపాటి దేవేందర్‌రెడ్డి సవాలు విసిరారు. దేవేందర్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. లోకేశ్ తనకు రూ. 50 కోట్ల పరువు నష్టం దావా నోటీసులు ఇచ్చినట్లు వచ్చిన కథనాలపై స్పందించారు. 'లోకేశ్ ప్రెస్‌మీట్‌లో చాలా ఆత్రుతగా మాట్లాడారు. 24 గంటలపాటు స్క్రిప్ట్ చదువుకొని కోర్టుకు వెళ్లి వచ్చారు. ఈ ఘటన జరిగింది గతేడాది ఆగస్టు 2న. ఏడాది పాటు లోకేశ్ ఎవరిదైనా సంక నాకుతున్నారా? లేక గాడిదలు కాశారా? ఇప్పుడు దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీతపై పరువు నష్టం దావా వేస్తున్నానని అంటున్నారు. లోకేశ్ పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఆయన పాదయాత్రను ప్రజలే కాదు.. టీడీపీ కార్యకర్తలు, చంద్రబాబు కూడా పట్టించుకోవడంలేదు. ఉన్న కాస్త హైప్ దత్తపుత్రుడు పవన్‌కు వెళ్తుందన్న భయం పట్టుకుంది. దీంతో పబ్లిసిటీ ఆశతో ఇలాంటివి తెరపైకి తెస్తున్నారు. ఏడాది తరువాత ఆయనకు పిన్ని గుర్తుకు వచ్చిందట. నోటీసులు ఏ అడ్రస్‌కు పంపించాలో లోకేశ్‌కు, ఆయన లాయర్లకు తెలియదు. ఆయనకు దేవేందర్‌రెడ్డి భయపడ్డారా? గతేడాది జూమ్ కాల్‌లో భయపడి పారిపోయింది ఎవరు? మా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పారిపోయింది నువ్వు. పారిపోవడం వైఎస్సార్‌సీపీ ఇంటా వంటా లేదు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ధైర్యంగా ముందుకు వెళ్తుంది. నా చిటికెన వేలు వెంట్రుక కూడా లోకేశ్ పీకలేరు. పరువు నష్టం దావా వేయడానికి అందులో ఏముంది? నీవు నిజంగా చంద్రబాబునాయుడి కొడుకువైతే ఇదే అంశంపై సీబీఐ విచారణ కోరు. లేదా సీఐడీ లేకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించు. ఇది చేస్తా, అది చేస్తా అంటే భయపడేవారు ఇక్కడ ఎవ్వరూ లేరు' అని దేవేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

పోలవరం నిర్వాసితుల సమస్యపై ఢిల్లీలో ధర్నా: సీపీఎం

అనంతపురం రూరల్: పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శుక్రవారం అనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగేలా పోరాటాలు సాగించాలని సీపీఎం తీర్మానం చేసిందన్నారు. మతతత్వ బీజేపీకి మద్దతుగా నిలుస్తున్న పార్టీలపైనా పోరాడుతామని చెప్పారు. నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు.

ఊగిపోతే విప్లవకారుడివా?

- పవన్ కళ్యాణ్‌కు మంత్రి అంబటి రాంబాబు చురకలు
- చెప్పులే కాదు.. పవన్‌కు బుద్ధి కూడా పోయింది
- నువ్వు ఎమ్మెల్యేగా నెగ్గలేవు.. నీ దత్తతండ్రిని సీఎం చేయలేవు
- తల్లిదండ్రులను గౌరవించని వ్యక్తి సంస్కారం గురించి మాట్లాడటం విడ్డూరం



సాక్షి, అమరావతి: సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజల గుండెల్లో కొలువైన ముఖ్యమంత్రి జగన్, వలంటీర్ల వ్యవస్థ పేరు వింటేనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భయంతో వణికిపోతున్నారని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని పలు సర్వేల్లో తేలడంతో పవన్ కళ్యాణ్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తూ మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ ఆవహించిన పవన్ రాజకీయాలకు తగడని ప్రజలు నిర్ధారించుకున్నారు. ఇక నువ్వు ఎమ్మెల్యేగా గెలవలేవు.. నీ దత్తతండ్రిని సీఎంను చేయలేవు' అని పవన్‌నుద్దేశించి తేల్చిచెప్పారు.

- కాపులను బీసీల్లో చేర్చి రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిన చంద్రబాబు, దుష్టచతుష్టయం పథకం ప్రకారమే పవన్ కళ్యాణ్ గోదావరి జిల్లాల్లో యాత్ర చేస్తున్నారు. ఆవేశంతో ఊగిపోతూ దూషిస్తున్నారు. గతంలోనూ ఆయన ఆవేశపడ్డారు. తుపాకీ పట్టుకుని తిరిగి తరువాత పోలీసులకు అప్పగించారు. కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ సెల్‌కు రూ.కోటి ఇస్తున్నానంటూ రేణు దేశాయ్‌తో ఓ చెక్కు కూడా ఇప్పించారు. ఆ కోటి ఏమైందో ఎవరికీ తెలియదు. అదిప్పుడు దుష్టచతుష్టయం ప్రొటెక్షన్ ఫోర్స్‌గా మారింది.
- ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 5 గంటలకే 2.68 లక్షల మంది వలంటీర్లు అవ్వాతాతల వద్దకు వెళ్లి పెన్షన్ చేతిలో పెడుతున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారు. వలంటీర్లలో 1.34 లక్షల మంది మహిళలే ఉన్నారు. ఇంత సేవ చేస్తున్న వలంటీర్లను మానవ అక్రమ రవాణా చేస్తున్నారంటూ పవన్ కళ్యాణ్ దూషించడం హేయం. పవన్‌పై వలంటీర్లు తిరగబడితే కొందరినే అన్నానంటూ మాటమార్చారు. తద్వారా తన చెప్పులే కాదు.. బుద్ధి కూడా పోయిందని పవన్ నిరూపించుకున్నారు.
- దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిపై 2009లో నోరు పారేసుకున్న పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరాడని అప్పట్లోనే ప్రజలు నిర్ణయించుకుని ప్రజారాజ్యం పార్టీని ఓడించారు. చెప్పుతో కొడతానంటూ ఊగిపోయిన పవన్ సంస్కారం గురించి మాట్లాడటం విడ్డూరం. తన తల్లి దీపారాధన చేస్తే ఆ దీపంతో సిగరెట్ ముట్టించుకునేంత హేతువాది తన తండ్రి అని వ్యాఖ్యానించిన పవన్ తల్లిదండ్రులకు ఏపాటి గౌరవం ఇచ్చారో ప్రజలకు అర్థమైంది. అందుకే నీ తండ్రి నీకు గాలి (పవన్) కళ్యాణ్ అనే పేరు పెట్టారు. సంస్కారహీనుడు పవన్.. సీఎం జగన్‌ను ఏకవచనంతో పిలిచినా బహువచనంతో పిలిచినా ఒరిగేదేంటి?
- వరాహం ఎక్కి మైక్ పట్టుకుని ఆవేశంతో ఊగిపోతే పవన్ విప్లవకారుడు అయిపోతారా? నీతో వ్యక్తిగత జీవితంలోనే కాదు రాజకీయ జీవితంలోనూ ఎవరూ కలసి నడవరు. నేను ఓడిపోయి రాపాక గెలవడమేంటి? అనే రీతిలో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం వల్లే ఆయన జనసేనను వీడారు. జేడీ లక్ష్మీనారాయణ, తమిళనాడు మాజీ సీఎస్ రామ్మోహన్ రావు, మాజీ ఐఏఎస్ తోట చంద్రశేఖర్ నుంచి మరిశెట్టి రాఘవయ్య వరకు, పవనిజం కర్త రాజు రవితేజ లాంటి వాళ్లెవరూ ఇప్పుడు పవన్‌తో లేకపోవడమే అందుకు నిదర్శనం.
- కామన్ మ్యాన్ ప్రొటెక్షన్.. యువరాజ్యం.. జనసేనను స్థాపించిన పవన్ తొలుత కమ్యూనిస్టులు ఆ తర్వాత టీడీపీ, బీజేపీ.. అనంతరం కమ్యూనిస్టులు, బీఎస్పీ.. ఆ వెంటనే బీజేపీతో ఉంటూ చంద్రబాబు కోసం పనిచేస్తున్నారు.
- నాదెండ్ల భాస్కర్‌రావు, దాసరి నారాయణ రావు, చిరంజీవి లాంటి వారెందరో రాజకీయ పార్టీలను పెట్టి ప్రజల వద్దకు వెళ్లారు. ఆ తర్వాత నిష్క్రమించారు. దివంగత వైఎస్సార్ మరణం తర్వాత పార్టీని స్థాపించిన జగన్ 2019 వరకు ఎన్ని పోరాటాలు చేశారో తెలుసా? 23 మంది ఎమ్మెల్యేలను బాబు కొనుగోలు చేసినా తొణకలేదు. పాదయాత్ర చేసి 2019 ఎన్నికల్లో 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుని అధికారంలోకి వచ్చారు. సీఎం జగన్ పేరు ఎత్తే నైతిక అర్హత పవన్‌కు లేదు.
- పవన్ నువ్వు ఒక్కో సినిమాకు ఎంత రెమ్యునరేషన్ తీసుకుంటున్నావు? ఎంత పన్ను కడుతున్నావు? నిజాయితీగా చెబితే నువ్వు ఎక్కి తిరిగేది వారాహినే. లేదంటే అది వరాహమే!
- పోలవరాన్ని కడుతోంది కేంద్రమేనని రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షురాలు పురందేశ్వరికి తెలియదేమో! కేంద్రం తరపున రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. నిర్మాణ బాధ్యతలను కమీషన్ల కోసం దక్కించుకుంది నాటి చంద్రబాబు సర్కారే.

వేగంగా.. కచ్చితంగా.. రక్త నిర్ధారణ ఇక సులభం

- రక్త పరీక్షలకు అధునాతన యంత్రాలు
- ప్రభుత్వాస్పత్రుల్లో ఏర్పాటు
- 640 రకాల వైద్య పరీక్షలు
- ఒక్కో మెషీన్‌కు రూ.20 లక్షల వ్యయం


భీమవరం ఏరియా ఆస్పత్రి ఏర్పాటుచేసిన ఆధునిక యంత్రం


రక్త పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ వీరాస్వామి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజారోగ్యమే పరమావధిగా సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రులు రూపురేఖలు మార్చడంతో పాటు ఆధునిక యంత్రాలను సమకూర్చుతోంది. ప్రభుత్వాస్పత్రుల భవనాలను ఆధునికీకరించడంతో పాటు అన్నిరకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. అలాగే అధునాతన పరికరాలు, మెషీన్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. దీంతో రక్త, వైద్య పరీక్షల ఫలితాలు వేగంగా, కచ్చితంగా వచ్చేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ఫుల్లీ ఆటోమెటిక్ ఎనలైజర్ ఎక్సెల్–640 యంత్రాలను ప్రభుత్వాస్పత్రుల్లో ఏర్పాటుచేస్తోంది. రూ.20 లక్షల విలువైన ఈ మెషీన్ ద్వారా 640 రకాల రక్త, ఇతర పరీక్షలను చేయవచ్చు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం ఆస్పత్రుల్లో, ఏలూరు జిల్లాలోని ఏలూరులోని సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్), నూజివీడు ఏరియా ఆస్పత్రుల్లో వీటిని ఏర్పాటుచేశారు.

ఖర్చు లేకుండా ఖరీదైన పరీక్షలు

ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు రక్త పరీక్షలను ఈ మెషీన్ ద్వారా ఉచితంగా చేస్తున్నారు. దీంతో ముఖ్యంగా గర్భిణులకు చాలా మేలు జరుగుతోంది. గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లో చేయాలంటే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. ఇలాంటి ఖరీదైన పరీక్షలను సైతం ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నారు. ఇది పేద రోగులకు ఊరట కలిగిస్తోంది.

రోజుకు వెయ్యి మంది వరకూ..

పశ్చిమగోదావరి జిల్లాలోని నాలుగు ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్కోచోట500 నుంచి 1,000 మంది వరకు రక్తపరీక్షలు చేయించుకుంటున్నారు. అయా ఆస్పత్రుల్లో ఓపీని బట్టి పరీక్షలు ఉంటున్నాయి. రోజుకు భీమవరంలో 500 మంది, తణుకులో 1,000 మంది, తాడేపల్లిగూడెంలో 800 మంది, నరసాపురంలో 400 మంది రక్త పరీక్షలను వైద్య సిబ్బంది చేస్తున్నారు.

గొప్ప విషయం



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో నా భార్యకు రక్త పరీక్షలను నూతన టెక్నాలజీ గల మెషీన్ ద్వారా చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన మెషీన్ ద్వారా పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేసేలా ఉచితంగా రక్త పరీక్షలు చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇది పేదలకు మేలు చేస్తుంది.

–దాసరి హరికృష్ణ, సీసలి

ఉచితంగానే పరీక్షలు



నాకు భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలను ఉచితంగా చేశారు. అదే ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలు చేయించుకుంటే నాకు రూ.3 వేల వరకు ఖర్చయ్యేది. ముఖ్యమంత్రి జగనన్న అన్నిరకాల వైద్య పరీక్షలు ఆస్పత్రిలో చేసేలా సౌకర్యాలు కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

–బి.దుర్గ, గర్భిణి, మైప వద్దిగూడెం

సద్వినియోగం చేసుకోవాలి

పశ్చిమగోదావరి జిల్లాలోనినాలుగు ఆస్పత్రుల్లో ఎక్సెల్–640 మెషీన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ మెషీన్ కచ్చితమైన ఫలితాలు ఇస్తుంది. ఆస్పత్రులకు వచ్చే వారిలో రక్త పరీక్షలు అవసరమైన వారు, గర్భిణులు ఈ మెషీన్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ ఎం.వీరాస్వామి, డీసీహెచ్‌ఎస్, భీమవరం

ఏఏ రకాల పరీక్షలంటే..

ఫుల్లీ ఆటోమెటిక్ ఎనలైజర్ ఎక్సెల్–640 మెషీన్ ద్వారా కిడ్నీ, లివర్, షుగర్, ఫీవర్, హెచ్‌బీ, సోడియం, పొటాషియం, కాల్షియం, కొలెస్ట్రాల్, ప్లేట్‌లెట్స్ తదితర రక్త పరీక్షలు చేస్తున్నారు.

గతంలో ప్రైవేట్ ల్యాబ్‌ల్లోనే..

గత టీడీపీ పాలనలో ప్రభుత్వాస్పత్రుల్లో ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండేది. దీంతో ఆస్పత్రులకు వచ్చే గర్భిణులు, రోగులు రక్తపరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఇటువంటి ఇబ్బందులేవీ లేకుండానే ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక యంత్రాల ద్వారా ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నారు.

'పంచకర్ల'ది తొందరపాటు చర్య: వైవీ సుబ్బారెడ్డి



డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయడం పంచకర్ల రమేష్‌బాబుది తొందరపాటు చర్యేనని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. విశాఖ గురజాడ కళాక్షేత్రంలో మెప్మా ఏర్పాటు చేసిన ప్రదర్శనను శుక్రవారం వైవీ ప్రారంభించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ విషయమైనా తనతో చర్చించి ఉంటే బాగుండేదని, కానీ ఏమీ చర్చించకుండా పార్టీకి రాజీనామా చేయడం తొందరపాటు చర్యేనన్నారు. రమేష్‌బాబు మంచి నాయకుడని, ఆలోచన చేయకుండా రాజీనామా చేయడం కరెక్ట్ కాదన్నారు. ముఖ్యమంత్రిని కలవనీయడం లేదని పంచకర్ల అనడం అవాస్తవమని, సీఎం విశాఖకు వచ్చిన ప్రతీసారి జిల్లా అధ్యక్షులను కలిసే అవకాశం కల్పించామన్నారు. ఆయన రాజీనామా వల్ల పార్టీకి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

● తెలంగాణ

ప్రజల దృష్టిని మళ్లించేందుకే యూసీసీ

ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, చైనా చొరబాటు లాంటి వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే యూసీసీ అమలు ప్రతిపాదన తెచ్చారని హైదరాబాద్ ఎంపీ, ఆల్ ఇండియా మజ్లిస్–ఏ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. శుక్రవారం మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన దారుస్సలాంలో ఆయన మీడియాతో మాట్లాడారు. యూసీసీ అమలు గురించి తెలంగాణలోని ఆదిలాబాద్‌కు వచ్చి గోండు సామాజిక వర్గానికి చెప్పాలని ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. గతంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ ఈ అంశాన్ని లేవనెత్తిందని, వచ్చే 2024 ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందడమే దాని లక్ష్యమని ఒవైసీ ధ్వజమెత్తారు. కామన్ లా కోడ్‌పై సూచనల కోసం అప్పీల్ చేసిన లా కమిషన్‌కు యూసీసీపై తమ పార్టీ స్పందనను పంపామని వివరించారు. ఇటీవల, భోపాల్‌లో ప్రధాని మోదీ యూసీసీపై ముస్లింలను తప్పుదోవ పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారని, 'ఒక ఇంట్లో ఒక సభ్యునికి ఒక చట్టం, మరొకరికి మరొక చట్టం ఉంటే ఆ ఇంటిని నడపగలమా? అని ప్రశ్నించారు. యూనిఫాం సివిల్ కోడ్‌పై కేరళ గవర్నర్ చేసిన వ్యాఖ్యలపై ఒవైసీ మండిపడ్డారు.

ఏపీ సీఎం జగన్‌ను కలుస్తా

ఏపీ సీఎం జగన్ తనకు మిత్రుడని, త్వరలో ఆయనను యూసీసీ అంశంపై కలుస్తామని అసదుద్దీన్ ఓవైసీ వెల్లడించారు. ఇప్పటికే ఆయన తనను లంచ్‌కు ఆహ్వానించారని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో సమావేశమై యూసీసీకి వ్యతిరేకంగా మద్దతు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించడంతో పాటు భావస్వారూప్య పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

20 నుంచి ఎంబీబీఎస్ సీట్లకు జాతీయ కౌన్సెలింగ్

షెడ్యూల్ ప్రకటించిన ఎంసీసీ

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లోని 15 శాతం సీట్లను అఖిల భారత కోటా కింద భర్తీ చేయనున్నారు. కాలేజీలు, సీట్ల వివరాలను ఈ నెల 20వ తేదీన ఎంసీసీ, ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని, అదే రోజున ఉదయం పది గంటల నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ల నమోదుకు గడువు ఇవ్వనున్నట్టు తెలిపింది. 29వ తేదీన సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేస్తారు. ఆగస్టు నాలుగో తేదీ నాటికి కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 7 నుంచి 28వ తేదీ వరకూ రెండో దశ, ఆగస్టు 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకూ మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. మూడో దశలో మిగిలిన సీట్లకు సెప్టెంబర్ 21వ తేదీ నుంచి స్ట్రే వెకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది.

5శాతం అఖిల భారత కోటా కౌన్సెలింగ్‌లో..

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కౌన్సిలింగ్‌లో భర్తీ చేస్తారు. ఈ సీట్లల్లో జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చేరతారు. కాగా, ఈసారి ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను మార్పు చేయాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) భావించింది. ఆ ప్రకారం అఖిల భారత స్థాయి కౌన్సిలింగ్, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్‌ను ఒకేసారి ప్రారంభించాలని నిర్ణయించింది. కానీ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈసారి కొత్త విధానంలో కాకుండా పాత పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అంటే అఖిల భారత కౌన్సెలింగ్ తర్వాతే రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆ మేరకు జాతీయ, రాష్ట్రస్థాయి కౌన్సెలింగ్‌లు వేర్వేరు తేదీల్లో కొనసాగుతాయి. అయితే రాష్ట్రాల కౌన్సెలింగ్ ఎప్పుడు ప్రారంభించాలన్న దానిపై ఎన్ఎంసీ ఇప్పటివరకు షెడ్యూల్‌ను ప్రకటించలేదు.

వరద సహాయ చర్యలకు సన్నద్ధం

- పక్కాగా ముందస్తు ఏర్పాట్లు
- డిపోల్లో బియ్యం నిల్వలు
- మరబోట్లు, లాంచీలు అందుబాటులో ఉండేలా చర్యలు
- ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం


వరద బాధితులను తరలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం (ఫైల్)

బుట్టాయగూడెం: గోదావరికి వరద పెరిగే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తమయ్యారు. వరద సహాయక చర్యలకు పక్కా ఏర్పాట్లు చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో తాలిపేరు వద్ద వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి కిందకు వదిలారు. దీంతో భద్రాచలం వద్ద వరద నీరు వచ్చి చేరుతోంది. గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది గోదావరి వరద కష్టాల నుంచి ముంపు గ్రామాల బాధితులను గట్టెక్కించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ జిల్లా అధికారులను అప్రమత్తం చేసి ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి సహాయ చర్యలపై సమీక్షించారు. ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర సరుకులను సమకూర్చి ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేలా ఏర్పాట్లు చేశారు.

726 క్వింటాళ్ల బియ్యం

ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులను సకాలంలో అందించేలా అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను డిపోల్లో సిద్ధం చేస్తున్నారు. కుక్కునూరు మండలంలో 465.310 క్వింటాళ్లు, వేలేరుపాడు మండలంలో 260.780 క్వింటాళ్ల బియ్యాన్ని వరద బాధితులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.

సమాచార సేకరణకు శాటిలైట్ ఫోన్లు

వరదల సమయంలో సమాచార సేకరణ కోసం అధికారులు శాటిలైట్ ఫోన్లు సిద్ధం చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తహసీల్దార్ల వద్ద ఉంచి వీటి నుంచి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ఉన్నతాధికారులకు అందించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే లాంచీలు, మరబోట్లు, జనరేటర్లు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

గతేడాది సేవలు భేష్

గతేడాది గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 90 గ్రామాలు నీటమునిగాయి. దీంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఆ సమయంలో సీఎం జగన్ నిత్యం కలెక్టర్‌తో మాట్లాడి సహాయక చర్యలపై దిశానిర్దేశం చేశారు. యుద్ధప్రాతిపదికన పునరావాస, సహాయక చర్యలు చేపట్టారు. దీంతో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, అప్పటి జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ నేతృత్వంలో పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, పంచాయతీరాజ్, పౌరసరఫరాల శాఖ, డీఆర్‌డీఏ, జిల్లాపరిషత్, గ్రామ సచివాలయాలు, ఏలూరు కార్పొరేషన్‌తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల ఉన్న ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి అధికారుల వరకు ముంపులోనే మకాం వేసి సేవలందించారు. అలాగే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్ బృందాలు సైతం ఉత్తమ సేవలందించాయి.

19 వేల కుటుంబాలకు నిత్యావసరాలు

గతేడాది ముంపు ప్రాంతాల్లోని సుమారు 19 వేల కుటుంబాలకు పైగా నిత్యావసర సరుకులను ప్రభుత్వం అందించారు. 24 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 6,514 కుటుంబాలకు చెందిన 19,631 మందికి ఆశ్రయం కల్పించారు. 4,500 టార్పాలిన్స్, 13 వేల కొవ్వొత్తులు, 500 దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే కుటుంబానికి 25 కిలోల బియ్యం చొప్పున 5.08 లక్షల కిలోలు, కిలో కందిపప్పు చొప్పున 20,402 కిలోలు, 20 వేల కిలోల పామాయిల్, 35 వేల లీటర్ల పాలు, కూరగాయల కిట్లు అందజేశారు. వరద పునరావాసం సహాయం కింద 7,700 కుటుంబాలకు సుమారు రూ.1.45 కోట్ల ఆర్థిక సాయం అందించారు. వరద సహాయక చర్యల్లో రెండు హెలికాఫ్టర్లు కూడా సేవలందించాయి. ఇదే మాదిరిగా సేవలందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది.

సేవా వలంటీర్లు


వేలేరుపాడు మండలం శివకాశీపురం శిబిరంలో వృద్ధులకు సేవలందిస్తున్న వలంటీర్లు (ఫైల్)

నాడు వరద సహాయక చర్యల్లో గ్రామ వలంటీర్లు ముందంజలో ఉన్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని వలంటీర్లు చురుగ్గా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పునరావాస శిబిరాల్లో వరద బాధితులకు నిత్యావసర సరుకులు, భోజన ఏర్పాట్లలో సాయపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల నష్ట పరిహారం అందించడంలోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇదే మాదిరి ఈ ఏడాది కూడా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని వలంటీర్లు అంటున్నారు.

ఓ దేవతలారా!
మా చెవులు ఎల్లవేళలా శుభమైన దానినే వినుగాక!
మా నేత్రములు ఎల్లవేళలా శుభప్రదమైనదే దర్శించుగాక!
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 15 జూలై 2023

మరింత పదునెక్కిన చెలిమి!

అంతర్జాతీయ వ్యవహారాల్లో సొంత గొంతు వినిపించటంలో సారూప్యత కలిగివుండే భారత్–ఫ్రాన్స్‌ల మధ్య వ్యూహాత్మక చెలిమి ఏర్పడి ఇరవై అయిదు వసంతాలు పూర్తయిన తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆ గడ్డపై అడుగుపెట్టారు. రెండు రోజుల పర్యటనలో శుక్రవారం ఆయన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించే బాస్టిల్ డే ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నావికా దళ అవసరాల కోసం ఉద్దేశించిన 26 రాఫెల్ జెట్ ఫైటర్లు, మూడు స్కార్పీన్ రకం జలాంతర్గాముల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలవుతున్నాయి. రక్షణ రంగంలో సహకరిస్తున్న ఫ్రాన్స్ ఈ ఒప్పందాలతో రష్యా తర్వాత మనకు ఆయుధాలు విక్రయించే రెండో పెద్ద సరఫరాదారు కాబోతోంది. ఇప్పటికే మనం ఫ్రాన్స్ నుంచి 36 రాఫెల్ జెట్ విమానాలు, ఆరు స్కార్పీన్ రకం జలాంతర్గాములు కొనుగోలు చేశాం.

ఇరు దేశాలమధ్యా సాన్నిహిత్యం ఈనాటిది కాదు. 1916లో మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రాన్స్‌ను చేజిక్కించుకొనేందుకు నాటి జర్మనీ చేసిన ప్రయత్నాలను డన్‌కిర్క్ పట్టణంలో వమ్ము చేసింది మన దేశానికి చెందిన పంజాబ్ రెజిమెంట్ జవాన్లే. ఆ విజయానికి గుర్తుగా అప్పట్లో పారిస్ వీధుల్లో మన జవాన్లు కవాతు కూడా జరిపారు. దాన్ని గుర్తుచేసుకుంటూ శుక్రవారం బాస్టిల్ డే సందర్భంగా అదే రెజిమెంట్‌కు చెందిన మన సైనికులు 107 ఏళ్ల సుదీర్ఘకాలం అనంతరం కవాతు చేశారు. మనకు స్వాతంత్ర్యం వచ్చాక తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఫ్రాన్స్‌తో సాన్నిహిత్యాన్ని కోరుకున్నారు. 1950 తర్వాతనుంచీ రెండు దేశాల మధ్యా అణు, అంతరిక్ష రంగాల్లో సహకారం కొనసాగుతోంది. ముఖ్యంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడిన గత 25 సంవత్సరాలుగా భారత్–ఫ్రాన్స్ చెలిమి ఎన్నో సంక్లిష్ట సందర్భాలను తట్టుకుని నిలబడింది. 1998లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి హయాంలో మన దేశం పోఖ్రాన్‌లో అణ్వస్త్ర పరీక్ష నిర్వహించినప్పుడు అమెరికాతో సహా అగ్ర రాజ్యాలు తీవ్ర విమర్శలకు దిగాయి. కానీ ఆ సమయంలో ఫ్రాన్స్ అన్నివిధాలా అండగా నిలబడింది. యూరోప్ యూనియన్ (ఈయూ) శిఖరాగ్ర సదస్సులో భారత్‌ను అభిశంసిస్తూ, దానిపై ఆంక్షలకు పిలుపునిస్తూ బ్రిటన్ తీర్మానం ప్రతిపాదించబోయినప్పుడు వీటో చేస్తానని హెచ్చరించి ఆ ప్రయత్నాన్ని నిలువరించింది ఫ్రాన్సే. రెండు దేశాల విదేశాంగ విధానంలో ఎన్నో పోలికలు కూడా ఉన్నాయి. అమెరికాతో సఖ్యంగా మెలగుతూనే ఏదోమేరకు స్వతంత్రతను పాటించటం భారత్, ఫ్రాన్స్‌లు మొదటినుంచీ అనుసరిస్తున్న విధానం. అమెరికా బద్ధశత్రువులైన ఇరాన్, రష్యాలతో సాన్నిహిత్యం నెరపడంలోనూ ఇద్దరిదీ ఒకే ఆలోచన. ఏకధ్రువ ప్రపంచం ఏర్పడాలని, అది కూడా తన నాయకత్వంలోనే ఉండాలని తహతహలాడే అమెరికా వైఖరికి భిన్నంగా ఏ ఒక్కరి ఆధిపత్యమో ఉండటం చేటు తెస్తుందని భావించటంలోనూ భారత్, ఫ్రాన్స్‌లమధ్య పోలిక ఉంది. ఎవరిపైనా సంపూర్ణంగా ఆధారపడే ధోరణి సరికాదని, ఏ దేశానికైనా స్వావలంబన సాధించటం అవసరమని గుర్తించటంలోనూ ఇద్దరూ ఇద్దరే. బహుశా అందువల్లే కావొచ్చు... పరస్పరం సహకరించుకోవటం ద్వారా భిన్న రంగాల్లో ఎదగటానికి రెండు దేశాలూ ప్రయత్నిస్తున్నాయి. వ్యూహాత్మక చెలిమిలో ముందడుగు వేస్తున్నాయి. అమెరికా మనతో సఖ్యంగా ఉంటున్నా ఆ చెలిమికి ఎప్పుడూ పరిమితులుంటున్నాయి. ఆ దేశంతో మనం కుదుర్చుకునే రక్షణ ఒప్పందాలకు ఎన్నో అవరోధాలుంటాయి. అక్కడి కాంగ్రెస్ వాటిని ఆమోదించాలి. రక్షణ పరికరాలకు సంబంధించి అమల్లోవుండే ఎగుమతుల నియంత్రణ వ్యవస్థలను దాటాలి. ఈ క్రమంలో ఎక్కడైనా ఆగిపోవచ్చు. లేదా జాప్యం చోటుచేసుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో రక్షణ కొనుగోళ్లకు అంగీకరించినా, సాంకేతికత బదిలీ సాధ్యపడదు. ఉదాహరణకు మన తేలిక రకం యుద్ధ విమానం తేజస్‌కు జీఈ ఎఫ్ 414 ఇంజిన్ అమర్చేందుకు అమెరికాతో ఒప్పందం కుదిరింది. దాని సాంకేతికత బదిలీకి మాత్రం అంగీకరించలేదు. ఫ్రాన్స్‌తో ఈ పేచీ లేదు. దానితో కుదుర్చుకునే ఒప్పందాలకు అవాంతరాలుండవు. సాంకేతికత బదిలీకి అభ్యంతరాలుండవు. జీఈ ఎఫ్ 414 ఇంజిన్ మాదిరే పనిచేసే ఫ్రాన్స్ సఫ్రాన్ ఇంజిన్‌ను ఇక్కడే ఉత్పత్తి చేయడానికి ఆ దేశం అంగీకరించింది. సాంకేతికత బదిలీ చేయటం వల్ల కేవలం రక్షణ ఉత్పత్తులు విక్రయించే దేశమే కాక, కొనుగోలు చేస్తున్న దేశం కూడా లబ్ధిపొందటానికి అవకాశముంటుంది. రెండు దేశాలూ పర్యావరణ రంగంలో కూడా పరస్పరం సహకరించుకోవటానికి ఇప్పటికే నిర్ణయించాయి. నిరుడు అక్టోబర్‌లో గ్రీన్ హైడ్రోజన్‌పై ఒప్పందం కుదుర్చుకుని, పరస్పర భాగస్వామ్యంతో ప్రపంచానికి విశ్వసనీయమైన, స్థిరమైన హరిత ఇంధనాన్ని అందించే దిశగా ఇరు దేశాలూ అడుగులు వేస్తున్నాయి. ఇంకా కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డిజిటల్ టెక్నాలజీ, 6జీ తదితర అంశాల్లో సమష్టిగా పనిచేస్తున్నాయి. క్వాడ్, జీ 20 తదితర వేదికల్లో ఒకే గళం వినిపిస్తున్నాయి.

అలాగని విభేదాలు లేకపోలేదు. ఉక్రెయిన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఉక్రెయిన్‌కు గట్టి మద్దతుదారుగా నిలబడింది. ఆయుధాలు సరఫరా చేస్తోంది. మన దేశం మాత్రం దురాక్రమణ ఆపాలని రష్యాను కోరడం మినహా అమెరికా, ఈయూ దేశాల తరహాలో రష్యా వైఖరిని ఖండించటంలేదు. అలాగే చైనా విషయంలోనూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ భిన్న వైఖరితో ఉన్నారు. విభేదించుకునే అంశాల్లో అవతలి పక్షం అవగాహన తెలుసుకోవటం, వారిని ఒప్పించే ప్రయత్నం చేయటంలోనే దౌత్య నైపుణ్యం వెల్లడవుతుంది. చిరకాల మిత్ర దేశమైన ఫ్రాన్స్ మోదీ పర్యటన తర్వాత మనకు మరింత సన్నిహితమవుతుందని ఆశించాలి.

భ్రాంతి జనిత ‘అర్ధ భూస్వామ్యం’

అభిప్రాయం




డా॥ పట్టా వెంకటేశ్వర్లు

కమ్యూనిస్టు పార్టీలన్నీ వ్యవసాయ రంగంలో అర్ధ–భూస్వామ్య వ్యవస్థ నెలకొని ఉందనే నిర్ధారిస్తున్నాయి. అందుకని వ్యవసాయ విప్లవమే ఇరుసుగా ఉండాలని అంటున్నారు. ఈ విప్లవం ద్వారా వ్యవసాయ కార్మికులకూ, పేద రైతులకూ భూపంపిణీ చేయాలని వారంటున్నారు. అయితే భూపంపిణీ కోరుతూ దేశంలో ఏ మూలనైనా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు జరుగుతున్నాయా అనేది ఆలోచించాల్సిన ప్రశ్న. ఇలాంటి ప్రశ్నలకు జవాబులు వెదుక్కోవటానికైనా అర్ధ భూస్వామ్యంపై ఆధారపడిన ‘వ్యవసాయక విప్లవ ఇరుసు’ గురించి చర్చ జరగాలి. అయితే దీనికి ముందు కమ్యూనిస్టు పార్టీల రాజకీయ కార్యక్రమాలను చూడాలి.

‘ఉత్పాదక శక్తులపై బంధనాలను బద్దలు కొట్టటమే భారతీయ సమాజ పునరుజ్జీవానికి మార్గం. పరాన్నభుక్తమైన భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలి. వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకూ భూమి పంపిణీ చేయాలి. ఎందుకు ఈ పని చేయాలి అంటే, బడా బూర్జువా వర్గం, భూస్వాములతో మైత్రి ఏర్పరచుకొని రాజీపడింది. కాబట్టే ప్రస్తుత బూర్జువా, భూస్వామ్య పాలనలో ప్రజల వెనుకబాటుతనం, దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం, దోపిడీల నుండి విముక్తి కలిగే ఆశ లేదనీ మన అనుభవం చెబుతున్నది. కాబట్టే పెట్టుబడిదారి పూర్వ సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయడం, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వేచ్ఛాయుత అభివృద్ధికి తప్పనిసరి ముందు షరతు. అలాగే ప్రస్తుత భారత సమాజం గుత్త పెట్టుబడిదారి ప్రాబల్యంలో కుల, మత, గిరిజన వ్యవస్థలు కలగలిపిన విచిత్ర సంగమంగా ఉంది. అందుకనే ప్రజాతంత్ర విప్లవ పరిపూర్తికి మార్గం సుగమం చేయడానికి, సోషలిస్టు సమాజ పరివర్తనకు భూమిక సిద్ధం చేయడానికి వీలుగా పెట్టుబడిదారి పూర్వ సమాజ విధ్వంసం పట్ల ఆసక్తిగల అన్ని ప్రగతిశీల శక్తులను ఐక్యం చేయాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై, దాని పార్టీపైన పడింది’’ అని సీపీఎం రాజకీయ కార్యక్రమంలో ఉంది. ఈ విధంగా సీపీఎం వారు పెట్టుబడిదారి పూర్వ సామాజిక వ్యవస్థను ధ్వంసం చేయాలనటం సరైనదే. మరి వారు అంటున్నట్లు ఇంకా అర్ధ భూస్వామ్యం ఉందా? దీనికి సంబంధించి సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాజకీయ కార్యక్రమం (2004)లో ‘భారతదేశపు అర్ధ ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థలో నూటికి దాదాపు 20 శాతంగా ఉన్న భూస్వాములు (మాజీ రాజులు, భూస్వాములు) మరియు ధనిక రైతుల చేతుల్లో 75 శాతం భూమి కేంద్రీకృతమై ఉంది. కాగా భూదాహంతో నిండి గ్రామీణ ప్రాంత జనాభాలో 80 శాతంగా ఉన్న రైతుల చేతుల్లో కేవలం 25 శాతం భూమి మాత్రమే ఉంది.’ ఈ విధంగా న్యూడెమోక్రసీ వారు వ్యవసాయక విప్లవ ప్రజాయుద్ధం కోసం ఇస్తున్న అర్ధ భూసామ్య గణాంకాలు మాట వరసకు చెప్పే లెక్కలు లాగే ఉన్నాయి. వాస్తవం ఏమిటి? 1970లో భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి విధానమేమిటనే విషయంలో ఎంతోమంది మేధావులు చర్చించారు. టీజే బైర్స్ అనే మేధావి భారత ఆర్థిక విధానాన్ని ‘సెమీ ఫ్యూడల్’ అని 1960లో నిర్వచించారు. అయితే ప్రపంచమంతటా ‘పారిశ్రామిక కేపిటలిజ’మే ఏకైక శక్తిగా రాజ్యమేలుతున్నప్పుడు సమకాలీన భారతదేశంలో రైతుకూలీల వ్యవసాయ ఆర్థిక స్వరూపాన్ని పాక్షిక ఫ్యూడల్ విధానంగా పేర్కొనటం అంత ఉపయోగకరం కాదని కూడా అంటాడు. వారు చెప్పినట్లు మన సమాజం పారిశ్రామిక కాపిటలిజాన్ని దాటి 1980 వ దశకం నుండి ‘ఫైనాన్స్ కాపిటలిజం’లోకి ప్రవేశించింది. మొత్తంగా భారత వ్యవసాయ వ్యవస్థపై జరిగిన చర్చ అనంతరం ‘ఎలీస్ థార్నర్ ‘భారతదేశంలో ఉత్పత్తి వ్యవస్థ స్పష్టంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థే’నని అంటారు. కాబట్టి కమ్యూనిస్టులు చెబుతున్నట్లు అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ కాదనీ భారతదేశంలో ఉన్నది పెట్టుబడిదారి విధానమేననీ, దాన్ని అధ్యయనం చేసే శ్రద్ధలేని మార్క్సిస్టులు చైనాను గుడ్డిగా, యథాతథంగా అనుకరిస్తూ అర్ధ–భూస్వామ్య సూత్రీకరణ చేశారనీ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ రుద్ర 1970లోనే ఒక ఆరోపణ చేశారు. ఈ చర్చ ముగిసి ఐదు దశాబ్దాలు పూర్తికావచ్చినా నేటికీ ప్రధాన వామపక్షపార్టీలు, ఎమ్ ఎల్ పార్టీలతో సహా భారత వ్యవసాయం అర్ధఫ్యూడల్ అనే అవగాహనతోనే వున్నాయి. అలాగే వ్యవసాయం ప్రత్యక్షంగా పూర్తిగా పెట్టుబడిదారీ వ్యవస్థలో లీనమవుతున్న ఋజువులు కనబడుతూ వున్నాయి. ఈ కారణాన సాంప్రదాయక వామపక్ష ఉద్యమ సంస్థలు భ్రాంతి జనిత భూస్వామ్య భూతంపై పోరాటం మాని పెట్టుబడిదారీ దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికులు, నిరుపేద రైతుల ప్రయోజనాల గురించి మాట్లాడ్డంపై, వారిని సంఘటితం చేయడంపై తమ దృష్టి పెట్టాలని ప్రఫుల్ బిద్వయ్ లాంటి వారు సూచిస్తున్నారు.

అయితే ఈ ఆర్థిక వేత్తలందరూ భారతీయ సమాజ ప్రత్యేక లక్షణమైన కుల వ్యవస్థను పరిగణనలోకి తీసుకోలేదు. పెట్టుబడిదారీ పూర్వ అవలక్షణమైన అగ్రకుల ఏకస్వామ్యాలను కమ్యూనిస్టులు బద్దలు చెయ్యరా? అందుకు కేవలం ఒక్క వ్యవసాయ రంగంలో భూములు పంచితే సరిపోతుందా? ఇలాంటి అంశాలపై చర్చ జరగాలి.

వ్యాసకర్త ఆర్థిక శాస్త్ర ఆచార్యులు । 9959649097



రామోజీ! ఇవన్నీ సాధ్యమయ్యాయిగా?

ఉన్నత విద్యపై ముఖ్యమంత్రి విజన్‌కు ‘ఈనాడు’ వక్రభాష్యం | **ప్రాథమిక స్థాయి నుంచి ఎన్ని సంస్కరణలు తెచ్చినా వంకర రాతలే**

నిజాలకు పాతరేసి.. అబద్ధాలు అందంగా అచ్చు వేయటంలో ‘ఈనాడు’ దిట్ట. ఏలినవారు కావాల్సిన వారైతే... ఏమీ చేయకపోయినా సాహో.. అంటూ పొగడ్తలు కురిపిస్తుంది. అదే అధికారం తమవారి చేతుల్లో లేకపోతే మాత్రం... ‘ప్రతిపక్ష’ పాత్ర పోషిస్తుంది. ఈ విషయాన్ని ఒకనాడు కోర్టుకే నేరుగా చెప్పారు ఘనత వహించిన రామోజీరావు. ఇదంతా ఎందుకంటే... ఉన్నత విద్యా వ్యవస్థలో తీసుకు రావాల్సిన మార్పులను వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తన విజన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల వీసీలతో సమావేశమై భవిష్యత్తులో చేపట్టాల్సిన మార్పులను చర్చించారు. అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న టెక్నాలజీలను మన పిల్లలు ఒడిసి పట్టుకోవటానికి యూనివర్సిటీలు ఏం చేయాలో ఆయన చెప్పారు. ఆ వార్త యథాతథంగా వేస్తే... ముఖ్యమంత్రి విజన్ అందరికీ తెలుస్తుందని, చదువుకున్న వారిలోను, విద్యార్థుల్లోను సానుకూలత వస్తుందని భయపడిన రామోజీరావు... ‘సీఎంగారూ! ఇదెలా సాధ్యం?’ అంటూ తన పైత్యం మొత్తాన్ని జోడించి ఒక కథనాన్ని వండేశారు. యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టలేదని, నిధులు మళ్లించేస్తున్నారని, వైస్‌చాన్స్‌లర్లుగా, పాలకమండలి సభ్యులుగా అధికార పార్టీకి కావాల్సిన వారిని నియమించారని... ఇలా చేతికొచ్చినంత రాసిపారేశారు. మరి ఇందులో నిజమెంత? ఏది నిజం?



ఏది నిజం?

నిజమే! ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పోస్టులు భర్తీ కావటం లేదు. కాకపోతే అది గడిచిన నాలుగేళ్లుగా కాదు. చాలా సంవత్సరాలుగా!!. ఎందుకంటే చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన నాటి నుంచీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్లుగా, పాలక మండలి సభ్యులుగా తన బంధువులనే నియమించుకున్నారు. వారు అడ్డగోలుగా అన్ని నిబంధనలనూ తుంగలో తొక్కేసి తమకు కావాల్సిన వారిని, ముడుపులిచ్చిన వారిని నియమించుకోబోయారు. ఆ పోస్టులను ఆశిస్తున్న పలువురు నిరుద్యోగులు, వారి తీరు నచ్చని ఆయా వర్సిటీల్లోని సిబ్బంది ఈ వ్యవహారంపై కోర్టులకెళ్లారు. దీంతో రిక్రూట్‌మెంట్లు నిలిచిపోయాయి. ఆ పోస్టులన్నీ అలానే ఖాళీగా ఉండిపోయాయి. మరి అలా వర్సిటీల్లో తమ బంధువుల్ని నియమించుకున్నందుకు చంద్రబాబును ఎన్నడూ ప్రశ్నించలేదెందుకు రామోజీరావు గారూ? వారు అడ్డగోలుగా పోస్టుల భర్తీ చేయబట్టే కదా... కోర్టుల్లో కేసులు పడి రిక్రూట్‌మెంట్లు నిలిచి పోయాయి. దాన్ని కూడా ఎన్నడూ ప్రశ్నించలేదెందుకు? ఇవన్నీ పక్కనబెడితే... కనీసం ఆ కోర్టు కేసుల్ని త్వరగా పరిష్కరించి పోస్టులు భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే వార్తలు సైతం ‘ఈనాడు’ రాస్తే ఒట్టు!. ఇప్పుడేమో ఆ కేసులన్నిటినీ ఒకటొకటిగా పరిష్కరించుకుంటూ పోస్టుల భర్తీ చేపడుతున్న ప్రభుత్వాన్ని మాత్రం ప్రశ్నించటం మొదలెట్టారు రామోజీ!!. నాలుగేళ్లూ ఊరుకుని ఇప్పుడెందుకంటూ సన్నాయి నొక్కులు మొదలు పెట్టారు. అసలు ఐదేళ్లూ ఏమీ చేయని చంద్రబాబును... కోర్టు కేసులకు కారకుడైన చంద్రబాబును మాత్రం వెనకేసుకొస్తూనే ఉన్నారు. పైపెచ్చు ఈ ప్రభుత్వం యూనివర్సిటీల పాలక మండళ్లలో పారదర్శకత ఉండాలనే ఉద్దేశంతో 50% మహిళలకే అవకాశమిస్తోంది. దాన్ని కూడా పక్కనబెట్టి అంతా అధికార పార్టీవారే అంటూ దుర్మార్గపు రాతలకు దిగింది ‘ఈనాడు’. అదీ రామోజీరావు తీరు!!. ఇదీ నిజం.

నిధులు మళ్లించిందెవరు రామోజీ?

వర్సిటీల నిధులను దారిమళ్లించినట్లు ‘ఈనాడు’ అవాస్తవాలను వండి వార్చేసింది. మరి ఇందులో నిజమెంత? టీడీపీ ప్రభుత్వ హయాంలోనే యూనివర్సిటీలకు ఉరి వెయ్యటానికి చంద్రబాబు నిధుల దుబారా పథకాన్ని అమలు చేశారు. అంటే... ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు తన ఎన్నికల ప్రచారాల కోసం యూనివర్సిటీల్లో సమావేశాలు నిర్వహించారు. సమావేశం వర్సిటీలో కనక దానికయ్యే ఖర్చు మొత్తాన్ని వర్సిటీల నుంచే చేయించారు. ఇందు కోసం ఆయా యూనివర్సిటీలు ఒక్కొక్కటి రూ.10 కోట్ల చొప్పున ఖర్చు చేశాయి. కానీ అప్పట్లో ‘ఈనాడు’ పెన్నెత్తితే ఒట్టు. ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి పనులకోసం స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయించింది. వర్సిటీలు సహా ఇతర సంస్థలు తమ వద్ద అదనంగా ఉన్న నిధులను బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తే వచ్చే వడ్డీ కన్నా ఎక్కువ వడ్డీ చెల్లిస్తూ కార్పొరేషన్లో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకున్నారు. వర్సిటీల నిధులకు అధిక వడ్డీ చెల్లిస్తూ తిరిగి వారికి అవసరమైనప్పుడు ఇస్తున్నారు. బాబు దుబారాపై కళ్లు మూసుకుని... డిపాజిట్లను నిధులు మళ్లించటమని అంటున్నారంటే రామోజీని ఏమనుకోవాలి? ఎంతైనా రామోజీ.. రామోజీనే!!

సాక్షాత్తూ యూజీసీ చైర్మన్ చెప్పారు

జూలై 1న సాక్షాత్తూ యూజీసీ చైర్మన్ కాకినాడలో జరిగిన సమావేశంలో... ఉన్నత విద్యకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పలు అంశాల్లో ముందున్నదని వ్యాఖ్యానించారు. కానీ ‘ఈనాడు’ మాత్రం ఉన్నత విద్యపై బురద చల్లుతూ విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో భయాందోళనలను కలిగించడానికి ప్రయత్నిస్తోందన్నది నిజం. గడిచిన నాలుగేళ్లలో దేశంలోనే తొలిసారిగా ఏపీలోని పలు యూనివర్సిటీల్లో సంస్కరణలు తెచ్చారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు, రీజనల్ క్లస్టర్ గ్రూపులు, 10 నెలల తప్పనిసరి ఇంటర్న్‌షిప్, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు, నైపుణ్య కోర్సులు వంటి అనేక సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. ఇదే క్రమంలో ప్రపంచ స్థాయిలోని మేటి వర్సిటీల్లో ఉన్న నాలుగేళ్ల కోర్సును నూతన జాతీయ విద్యా విధానంతో అనుసంధానం చేసి విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలన్నీ ‘ఈనాడు’కు అసాధ్యమైనవిగా కనిపించటం విచిత్రమే మరి. ఎందుకంటే చేస్తానని చెప్పిన వ్యక్తి చంద్రబాబు కాదు కాబట్టి ‘ఈనాడు’కు సహజంగానే అవన్నీ అసాధ్యమైనవిగా కనిపిస్తాయి. ఒక కొత్త విద్యా విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెట్టే ముందు దానిపై లోతుగా అధ్యయనం చేయటం, ప్రణాళికాబద్ధంగా అమలుకోసం సన్నద్ధమవటం వంటివి చేస్తున్నపుడు ఏదో ఒకరకంగా బురద జల్లాలనే లక్ష్యంతో ‘ఈనాడు’ వరుస కథనాలు రాస్తూనే ఉంది. నిజం చెప్పాలంటే నిన్న జరిగిన వైస్‌చాన్సలర్ల సమావేశం.. ఈ ప్రభుత్వం వచ్చాక జరిగిన మొదటి సమావేశం కాదు. 2021 అక్టోబర్ 25న తొలిసారిగా ముఖ్యమంత్రి జగన్ ఉపకులపతులతో సమావేశమై ఉన్నత విద్యపై దిశానిర్దేశం చేశారు. ఈ నాలుగేళ్లలో దాదాపుగా 10 సార్లు ఉన్నత విద్యపై అధికారులతో సమీక్షలు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఉన్నత విద్యపై ఇన్ని సమీక్షలు, సమావేశాలు నిర్వహించలేదు. వీటన్నిటినీ విస్మరించిన ‘ఈనాడు’... నాలుగేళ్ల తరవాత తొలిసారిగా వీసీలతో సమావేశం నిర్వహిస్తున్నారన్న తరహాలో కథనాన్ని వండిందంటేనే.. రామోజీ దుర్బుద్ధిని అర్థం చేసుకోవచ్చు.

ఆరంభం నుంచే పటిష్ట పునాదులు

ఒక్క ఉన్నత విద్యలోనే కాకుండా పునాది స్థాయి నుంచే విద్యార్థులను తీర్చిదిద్దేలా రాష్ట్రంలో పలు సంస్కరణలను సీఎం జగన్ తొలిరోజు నుంచీ అమలు చేస్తున్నారు. ఇవి కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు అందుకోవడమే కాకుండా పలు రాష్ట్రాలకు ఆదర్శంగానూ నిలిచాయి. పాఠశాల విద్యలో నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలు యూపీ, అస్సాం, బీహార్, తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి. గతంలో ప్రయివేటుకే పరిమితమైన ఆంగ్ల మాధ్యమాన్ని వైఎస్ జగన్ సీఎం అయిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో పెట్టించారు. దీనిపైనా చంద్రబాబు, రామోజీ విషం చిమ్మి అడ్డుపడే ప్రయత్నం చేశారు. నూతన విద్యావిధానం కన్నా ముందే రాష్ట్రంలో ఫౌండేషన్ విద్యావిధానాన్ని తీసుకువచ్చి శిశుస్థాయి నుంచే పిల్లల్లో అక్షర జ్ఞానానికి సీఎం శ్రీకారం చుట్టారు. నాడునేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, సీబీఎస్‌ఈ విధానం వంటి విధానాలను తెచ్చి పాఠశాల విద్యను బలోపేతం చేశారు. 6వ తరగతి నుంచి అన్ని తరగతుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను నెలకొల్పి డిజిటల్ బోధన చేయిస్తున్నారు. ప్రతి ఏటా 8వ తరగతికి వచ్చే విద్యార్థులకు, టీచర్లకు ట్యాబులను కూడా అందిస్తూ... దిగ్గజ ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్ పాఠాలను కూడా అందులో అందజేస్తున్నారు.

ఉన్నత విద్య భారం పూర్తిగా ప్రభుత్వానిదే...

ఉన్నత విద్యలో చేరే ప్రతి విద్యార్థికీ పూర్తి ఫీజురీయింబర్స్‌మెంటుతో పాటు వారి వసతి ఖర్చులనూ ప్రభుత్వమే భరించేలా ముఖ్యమంత్రి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తున్నారు. దీనికోసం గత నాలుగేళ్లలో రూ.15వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చించింది. గత ప్రభుత్వంలో 35వేలు మాత్రమే ఫీజు ఇవ్వడంతో మిగతా మొత్తాన్ని విద్యార్థులే కట్టుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం పూర్తిభారం ప్రభుత్వానిదే కావటంతో ఇంటర్ తరవాత డ్రాపవుట్లు గత ప్రభుత్వంలో 21 శాతం ఉండగా ఇపుడు 6 శాతానికి తగ్గారు. ఉన్నత విద్యలోనూ నేటి అవసరాలకు తగ్గట్టుగా కరిక్యులమ్ అభివృద్ధి చేయించారు. బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ బాలకృష్ణన్ నేతృత్వంలో కమిటీని వేసి సంస్కరణలకు శ్రీకారం చుట్టించారు. డిగ్రీలో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసి నాలుగేళ్ల హానర్ కోర్సులను ఏర్పాటు చేయించారు.

27 వేల పరిశ్రమలు, సంస్థల అనుసంధానంతో ఇంటర్న్‌షిప్..

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కోసం కాలేజీలను జిల్లాల వారీగా 27వేల పరిశ్రమలతో అనుసంధానం చేయించారు. చదువులు పూర్తి చేసేనాటికే విద్యార్థులకు అవసరమైన ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలు సమకూరేలా చేశారు. విద్యార్థులలో నైపుణ్యాలకోసం 553 ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాల ఏర్పాటుచేయించారు. మైక్రోసాఫ్ట్ ద్వారా రూ.32 కోట్లతో 1.62 లక్షల మందికి సర్టిఫికేషన్ కోర్సులు అందించారు. మరో 1.95 లక్షల మందికి వివిధ కంపెనీలతో వర్చువల్ ఇంటర్న్‌షిప్ అందించారు. నాస్కామ్ ఫ్యూచర్‌స్కిల్స్, ఎడ్యుస్కిల్స్, బీఎస్ఎన్ఎల్, సేల్స్‌ఫోర్స్, పాలో ఆల్టో, బ్లూప్రిజమ్, ఫుల్‌స్టేక్, ఏడబ్ల్యూఎస్, ఎంప్లాయిమెంటు ఎక్స్‌ప్రెస్ వంటి జాతీయ అంతర్జాతీయ సంస్థలతో వర్చువల్ శిక్షణ ద్వారా నైపుణ్యాలను మెరుగుపర్చారు. సాఫ్ట్‌వేర్, ఐటీ రంగాల్లోనే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్, క్స్‌టైల్స్, అపెరల్, లైఫ్‌సైన్సెస్, అగ్రికల్చర్, హెల్త్‌కేర్ తదితరాల్లో ఇంటర్న్‌షిప్ వల్ల విద్యార్థులకు అవగాహన పెరుగుతోంది. బాబు హయాంలో 37వేలు మాత్రమే ప్లేస్‌మెంట్లు ఉండగా గత ఏడాదికి ఈ సంఖ్య 85వేలకు చేరింది. ఈ ఏడాదిలో 1.20 లక్షల మందికి ప్లేస్‌మెంట్లు ఉంటాయని అంచనా వేస్తున్నారు. అంతా ‘పచ్చ’గానే ఉండాలనుకునే రామోజీరావు కళ్లకు ఇవేవీ ఎన్నటికీ కనిపించకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు.

బాబు హయాంలో ఒక్కపోస్టూ భర్తీ చేయలేదే...

- మన పిల్లలని ప్రపంచస్థాయి లీడర్లుగా ఎదగకుండా ఆపింది ఎవరు? అనేది ‘ఈనాడు’ ప్రశ్న. దీనికి సమాధానం చంద్రబాబే. ఎందుకంటే విశ్వవిద్యాలయాలలోని ఖాళీలు భర్తీ కాకపోవడానికి కారణం ఆయనే. చంద్రబాబు అధికారంలో ఉన్న తొలి తొమ్మిదేళ్లూ... అంటే 1995 నుంచి 2004 వరకు, ఆలాగే, ప్రత్యేక రాష్ట్రంగా విడిపోయాక 2014 నుండీ 2019 వరకూ విశ్వవిద్యాలయాల్లో ఒక్క ఆచార్యుడినీ నియమించలేదు. దీన్ని రామోజీరావు ఎప్పుడూ ప్రశ్నించలేదు కూడా!.
- విశ్వవిద్యాలయాల్లో 71 శాతం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, ఆయా కోర్సుల్లో పిల్లలకు పాఠాలు చెప్పేవారు లేకుంటే కృత్రిమ మేధ వంటి కొత్త కోర్సుల వల్ల ఉపయోగం ఏమిటనేది ‘ఈనాడు’ ప్రశ్న. వాస్తవానికి మారుతున్న సమకాలీన సామాజిక అవసరాల దృష్ట్యా కొత్త కోర్సులు వస్తుంటాయి. వాటికి అవసరమైన నిపుణులను వర్సిటీల్లో నియమించుకోవాలి. అంతేకానీ, ప్రస్తుతం నిపుణులు లేరు కాబట్టి కొత్త కోర్సులను తేవొద్దని చెప్పటం ఏ రకమైన పాత్రికేయం?
- వర్సిటీల్లో ర్యాంకులు పడిపోతున్నాయనీ, ఈ సమయంలో కొత్త కోర్సులు అవసరమా? అనేది ‘ఈనాడు’ కథనంలో ప్రధానమైన అంశం. ర్యాంకులు పడిపోవడానికి శాశ్వత ప్రాతిపదికన పనిచేసే ఆచార్యులు లేకపోవడమే కారణం. దీనికి ప్రధాన బాధ్యుడు చంద్రబాబే. నియామకాలు చేపట్టకపోవటం, కోర్టు కేసులపై దృష్టిపెట్టకపోవటం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.
- ర్యాంకులను పునరుద్ధరించుకోవడానికి ముఖ్యమంత్రి, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి విశ్వవిద్యాలయాల అభివృద్ధి నమూనాలను తీసుకోవాలని దార్శనికతతో వివరించారు. రాబోయే కొద్ది రోజుల్లో బోధనా సిబ్బంది నియామకాలు చేపట్టాలని సూచించారు. తద్వారా విశ్వవిద్యాలయాలను శక్తివంతమైన సాంకేతిక, ఆధునిక విద్యా కేంద్రాలుగా మారాలన్నారు. కార్యాచరణ మొదలుపెట్టి విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తయారు చేయాలని పేర్కొన్నారు. వాస్తవానికి ముఖ్యమంత్రి ప్రతిపాదించిన అంశాలు, ఏ నిరుద్యోగినీ బాధించవు. అవకాశాలు పెంచుకోవడానికి, మరికొంత మందిని ఉపాధికి చేరువ చేయడానికి కృత్రిమ మేధ ఉపయోగ పడుతుంది. బహుశా, ఇలాంటి విధానం ‘ఈనాడు’కు నచ్చి ఉండకపోవచ్చు. లేకపోతే ఇలా చెప్పింది చంద్రబాబు కాదు కాబట్టి నచ్చి ఉండకపోవచ్చు. విశ్వవిద్యాలయాల్లో పోస్టులు త్వరలో భర్తీ చేయడానికి నోటిఫికేషన్లు సిద్ధమవుతుండటాన్ని గమనించి... ఎలాగైనా నియామకాలు జరగకూడదనే కుట్ర ఈ కథనంలో స్పష్టంగా కనబడుతోంది.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

సాహో ఇండియా!



సోకాల్డ్ మూడో ప్రపంచ దేశం, ఇప్పుడు చంద్రుడి మీద అంతరిక్ష వాహనాన్ని దింపుతున్న నాలుగో దేశం కావడానికి అతి దగ్గరలో ఉంది. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు.

– సాగర్, రచయిత


ఇది చరిత్ర!



శ్రీహరికోట లోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతమైన చంద్రయాన్–3 ప్రయోగాన్ని చూడగలిగాను. చరిత్ర రూపొందుతున్న క్షణాలకు సాక్షిగా ఉన్నాను.

– గౌరవ్ శ్రీవాత్సవ, జర్నలిస్ట్

అతి త్వరలో...



చంద్రయాన్–3 ప్రయోగం ద్వారా చంద్రుడి మీద ఇండియా దిగబోతోంది. అయితే అక్కడికి సమర్థంగా చేరడానికి 42 రోజులు పడుతుంది.(లైవ్ వీడియో షేర్ చేశారు.)

– క్రిస్ హాడ్‌ఫీల్డ్, వ్యోమగామి

ఆయనే దొరికారా?



ఎక్కువమంది మహారాష్ట్ర కాంగ్రెస్‌వాళ్లున్న కమిటీ, ప్రతిష్ఠాత్మక లోకమాన్య తిలక్ అవార్డు కోసం ప్రధాని మోదీని ఎంపిక చేయడం నిజంగా చిత్రంగా ఉంది. ఇది ఉదారతా? భావజాల అంధులయ్యారా? లేదా కేవలం అవకాశ వాదమా?

– సుహాస్ పల్షీకర్, ప్రొఫెసర్

నిజమైన సహచరి



ప్రియమైన పురుషులారా! రెండేళ్లు మేల్ వార్డులో నర్సుగా పనిచేసిన తర్వాత, నేను గమనించిన రెండు విషయాలు చెబుతాను. నిజంగా మీరు అనారోగ్యంతో ఉన్నప్పుడు మీ పక్కన ఉండేది మీ భార్య మాత్రమే. కొన్నిసార్లు కొంతసేపు మీ వెంట మీ పిల్లలు ఉండొచ్చు. మీ రక్తసంబంధీకులు వస్తారు, పోతారు. మీ స్నేహితులు కూడా వస్తుంటారు. కానీ పూర్తిగా మీ కష్టంలో నిండు మనసుతో మీ పక్కన ఉండేది మీ భార్య మాత్రమే.

– అబ్దుల్లా ఎ. అబ్దుల్లా, జువాలజిస్ట్

ఇంద్రకీలాద్రిపై తగ్గని రద్దీ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలతో పాటు సాధారణ భక్తులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. అమ్మవారికి మహా నివేదన నిమిత్తం ఉదయం 11:40 గంటలకు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింతగా పెరిగింది. మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గాల్లో భక్తులు కిటికిటలాడటంతో దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. కాగా, దుర్గమ్మను ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు.దర్శనానంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

30 సెకండ్లలో 1,500 మొక్కలు

- నాటిన ఎస్ఎన్‌జీ ఫౌండేషన్
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో చోటు




గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో 30 సెకండ్స్‌లో 1,500 మొక్కలు నాటి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో చోటు సాధించారు. ఎస్ఎన్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 600 మంది విద్యార్థులు, ఉద్యోగులు నిర్వహించిన బృహత్తర కార్యక్రమాన్ని రైల్వే బోర్డు ప్రిన్సిపాల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏకే చంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతన్నారు. 2 నిమిషాల్లో 1,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుని 30 సెకండ్స్‌లో నాటిన ఎస్ఎన్‌జీ ఫౌండేషన్ ప్రతినిధి కె.శారదవాణిని అభినందించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ జ్ఞాపిక అందజేశారు. జాతీయస్థాయి సీఆర్ఎస్ఈల సమావేశం వ్యాగన్ వర్క్‌షాప్‌లో జరిగింది. దీనికి ఏకే చంద్ర హాజరై మాట్లాడుతూ..సరుకు రవాణా టార్గెట్ 2024 మిలియన్ మెట్రిక్ టన్నులు సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. వర్క్ షాప్‌లో రైల్వే పురోగతి, వ్యాగన్‌ల నిర్వహణ అంశాలను చర్చించారు. సాంకేతిక యాంత్రిక ప్రగతి పరిశీలించారు. కార్మికుల స్థితిగతులు, భద్రతపై ఆరా తీశారు. వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, ఉప ముఖ్య యాంత్రిక అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌ఫ్లో... వెరీ లో!

గోదావరిలో పెద్దగా కనిపించని వరదనీటి జాడ

- జూలైలో ఎన్నడూ లేనివిధంగా ధవళేశ్వరం వద్ద అతి తక్కువ ఇన్‌ఫ్లో..
- గత ఏడాది జూలై 15న ఇన్‌ఫ్లో 21.52 లక్షల క్యూసెక్కులు
- శుక్రవారం ఇన్‌ఫ్లో 30వేల క్యూసెక్కులలోపే...
- ఏటా జూలైలో భారీ వరదలు రాకున్నా కనీసం లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఈసారి పరిస్థితి పూర్తి భిన్నం...



గత ఏడాది జూలై 15వ తేదీన పి.గన్నవరం పాత అక్విడెక్టు వద్ద ఉరకలు వేస్తున్న గోదావరి (ఫైల్)



ఈ నెల 14న పి.గన్నవరం పాత అక్విడెక్టు వద్ద ఇదీ పరిస్థితి

సాక్షి, అమలాపురం/ధవళేశ్వరం: ప్రతి సంవత్సరం జూలై మొదటి వారంలో గోదావరి నది వరదనీటితో ఉప్పొంగుతుంది... ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలను ముంచెత్తుతుంది. కానీ, ఈ ఏడాది పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కడా పెద్దగా వర్షాలు కురవకపోవడంతో ఇప్పటి వరకు గోదావరికి వరదనీరు రాలేదు. గత ఏడాది ఇదే సమయానికి రికార్డు స్థాయిలో వరద రాగా, ఈసారి మాత్రం ఇన్‌ఫ్లో కనిష్ట స్థాయిలో ఉంది. గోదావరికి వరద రాకున్నా ఏటా జూలైలో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద లక్ష క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో ఉండేది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం... అదే సమయంలో అరేబియా సముద్రంలో బిపర్‌జోయ్ తుపాను వల్ల రుతుపవనాల కదలిక మందగించడంతో జూన్, జూలై నెలల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఫలితంగా ఇప్పటి వరకు గోదావరికి పెద్దగా వరదనీరు రాలేదు.

గత ఏడాది రికార్డు స్థాయిలో వరద

గత ఏడాది జూలైలో గోదావరి చరిత్రలోనే మూడో అతి పెద్ద వరద వచ్చింది. గత ఏడాది జూలై 15వ తేదీ ఉదయం 6 గంటలకు ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 18.46 లక్షల క్యూసెక్కులు కాగా, రాత్రి 9 గంటలకు 21.52 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. పలుచోట్ల వరద నీరు ఏటిగట్లపై నుంచి పారింది. అనేక లంక గ్రామాలు నీట మునిగాయి. ఇంత భారీ వరద వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొంది. ఏటిగట్లను కాపాడటంతోపాటు బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టింది. పునరావాసం కల్పించి ఆదుకుంది. గత ఏడాది జూలైతోపాటు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సైతం గోదావరికి వరదలు వచ్చాయి.

ఇదీ ప్రస్తుత పరిస్థితి...

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయం 6 గంటలకు ఇన్‌ఫ్లో 14,063 క్యూసెక్కులు మాత్రమే ఉంది. ఇందులో సీలేరు నుంచి వస్తున్నది 2,863 క్యూసెక్కులు కాగా, ఎగువ నుంచి వస్తున్న గోదావరి సహజ జలాలు 11,200 క్యూసెక్కులు. దీనిలో తూర్పు డెల్టాకు 4వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కులు చొప్పున మొత్తం 13,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డెల్టాలో ఖరీఫ్ సీజన్ నాట్లు వేస్తున్నందున కాలువలకు పూర్తిస్థాయిలో నీటి విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడం, పోలవరం నుంచి 87,203 క్యూసెక్కులను దిగువకు విడుదల చేయడంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం సాయంత్రం నీటి ఉధృతి స్వల్పంగా పెరిగింది. ఉదయం 8.95 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 7 గంటలకు 9.40 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 17,290 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి తాలిపేరు, లక్ష్మి బ్యారేజీ నుంచి విడుదల చేసిన నీటి వల్ల ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి పెరుగుతోంది. శనివారం నీటి ఉధృతి మరికాస్త పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

అరుదైన సమస్య.. ఆరు నెలల్లో మాయం!

- జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల ఘనత
- పుట్టుకతోనే కాళ్లు వంకర్లుగా ఉన్న చిన్నారికి విజయవంతంగా చికిత్స



ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

జగ్గయ్యపేట అర్బన్ : వంకరకాళ్లతో జన్మించిన చిన్నారిని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఆరు నెలల్లోనే మామూలు స్థితికి తెచ్చారు. తమ కుమార్తె నడవలేదేమో అని మనోవేదనకు గురైన చిన్నారి తల్లిదండ్రుల మోముల్లో సంతోషాన్ని నింపారు. జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటకు చెందిన సాయి తారక్, శ్రీలత దంపతులకు ఆరు నెలల కిందట మహన్వితశ్రీ జన్మించింది. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలోనే జన్మించిన ఆ చిన్నారికి కాళ్లు వంకర్లు తిరిగి ఉన్నాయి. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు సలహాతో వారు అదే ఆస్పత్రిలో ఆర్థోపెటిక్‌గా పని చేస్తున్న డాక్టర్ హరీష్‌ను కలిసి తమ బిడ్డ పరిస్థితిని వివరించారు. బాలికను పరీక్షించి తల్లిదండ్రులకు ఆయన ధైర్యం చెప్పారు. ఆరు నెలల్లో చిన్నారి కాళ్లు మామూలు స్థితికి చేరుకుంటాయని భరోసా ఇచ్చి.. 21వ రోజు నుంచి చికిత్స మొదలెట్టారు. వారం వారం ఆ చిన్నారి కాళ్లకు కట్లు కడుతూ మధ్యలో ఇంజక్షన్లు ఇస్తున్నారు. మధ్యలో విజయవాడ ప్రభుత్వాస్పత్రి వైద్యుల ద్వారా కొంత వైద్య సాయం తీసుకున్నారు. ఆరు నెలలు పూర్తి కావస్తుండటంతో చిన్నారి కాళ్లు దాదాపుగా మామూలు స్థితికి వచ్చాయని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ఇలాంటి లోపాలు వస్తుంటాయని, దీనిని క్లబ్ ఫుట్(సీటీఈవీ) అంటారని తెలిపారు. పుట్టిన వెంటనే చికిత్స మొదలెడితే ఫలితం ఉంటుందని చెప్పారు.

సంస్కృతం లేనిదే సంస్కృతి లేదు

- ఇది పవిత్రమైన భాష
- గవర్నర్ అబ్దుల్ నజీర్
- ముగిసిన జాతీయ సంస్కృత సమ్మేళనం



తాళపత్ర గ్రంథాలు పరిశీలిస్తున్న గవర్నర్ నజీర్

తిరుపతి ఎడ్యుకేషన్ : సంస్కృత భాష లేనిదే భారతీయ సంస్కృతి లేదని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మైసూరు సంస్కృతి ఫౌండేషన్ సహకారంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాహిత్య అకాడమీ సంయుక్తంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సంస్కృత సమ్మేళనం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన భాషల్లో సంస్కృతం ఒకటని, దేశంలో మాట్లాడే దాదాపు ఐదు వేల భాషల్లో అత్యంత పవిత్రమైనదన్నారు. హిందీ, కన్నడ, మలయాళం వంటి భారతీయ భాషలపై సంస్కృత భాష ప్రభావాన్ని చూపిందన్నారు. సంస్కృత భాషను పునరుద్ధరించేందుకు, ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం గత మూడు దశాబ్దాలుగా తన నోడల్ ఏజెన్సీ అయిన రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ ద్వారా పలు పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాలు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి పాదాల చెంత ఉండటం మనందరికీ గర్వకారణమన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో జాతీయ సంస్కృత సమ్మేళనాన్ని నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. అంతకుముందు అన్నారావు భవన్‌లో ఏర్పాటు చేసిన విజ్ఞాన, పుస్తక, వస్తు ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు వేదపండితులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు, జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివ మూర్తి, మాజీ వీసీ హరే కృష్ణ శతపతి, మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.భారతి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో సీ ఫుడ్ ఫెస్టివల్

28 నుంచి 3 రోజుల పాటు నిర్వహణ

- రూ.699కే అన్‌లిమిటెడ్ సీ ఫుడ్ బఫెట్
- 2కే రన్, సీ ఫుడ్ వంటకాలపై పోటీలు, సెమినార్లు
- ఇదే రీతిలో రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో సీ ఫుడ్ ఫెస్టివల్స్
- మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు

సాక్షి, అమరావతి: స్థానిక వినియోగాన్ని పెంచడం, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సౌకర్యాల కల్పనే లక్ష్యంగా విజయవాడలో 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సీ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ కూనపురెడ్డి కన్నబాబు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏటా 50 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తితో దేశంలోనే నం.1 స్థానంలో ఉన్న రాష్ట్రంలో స్థానిక వినియోగం 8 శాతానికి మించడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో 75 శాతం మన రాష్ట్రం నుంచే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కానీ వినియోగం మాత్రం 5 శాతం లోపే ఉందని చెప్పారు. మిగిలిన రొయ్య అంతా ఎగుమతి అవుతోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు ఎదురైతే రాష్ట్రంలోని రొయ్య రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే డొమెస్టిక్ మార్కెట్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో సీ ఫుడ్ వినియోగదారులు పెద్ద ఎత్తున ఉన్నా.. డిమాండ్‌కు తగ్గట్టుగా రిటైల్ షాపులు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు 'ఫిష్ ఆంధ్రా' బ్రాండ్‌తో స్థానిక వినియోగం పెంచేలా ఆక్వా హబ్స్ అండ్ స్పోక్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే 1,500 అవుట్ లెట్స్‌ను ఏర్పాటు చేయగా.. 15 హబ్స్ నిర్మాణంలో ఉన్నట్టు చెప్పారు. మరిన్ని హబ్స్, అవుట్ లెట్స్ ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించడం, వినియోగదారుల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ సీ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఫెస్టివల్‌లో 20 వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఫెస్టివల్‌లో రోజూ రూ.699తో అపరిమితమైన సీ ఫుడ్ బఫెట్‌ను అందిస్తున్నామన్నారు. సీ ఫుడ్‌పై వంటల పోటీలు, వైద్యులు, పోషకాహార నిపుణులతో సెమినార్లు, 2కే రన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇలాంటి సీ ఫుడ్ ఫెస్టివల్స్ విశాఖ, కాకినాడ, భీమవరం, నెల్లూరు తదితర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లోనూ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ బ్రోచర్‌ను కమిషనర్ కన్నబాబు విడుదల చేశారు.

అరకులోయలో పాస్‌పోర్టు కేంద్రం

- త్వరలోనే అరకు పోస్టాఫీసులో ఏర్పాటు
- రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్ వెల్లడి
- ఏజెన్సీ వాసులకు సువర్ణావకాశం



మొక్క నాటుతున్న రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్, అధికారులు

అరకులోయ టౌన్/సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పాస్‌పోర్టు తీసుకునేందుకు ఏజెన్సీ వాసులు పడుతున్న కష్టాలు తీరనున్నాయి. వారి చెంతనే ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటు కానుంది. రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్, విశాఖపట్నం పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు శుక్రవారం అరకులో పర్యటించారు. పోస్టాఫీసు భవనంలోనే పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్య, ఉద్యోగాల కోసం కొంతకాలంగా మన్యం నుంచి విదేశాలకు వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి నెల 40 నుంచి 50 మంది గిరిజనులు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేస్తున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో పాస్‌పోర్టు సేవలకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అరకులో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో అరకు పోస్టాఫీసును ఆనుకుని ఉన్న ఖాళీ భవనంలో పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ భవనాన్ని పరిశీలించిన రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్, విశాఖపట్నం పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు మాట్లాడుతూ అరకులోయ పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందించి అనుమతులు రాగానే అతి త్వరలోనే పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనకాపల్లి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్‌బాబు, అరకులోయ, అనకాపల్లి పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు ఉపేంద్ర, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర తీరం.. అభివృద్ధి వేగం

- బాపట్ల జిల్లాలో తీర గ్రామాల దశ తిరిగింది
- రోడ్లు, రిసార్ట్‌ల నిర్మాణంతో భారీగా పెరిగిన పర్యాటకుల తాకిడి
- పర్యాటక అభివృద్ధితో పెద్దఎత్తున పుట్టుకొచ్చిన రియల్ ఎస్టేట్ వెంచర్లు
- గతంలో ఎకరం ధర రూ.50 వేల నుంచి రూ.8 లక్షలు
- నేడు ఎకరం రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్లు



తీరంలో వెలిసిన రియల్ వెంచర్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లాలోని సముద్ర తీరం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని బీచ్‌లకు పర్యాటకులు భారీ ఎత్తున తరలివస్తున్నారు. వారాంతంలో రోజుకు 50 వేలకు పైగా సందర్శకులు తరలివస్తున్నారు. దీంతో రిసార్ట్‌లకు, హోటళ్లకు డిమాండ్ పెరిగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీరప్రాంత అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటుండగా.. ఇప్పటికే పర్యాటక అభివృద్ధిలో భాగంగా బాపట్ల వద్ద హరిత రిసార్ట్ నిర్మించింది. దీనిని మరింతగా విస్తరించనుంది. ప్రభుత్వమే సొంతంగా రిసార్ట్‌లు నిర్మించడంతోపాటు తీరం వెంబడి రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. ఇప్పటికే తీరంలో సినిమా షూటింగ్‌లు జరుగుతున్న నేపథ్యంలో వారికి మరింత అనుకూలంగా ఉండేలా బీచ్ ప్రాంతాల్లో పార్కులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. చీరాల ఓడరేవు ప్రాంతంలో రూ.417.55 కోట్లతో 52 ఎకరాల్లో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మరోవైపు ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకూ రూ.880 కోట్లతో రహదారి నిర్మాణానికి సైతం ప్రభుత్వం సిద్ధమైంది. ఓడరేవు, కారంచేడు, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా ఈ రహదారి నిర్మాణం జరగనుంది. దీనివల్ల ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం సులభతరమవుతుంది.


భూముల కొనుగోలుకు ఎగబడుతుండటంతో..

జిల్లాలోని తీరప్రాంతం పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తున్న నేపథ్యంలో ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తీరం అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో స్థానికులతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు, అన్ని పార్టీలకు చెందిన కీలక నేతలు, సినీ నటులు, డైరెక్టర్లు, బడా వ్యాపారులు ఇక్కడ పెద్దఎత్తున స్థలాలు, భూములు కొనుగోలు చేస్తున్నారు. వారిలో కొందరు ఇప్పటికే కార్పొరేట్ స్థాయి రిసార్ట్‌లు, విల్లాలు నిర్మించగా.. మరికొందరు ఇప్పటికే పెద్దఎత్తున భూములు కొనుగోలు చేసి వివిధ నిర్మాణాలు చేపట్టే ఆలోచనలో ఉన్నారు. ఇంకొందరు కొన్న భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చారు. మరికొందరు నేతలు తీరప్రాంతంలో భూములు కొని హేచరీస్ ఏర్పాటు చేశారు. ఇక ఐటీసీ తో పాటు పలు కార్పొరేట్ కంపెనీలు హోటల్స్, రిసార్ట్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. దీంతో పెద్దఎత్తున ఇక్కడి భూముల ధరలు పెరిగాయి.

ఎకరం రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే అన్నిరకాల అభివృద్ధి పనులు చేపట్టడంతో నాలుగేళ్లుగా భూముల ధరలు ఆకాశాన్ని అంటాయి. సూర్యలంక ప్రాంతంలో ప్రధాన రహదారిలో గతంలో రూ.30 లక్షలు ఉన్న ఎకరం ఇప్పుడు రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు పలుకుతోంది. పాండురంగాపురం బీచ్ ప్రాంతంలో రోడ్లకు దూరంగా ఉన్న పొలాలు ఎకరం ధర రూ.కోటిపైనే ఉంది. చీరాల ఓడరేవు, రామాపురం ప్రాంతాల్లో నాలుగేళ్ల క్రితం ఎకరం రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షలలోపు ఉండగా.. ప్రస్తుతం ఎకరం రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంది. మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరం రూ.రెండు కోట్ల ధర పలుకుతోంది.

భూముల ధరలు పెరిగాయి



దేవినూతల గ్రామంలో మాకు 3.50 ఎకరాల పొలముంది. పదేళ్ల క్రితం ఎకరం రూ.40 వేలు ఉండేది. బాపట్ల జిల్లా కావడం, హైవే రోడ్డు వేయడం, తీరప్రాంతం అభివృద్ధి చెందడంతో భూముల ధరలు పెరిగాయి. ఇప్పుడు ఎకరం రూ.కోటిపైనే అమ్ముడుపోతోంది.

– గోనబోయిన సుబ్బారావు, దేవినూతల

రూ.60 వేలకు కొన్నా.. రూ.కోటి దాటింది



పాండురంగాపురంలో 2.50 ఎకరాలను ఐదేళ్ల క్రితం ఎకరం రూ.60 వేలకు కొన్నాను. ఇప్పుడు ఎకరం రూ.కోటిపైనే ఉంది. తీర ప్రాంతం అభివృద్ధి కావడం, బాపట్ల జిల్లా చేయడం వల్ల భూములకు విలువ పెరిగింది.

– యలమందారెడ్డి, పాండురంగాపురం

ఎకరం రూ.కోటిపైనే ఉంది



గతంలో ఈ ప్రాంతంలో ఎకరం రూ.40 వేల లోపే ఉండేది. తీర ప్రాంతానికి పర్యాటకులు పెరిగి రిసార్ట్‌లు ఏర్పాటు కావడం, హేచరీలు ఏర్పాటు చేయడం వల్ల భూముల ధరలు పెరిగాయి. ఎకరం రూ.కోటిపైనే అమ్ముడుపోతోంది.

– నక్కా నాగేంద్రరెడ్డి, పాండురంగాపురం

అరకులోయలో పాస్‌పోర్టు కేంద్రం

- త్వరలోనే అరకు పోస్టాఫీసులో ఏర్పాటు
- రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్ వెల్లడి
- ఏజెన్సీ వాసులకు సువర్ణావకాశం



మొక్కనాటుతున్న రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్

అరకులోయ టౌన్/సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పాస్‌పోర్టు తీసుకునేందుకు ఏజెన్సీ వాసులు పడుతున్న కష్టాలు తీరనున్నాయి. వారి చెంతనే ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకానుంది. రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్, విశాఖపట్నం పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు శుక్రవారం అరకులో పర్యటించారు. పోస్టాఫీసు భవనంలోనే పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్య, ఉద్యోగాల కోసం కొంతకాలంగా మన్యం నుంచి విదేశాలకు వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి నెల 40 నుంచి 50 మంది గిరిజనులు పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేస్తున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో పాస్‌పోర్టు సేవలకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అరకులో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో అరకు పోస్టాఫీసును ఆనుకుని ఉన్న ఖాళీ భవనంలో పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ భవనాన్ని పరిశీలించిన రీజినల్ పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి ఎం గైక్వాడ్, విశాఖపట్నం పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు మాట్లాడుతూ అరకులోయ పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందించి అనుమతులు రాగానే అతి త్వరలోనే పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనకాపల్లి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్‌బాబు, అరకులోయ, అనకాపల్లి పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్లు ఉపేంద్ర, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఒకే రోజు 11 ప్లాస్టిక్ సర్జరీలతో రికార్డు

- గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల ఘనత

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అరుదైన రికార్డు సృష్టించారు. ఏపీలో మొట్టమొదటిసారిగా ఒకేరోజు 11 ప్లాస్టిక్ సర్జరీలు చేశారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విరామం లేకుండా విజయవంతంగా సర్జరీలు పూర్తిచేశారు. పుట్టుకతో చెవి కోల్పోవడం, గ్రహణం మొర్రి, కాలిన గాయాలతో అతుక్కుపోయిన వేళ్లను సరి చేయడం, విద్యుత్ షాక్‌తో వంగిపోయిన కాళ్లను సరిచేయడం వంటి శస్త్రచికిత్సలు ఇందులో ఉన్నాయి. అరుదైన రికార్డు సాధించిన ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అభినందించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా పేదలకు ప్లాస్టిక్ సర్జరీలు చేసి వారికి నూతన జీవితాలు ప్రసాదించారని పేర్కొన్నారు. అమెరికాలో శిక్షణ పొందిన డాక్టర్ సుమితా శంకర్ అంతర్జాతీయ నైపుణ్యంతో జీజీహెచ్‌కు వచ్చే పేదలకు కాస్మొటిక్ సర్జరీలను ఉచితంగా చేస్తూ ఆసుపత్రి ఖ్యాతిని పెంపొందిస్తున్నారని అభినందించారు.

వివేకా కేసు ఆగస్టు 14కు వాయిదా

- కోర్టు విచారణకు హాజరుకాని నిందితుడు దస్తగిరి

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణను సీబీఐ కోర్టు ఆగస్టు 14కు వాయిదా వేసింది. తెలంగాణ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి ఈ కేసు బదిలీ అయిన తర్వాత సీబీఐ తొలిసారి దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను కోర్టు శుక్రవారం పరిగణనలోకి తీసుకుంది. ఇందులో ఉదయ్‌కుమార్‌రెడ్డి (ఏ–6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ–7), వైఎస్ అవినాశ్‌రెడ్డి(ఏ–8)లను నిందితులుగా పేర్కొన్న విషయం తెలిసిందే. ఆగస్టు 14న కోర్టుకు హాజరు కావాలని అవినాశ్‌రెడ్డిని న్యాయమూర్తి ఆదేశించారు. కాగా, శుక్రవారం కోర్టు విచారణకు గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని పోలీసులు కోర్టుకు తరలించారు. అయితే దస్తగిరి(ఏ–4) మాత్రం విచారణకు హాజరుకాలేదు.

చిరుతను బైక్‌కు కట్టేసి..



చిరుతను బైక్‌కు కట్టుకొని వెళ్తున్న వేణుగోపాల్

బనశంకరి: చిరుతను దూరం నుంచి చూస్తేనే గుండె ఝల్లుమంటుంది. అదే దాడి చేస్తే.. ఇంకే ముంది సాధారణ మనుషులకు గుండె జారిపోతుంది. అయితే కర్ణాటకలోని హాసన జిల్లా గండసి మండలం బాగివాళు గ్రామ వాసి వేణుగోపాల్ గుండె ధైర్యం చూస్తే ఔరా! అనిపించకమానదు. ఊరికి సమీపంలోని పొలంలో వేణుగోపాల్ ఉన్న సమయంలో చిరుత దాడి చేసింది. అతను బెదిరిపోకుండా దానిపైనే ఎదురుదాడికి దిగాడు. దీంతో పారిపోవడానికి ప్రయత్నించిన చిరుతను వైర్లతో బంధించాడు. తర్వాత తన మోటార్ సైకిల్ వెనుక దానిని కట్టేసి మండల కేంద్రానికి తీసుకెళ్లి అటవీశాఖ అధికారులకు అప్పగించాడు. చిరుతను పశువైద్య ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువకుడి సాహసాన్ని గ్రామస్తులు మెచ్చుకున్నారు. బైక్‌పై చిరుతను వేణుగోపాల్ కట్టుకెళుతున్న దృశ్యాలు శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

తెలంగాణ

రూ.100 కోట్లు ఇస్తామంటున్నారు

- కేటీఆర్, కవితలపై స్టేట్‌మెంట్లు ఉపసంహరించుకోమంటున్నారు
- గవర్నర్‌కు సుకేశ్ చంద్రశేఖర్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలపై ఈడీకి ఇచ్చిన స్టేట్‌మెంట్లు ఉపసంహరించుకుంటే భారీ స్థాయిలో నగదు, భూమితో పాటు ఎన్నికల్లో టికెట్ సైతం ఇస్తామంటున్నారని మనీలాండరింగ్ కేసులో మండోలి జైలులో ఉన్న సుకేశ్ చంద్రశేఖర్ ఆరోపించాడు. తన వద్ద ఉన్న వాట్సాప్ చాట్ కాపీలు, స్క్రీన్ షాట్లు, ఫేస్‌టైమ్ కాల్ కాపీలతో పాటు ఆప్ నేతల కాల్ రికార్డింగులు ఇవ్వాలని కేటీఆర్, కవిత అనుచరులు గత రెండు రోజులుగా తన కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని పేర్కొన్నాడు. వారు చెప్పినట్లు చేస్తే శంషాబాద్ విమానాశ్రయం దగ్గరలో భూమి, రూ.100 కోట్లు నగదు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సీటు ఇస్తామంటున్నారని, లేదంటే అత్యంత క్లిష్టమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందంటూ బెదిరిస్తున్నారని ఆరోపించాడు. ఇవన్నీ కేటీఆర్, కవితలకు అత్యంత సన్నిహితుడు, లగ్జరీ దుకాణదారుడు/స్టైలిస్ట్ ఒకరు నా కుటుంబ సభ్యులకు చెప్పారని వివరించాడు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్‌కు సుకేశ్ జైలు నుంచి లేఖ రాశాడు. అదే లేఖను తన న్యాయవాది ద్వారా మీడియాకు విడుదల చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

సీబీఐ సంయుక్త దర్యాప్తు జరపాలి

'ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఆయన సహచరులపై నా ఫిర్యాదుల మేరకు దర్యాప్తు సాగుతోంది. దీంతో కేజ్రీవాల్, ఆయన సహచరులు నన్ను నిరంతరం బెదిరిస్తూనే ఉన్నారు. తాజాగా రెండు రోజులు నుంచి కేటీఆర్, కవిత అనుచరులు నా కుటుంబ సభ్యుల్ని బెదిరిస్తున్నారు. ఈ వివరాలు కూడా ఈడీకి అందజేస్తా. దీనిపై సీబీఐ కూడా సంయుక్త దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది..' అని సుకేశ్ లేఖలో పేర్కొన్నాడు.

250 జీబీ కన్నా ఎక్కువ డేటా ఉంది

'కేటీఆర్, కవితల కాల్ రికార్డుంగులకు సంబంధించిన 250 జీబీ కన్నా ఎక్కువ డేటా నా వద్ద ఉంది. వారిద్దరూ నాతో జరిపిన లావాదేవీలపై విచారణ జరిపితే కేటీఆర్, కవిత ఎంత అవినీతిపరులో తేటతెల్లం అవుతుంది. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ నేతల అవినీతి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..' అని పేర్కొన్నాడు. తన అభ్యర్థనను సీబీఐకి ఫిర్యాదుగా రిఫర్ చేయాలని గవర్నర్‌ను సుకేశ్ కోరాడు.

తెలంగాణ హైకోర్టు ఏసీజేగా జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ నవీన్‌రావు శుక్రవారం పదవీ విరమణ చేయడంతో ఆ పదవీ బాధ్యతలను సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి స్వీకరించనున్నారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి.. శనివారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. కొత్త ప్రధాన న్యాయమూర్తికి కేంద్రం అనుమతి ఇచ్చి, బాధ్యతలు అప్పగించేంతవరకు జస్టిస్ షావిలి ఏసీజేగా కొనసాగనున్నారు.

క్లుప్తంగా...

జస్టిస్ భుయాన్, జస్టిస్ భట్టి ప్రమాణ స్వీకారం

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్‌వీ భట్టి ప్రమాణ స్వీకారం చేశారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం వారిద్దరితో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిద్దరి నియామకంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 32కు చేరుకుంది. సుప్రీంకోర్టులో ఇంకా ఇద్దరు న్యాయమూర్తులను భర్తీ చేయాల్సి ఉంది.

ఆస్పర్టెమ్‌తో క్యాన్సర్ ముప్పు



లియోన్: డైట్ సోడా తదితర ఎన్నో ఆహారపదార్థాల్లో వాడే నాన్ షుగర్ స్వీట్‌నర్(ఎన్ఎస్ఎస్) ఆస్పర్టెమ్‌తో కేన్సర్ వచ్చేందుకు అవకాశాలున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) హెచ్చరించింది. తమ అధ్యయనంలో తేలిందని డబ్ల్యూహెచ్‌వో అనుబంధ విభాగమైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ కేన్సర్(ఐఏఆర్‌సీ) తెలిపింది. ఆస్పర్టెమ్‌లో కేన్సర్ కారకాలుండేందుకు అవకాశమున్నట్లు మనుషులు, జంతువులపై జరిపిన అధ్యయనాల్లో తేలిందని ఐఏఆర్‌సీ తెలిపింది. అయితే, ఆస్పర్టెమ్ పరిమిత వాడకం సురక్షితమేనంటూ ఐరాసలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏఓ), డబ్ల్యూహెచ్‌వో ఎంపిక చేసిన నిపుణుల కమిటీ నిగ్గు తేల్చింది. దీనిపై డబ్ల్యూహెచ్‌వో న్యూట్రిషన్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సెస్కో బ్రాంకా మాట్లాడుతూ.. ఆస్పర్టెమ్‌ను మొత్తానికే మానేయాలని అనడం లేదు, మితంగా వాడాలని మాత్రమే చెబుతున్నామన్నారు. అత్యధికంగా వాడే వారు మాత్రమే తగ్గించుకోవాల్సి ఉంటుంది. కాస్త ఎక్కువగా వాడినా ఎటువంటి అనర్థాలు ఉండవని బ్రాంకా చెప్పారు. 'ఆస్పర్టెమ్‌తో కాలేయ క్యాన్సర్ రావొచ్చనేందుకు మాత్రం ఆధారాలు పరిమితంగానే లభించాయి. ప్రస్తుతం వినియోగించే స్థాయిల్లో ఆస్పర్టెమ్ ప్రమాదకరమని చెప్పేందుకు బలమైన ఆధారం దొరకలేదు. ఆమోదయోగ్యమైన వినియోగ స్థాయిలకు సంబంధించిన మార్గదర్శకాల్లో మార్పులేదు. పరిమితంగా, మార్గదర్శకాలకు లోబడి వాడితే ఆస్పర్టెమ్ వల్ల సాధారణంగా ఎటువంటి హాని కలగదు'అని ఎఫ్‌డీఏ తెలిపింది. సాధారణంగా రోజుకు 14 కేన్ల వరకు ఆస్పర్టెమ్ ఉన్న డ్రింకులను తాగొచ్చునని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ స్పీగెల్‌హాల్టర్ తెలిపారు.

మామా.. మేమొస్తున్నాం...!

చంద్రయాన్-3 ప్రయోగం దిగ్విజయం • ముచ్చటగా మూడోసారి విజయవంతం • సూటిగా కక్ష్యలోకి చేరిన ఉపగ్రహం

- మళ్లీ సత్తా చాటిన బాహుబలి రాకెట్
- చంద్రుని చేరే దిశగా కీలక ముందడుగు
- ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి
- ఫలించిన శాస్త్రవేత్తల కృషి, దేశమంతా సంబరాలు
- రాష్ట్రపతి, ప్రధాని తదితరుల ప్రశంసలు
- ఆగస్టు 23న చంద్రుడిపై దిగనున్న ల్యాండర్, రోవర్
- ఆ తర్వాత చంద్రుడిపై కీలక పరిశోధనలు



అది శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష ప్రయోగ (షార్) కేంద్రం. అటు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇటు యావద్దేశం ఊపిరి కూడా బిగబట్టి మరీ అత్యంత ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వేళ. శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలైంది. 25.3 గంటల కౌంట్‌డౌన్‌కు నరాలు తెగే ఉత్కంఠ నడుమ ఎట్టకేలకు తెర పడింది. ఆ వెంటనే ఇస్రో బాహుబలి ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. గత వైఫల్యాల నేపథ్యంలో అంతటా ఉద్విగ్న వాతావరణం. అందరిలోనూ మరింత ఉత్కంఠ. మనసు మూలల్లో ఎక్కడో కాసింత అనుమానం. కానీ, ఉత్కంఠకు తెర దించుతూ, అనుమానాలను పటాపంచలు చేస్తూ మన బాహుబలి దిగ్విజయంగా రోదసి చేరింది. అంతరిక్ష సీమలో విజయనాదం చేసింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పదేళ్ల కల నెరవేరింది. చంద్రయాన్-1, 2 ప్రయోగాలు నిరాశ పరిచినా పట్టు వీడకుండా మొక్కవోని దీక్షతో మన శాస్త్రవేత్తల బృందం రాత్రింబవళ్లు పడిన కష్టం ఎట్టకేలకు ఫలించింది. ముచ్చటగా మూడోసారి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైంది. మూడు దశల ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ చంద్రయాన్-3 త్రీ-ఇన్-ఒన్ మిషన్‌ను విజయవంతంగా రోదసి చేర్చి కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. దాంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఆనందం వెల్లివిరిసింది. దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది. రాష్ట్రపతి, ప్రధాని మొదలుకుని ప్రముఖులంతా ఇస్రోను, ఇంతటి విజయానికి కారకులైన శాస్త్రవేత్తల బృందాన్ని అభినందనలతో ముంచెత్తారు.

– సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

ఆ ఉద్విగ్న క్షణాలు...

తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ కేంద్రం నుంచి శుక్రవారం చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం సూపర్ సక్సెసైంది. 640 టన్నుల ఎల్‌వీఎం3-ఎం4 ఉపగ్రహ వాహకనౌక, 3,920 కిలోల చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని మోసుకుని నింగివైపునకు వేగంగా దూసుకెళ్లింది. వెంటనే మిషన్ కంట్రోల్ రూంలోని శాస్త్రవేత్తలు టెన్షన్‌గా కంప్యూటర్లను ఆపరేట్ చేస్తూ కంటిమీద రెప్ప వాల్చకుండా రాకెట్ గమనాన్ని పరిశీలించారు. మూడు దశలతో కూడిన ప్రయోగాన్ని 16.09 నిమిషాల్లో పూర్తిచేశారు. చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసెంట్రిక్ అర్బిట్ (అత్యంత విపరీత కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రోకు ఇది 89వ విజయం. గ్రహాంతర ప్రయోగాల్లో చంద్రయాన్-3 నాలుగో ప్రయోగం కాగా చంద్రునిపై పరిశోధనల నిమిత్తం చేసిన ప్రయోగాల్లో మూడోది. ఇది ఇస్రో బాహుబలి రాకెట్ జీఎస్ఎల్‌వీ మార్క్-3 సిరీస్‌లో మూడు ప్రయోగాలు, ఎల్‌వీఎం-3గా పేరు మార్చాక నాలుగో ప్రయోగం! కార్యక్రమాన్ని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రధాని కార్యాలయ ప్రతినిధి జితేంద్రసింగ్ స్వయంగా షార్ కేంద్రం నుంచి వీక్షించారు.

ప్రయోగం జరిగిందిలా...

- 640 టన్నులు, 43.43 అడుగుల పొడవున్న ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 3,920 కిలోల చంద్రయాన్-3 మిషన్ మోసుకెళ్లింది.
- చంద్రయాన్-3లో 2,145 కిలోల ప్రొపల్షన్ మాడ్యూల్, 1,749 కిలోల ల్యాండర్ (విక్రమ్), 26 కిలోల రోవర్ (ప్రజ్ఞాన్)ల్లో ఆరు ఇండియన్ పేలోడ్స్, ఒక అమెరికా పేలోడ్ అమర్చి పంపారు.
- ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ తొలి దశలో ఇరువైపులా అత్యంత శక్తిమంతమైన ఎస్-200 బూస్టర్ల సాయంతో నింగికి దిగ్విజయంగా ప్రయాణం ప్రారంభించింది.
- ఈ దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 127 సెకెండ్లలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశారు.
- ద్రవ ఇంజిన్ మోటార్లతో కూడిన రెండో దశ (ఎల్-110) 108.10 సెకన్లకే మొదలైంది.
- 194.96 సెకన్లకు రాకెట్ అగ్ర భాగాన అమర్చిన చంద్రయాన్-3 మిషన్ హీట్ షీల్డులు విజయవంతంగా విడిపోయాయి.
- 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి 305.56 సెకన్లకు రెండోదశను కూడా విజయవంతంగా పూర్తి చేశారు.
- అత్యంత కీలకమైన మూడో దశలో 307.96 సెకన్లకు క్రయోజనిక్ (సీ-25) మోటార్లను మండించారు. 954.42 సెకన్లకు 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వినియోగించి మూడో దశను విజయవంతంగా పూర్తి చేశారు.
- రాకెట్ అగ్ర భాగాన అమర్చిన త్రీ ఇన్ వన్ చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ఈ దశలోనే 969 సెకన్లకు (16.09 నిమిషాల వ్యవధిలో) భూమికి దగ్గరగా (పెరిజీ)170 కిలోమీటర్లు, దూరంగా (అపోజీ) 36,500 కిలోమీటర్ల ఎత్తులో హైలీ ఎసెంట్రిక్ అర్బిట్ (అత్యంత విపరీత కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు.



చంద్రయాన్-3 సక్సెస్‌తో హైదరాబాద్‌లో త్రివర్ణ పతాకాలతో స్కూల్ విద్యార్థుల ఆనందం

14 రోజులు, 500 మీటర్లు...

- ల్యాండర్ నుంచి రోవర్ చంద్రుని ఉపరితలంపై దిగేందుకు 4 గంటల సమయం తీసుకుంటుందని అంచనా.
- రోవర్ సెకనుకు సెంటీమీటర్ వేగంతో కదులుతుంది. రోవర్ ఒక లూనార్ డే (చంద్రుని రోజు-మన లెక్కలో 14 రోజులు) పని చేస్తుంది.
- ఆ 14 రోజుల వ్యవధిలో రోవర్ 500 మీ టర్లు ప్రయాణించి చంద్రుని ఉపరితలంపై మూలమూలలనూ శోధించి భూ నియంత్రిత కేంద్రానికి కీలక సమాచారం చేరవేస్తుంది.
- ఇప్పటిదాకా చంద్రుడిపై పరిశోధనలు చేసే దేశాల్లో మనది నాలుగో స్థానం. గతంలో రష్యా, అమెరికా, చైనా మాత్రమే ఇలాంటి ప్రయోగాలు చేశాయి.
- చంద్రయాన్-1తో ఉపగ్రహాన్ని చంద్రుని చుట్టూ పరిభ్రమించేలా చేసిన తొలి దేశంగా భారత్ నిలిచింది.
- చంద్రయాన్-2 ద్వారా ల్యాండర్, రోవర్‌తో చంద్రుని ఉపరితలంపై పరిశోధనలు చేయాలని సంకల్పించగా ఆ ప్రయోగం దురదృష్టవశాత్తూ చివరి రెండు నిమిషాల్లో చంద్రుని ఉపరితలాన్ని ఢీకొని సిగ్నల్స్ అందకుండా పోయాయి. దీన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సవాలుగా తీసుకుని నిరంతరం శ్రమించి చంద్రయాన్-2 సాంకేతిక లోపాలను సరిదిద్దుకుని నాలుగేళ్ల తరువాత చంద్రయాన్-3ని దిగ్విజయంగా చంద్రుని కక్ష్యలోకి పంపారు.

చంద్రుడిపైకి ఇలా వెళ్తుంది...

- చంద్రయాన్-3 మిషన్ మరో 41 రోజుల్లో, అంటే ఆగస్టు 23న సాయంత్రం 5.47 గంటలకు చంద్రుని ఉపరితలంపై దిగుతుంది.
- 16 రోజుల్లో ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన 1,696 కిలోల ఇంధనాన్ని మండించి నాలుగు సార్లు కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను చేపడతారు.
- ఆగస్టు 1న ఐదోసారి ప్రొపల్షన్ మాడ్యూల్‌ను ట్రాన్స్ లూనార్ ఇంజెక్షన్ ద్వారా చంద్రుని దిశగా మళ్లిస్తారు.
- తర్వాత ప్రొపల్షన్ మాడ్యూల్‌కు చంద్రుని చుట్టూ కక్ష్య ఏర్పరిచేందుకు రెట్రో బర్న్ చేసి 100 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యను తగ్గించే ప్రక్రియను నాలుగుసార్లు చేపడతారు.
- అలా ఆగస్టు 17న చంద్రయాన్-3 చంద్రుని కక్ష్యలోకి వెళుతుంది. తరవాత ప్రొపల్షన్ మాడ్యూల్ తన ఎత్తును 100 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్లకు తగ్గించుకుంటూ ల్యాండర్‌ను విడిచిపెడుతుంది.
- తరవాత ల్యాండర్‌లోని ఇంధనాన్ని కూడా మండించి ఆగస్టు 23న చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతంలో మృదువైన ప్రదేశంలో సాఫ్ట్ లాండింగ్ చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు.
- ల్యాండర్ విడిపోయిన తరువాత ల్యాండర్‌ను 15 నిమిషాల పాటు మండించి దాన్ని చంద్రుడి ఉపరితలంపై దించే ప్రక్రియను ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత కీలకంగా భావిస్తున్నారు.
- ఇప్పటి దాకా ఇలాంటి ల్యాండింగ్ ఎవరూ చేయలేదు. మొట్టమొదటిగా భారతే చేయడంతో ప్రపంచమంతా ఇస్రో వైపు చూస్తోంది.
- చంద్రయాన్-1లో వాడిన పరిజ్ఞానాన్నే చంద్రయాన్-2లోనూ వాడారు. చంద్రయాన్-3 ప్రయోగాన్ని కూడా చంద్రయాన్-2 తరహాలోనే నిర్వహించారు.
- చంద్రయాన్-2లో ల్యాండర్, రోవర్లను తీసుకెళ్లిన ఆర్బిటర్ ఇప్పటికీ చంద్రుని కక్ష్యలోనే పని చేస్తూ విలువైన సమాచారం అందిస్తూనే వుంది.
- అందుకే ఈసారి ఆర్బిటర్‌కు బదులు ప్రొపల్షన్ మాడ్యూల్ ద్వారా ల్యాండర్, రోవర్లను పంపారు.
- ఈ ప్రయోగంలో ఇస్రో తొలిసారిగా థొరెటల్-అబల్ అనే లిక్విడ్ ఇంజన్లను చంద్రుని ఉపరితలంపై మృదువైన చోట ల్యాండర్‌ను సురక్షితంగా దించేందుకు ఇప్పట్నుంచే ప్రయత్నిస్తున్నారు.

కునో నేషనల్ పార్కులో 8వ చీతా మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో మూడు రోజుల వ్యవధిలో మరో చీతా చనిపోయింది. దీంతో, ఈ ఏడాది మార్చి నుంచి చనిపోయిన చీతాల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. మూడు రోజుల క్రితం తేజస్ అనే చీతా చనిపోయింది. 'సూరజ్ అనే చీతా పల్పూర్ ఫారెస్ట్ రేంజ్‌లోని మసావనీ బీట్‌లో శుక్రవారం ఉదయం పడుకుని ఉండగా గమనించాం. మానిటరింగ్ టీం దగ్గరికెళ్లి చూడగా దాని మెడపై కీటకాలు ఎగురుతూ కనిపించాయి. సిబ్బందిని చూసి అది పరుగుతీసింది. ఉదయం 9 గంటల సమయంలో సూరజ్ చనిపోయినట్లు వైద్య నిపుణులు, అటవీ అధికారుల బృందం గుర్తించింది'అని అధికారి ఒకరు వెల్లడించారు. ఫ్రీ రేంజ్ ప్రాంతంలో చీతా చనిపోవడం ఇదే మొదటిసారి. సూరజ్ మెడ, వీపుపై గాయాల గుర్తులున్నాయి. నిపుణుల సవివర నివేదిక అందాల్సి ఉందని ఆ అధికారి తెలిపారు. దేశం నుంచి కనుమరుగైన చీతాల సంతతిని తిరిగి పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో నమీబియా నుంచి 8 చీతాలను, ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకువచ్చింది. మరో నాలుగు కూనలు పుట్టడంతో మొత్తం చీతాల సంఖ్య 24కు చేరుకుంది. వివిధ కారణాలతో 8 చనిపోవడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 16కు తగ్గిపోయింది.

మనకిక ఆకాశమే హద్దు

మంత్రి జితేంద్రసింగ్, ఇస్రో చైర్మన్ సోమనాథ్



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం అయ్యాక శాస్త్రవేత్తలతో కలిసి కేంద్రమంత్రి, పీఎం కార్యాలయం ప్రతినిధి డాక్టర్ జితేంద్రసింగ్, ఇస్రో చైర్మన్ సోమనాథ్ సంబరాలు

చంద్రయాన్-3 ప్రయోగం నిజంగా సవాలేనని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. ప్రయోగం విజయవంతమయ్యాక ఆయన మీడియాతో మాట్లాడారు. దేశీయంగా రూపొందించిన ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగం తొలి దశను విజయవంతం చేసినందుకు గర్వంగా ఉందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు కలసికట్టుగా పని చేయడమే ఇంతటి భారీ విజయానికి కారణమన్నారు. ''ఇక రాబోయే 41 రోజులు అత్యంత కీలకం. ఆగస్టు 23న ల్యాండర్‌ను చంద్రునిపై విజయవంతంగా దించేందుకు ప్రయత్నిస్తాం. ఆగస్టు మూడో వారంలో సూర్యుడిపై పరిశోధనలకు ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తాం. మిషన్ సూర్య, చంద్ర రెండింటినీ పూర్తి చేస్తామని నమ్మకముంది'' అని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంలో త్వరలో భారత్ ప్రపంచంలోనే తొలి స్థానానికి చేరనుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్ అన్నారు. ఆగస్టు 23న ల్యాండర్ చంద్రునిపై దిగితే అంతరిక్ష ప్రయోగాల్లో భారత్‌కు ఆకాశమే హద్దన్నారు. ఇస్రో చైర్మన్‌తో కలిసిరాకెట్, చంద్రయాన్-3 నమూనాలను ఆయన ఆవిష్కరించారు. భేటీలో చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరముత్తువేల్, మిషన్ డైరెక్టర్ ఎస్. మోహన్‌కుమార్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మరో కీలక మైలురాయి

దేశ అంతరిక్ష పరిశోధనలో చంద్రయాన్-3 ప్రయోగం మరో కీలక మైలురాయి వంటిది. అంతరిక్ష శాస్త్రం, సాంకేతికత పురోగతిలో దేశం యొక్క తిరుగులేని నిబద్ధతకు నిదర్శనం. ఈ ఘనతను సాధించడంలో అవిశ్రాంతంగా పనిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రతి ఒక్కరికీ అభినందనలు.


– రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

భారత అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం

చంద్రయాన్-3 ప్రయోగం భారత అంతరిక్ష చరిత్రలో నూతన అధ్యాయం సృష్టించింది. భారత అంతరిక్ష చరిత్రలో ఈ రోజు స్వర్ణాక్షరాలతో లిఖింపబడుతుంది. చంద్రయాన్-3 ప్రతి భారతీయుడి కలను, ఆకాంక్షలను మోసుకుంటూ నింగికి ఎగసింది. ఈ మహత్తర విజయం మన శాస్త్రవేత్తల అవిశ్రాంత అంకిత భావానికి నిదర్శనం. వారి స్ఫూర్తికి, నైపుణ్యానికి నా సెల్యూట్. – ప్రధాని మోదీ

భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం

తీర్మానం ఆమోదించిన అమెరికా సెనేట్ కమిటీ



శాన్‌ఫ్రాన్సిస్కో: భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతం దక్షిణ టిబెట్‌లో భాగం, అది తమదేనంటూ వాదిస్తున్న చైనాకు మింగుడుపడని పరిణామమిది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం భారత్‌లో అంతర్భాగమంటూ అమెరికా సెనేట్ కమిటీ పేర్కొంది. భారత ప్రధాని మోదీ ఇటీవల అమెరికాలో జరిపిన చారిత్రక పర్యటన అనంతరం కంగ్రెషనల్ సెనెటోరియల్ కమిటీ ఈ మేరకు ఒక తీర్మానం చేయడం గమనార్హం. సెనేటర్లు బిల్ హగెర్టీ, టిమ్ కైన్, క్రిస్ వాన్ హోలెన్ గురువారం ఈ మేరకు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. చైనాకు, భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌కు ప్రస్తుతం ఉన్న మెక్ మెహన్ సరిహద్దు రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా అమెరికా గుర్తిస్తోందని ఆ తీర్మానం పునరుద్ఘాటించింది. అరుణాచల్ భారత్‌లో విడదీయరాని భాగమని స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలు తమవేనంటూ చైనా అనుసరిస్తున్న దుందుడుకు, విస్తరణవాద విధానాలను తోసిపుచ్చింది. ఈ తీర్మానం సెనేట్ ముందుకు ఓటింగ్‌కు రానుంది. ఈ విషయంలో ఇతర భావసారూప్యత కలిగిన ప్రపంచ దేశాలతో కలిసి భారత్‌కు అమెరికా మద్దతు, సాయాన్ని అందజేస్తుందని కంగ్రెషనల్ ఎగ్జిక్యూటివ్ కమిషన్ ఆన్ చైనా కో చైర్ సెనేటర్ మెర్క్‌లీ చెప్పారు.

మా దేశంలో కిరాయి సైన్యం లేదు.. వారికి చట్టబద్ధత లేదు



మాస్కో: వాగ్నర్ గ్రూప్ ప్రైవేట్ కిరాయి సైనికులకు ఒకే యూనిట్‌గా సేవలందించేందుకు అవకాశం ఇచ్చినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. ఇప్పటి వరకు పనిచేసిన విధంగానే అదే కమాండర్ ఆధ్వర్యంలో వారు కార్యకలాపాలు సాగించవచ్చన్నారు. అదే విధంగా, తమ దేశంలో ప్రైవేట్ ఆర్మీ లేదని, అటువంటి వాటికి చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పుతిన్ 23 ఏళ్ల పాలనలో ఎన్నడూ లేని విధంగా గత నెలలో వాగ్నర్ గ్రూప్ సైనికుల తిరుగుబాటుయత్నం, బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో మధ్యవర్తిత్వంతో 24 గంటల్లోనే సద్దుమణగడం తెలిసిందే. ఆ తర్వాత అయిదు రోజులకు జూన్ 29న వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ సహా అందులోని 35 మంది కమాండర్లతో సమావేశమైనట్లు పుతిన్ తాజాగా కొమ్మెర్‌శాంట్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. తిరుగుబాటుయత్నం కారణాలు, పరిస్థితులపై చర్చించానన్నారు. భవిష్యత్తులో పనిచేసేందుకు గల పలు అవకాశాలను వారి ముందుంచినట్లు వెల్లడించారు. ఇప్పటి మాదిరిగానే గ్రే హెయిర్ అనే కమాండర్ ఆధీనంలో పనిచేయడం అందులో ఒకటన్నారు. ఎటువంటి మార్పులు ఉండవని, గ్రూప్‌లోని అందరూ అందులో యథావిధిగా కొనసాగవచ్చని చెప్పానన్నారు. చాలా మంది కమాండర్లు ఈ ఆఫర్‌కు మొగ్గు చూపారన్నారు. అయితే, సమావేశం ముందు వరుసలో కూర్చున్న వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ మాత్రం..తమ వాళ్లకు ఇది నచ్చలేదని చెప్పారన్నారు. అయితే, చివరికి వాగ్నర్ గ్రూప్ ఈ ఆఫర్‌కు అంగీకరించిందీ లేనిదీ పుతిన్ స్పష్టం చేయకపోవడం గమనార్హం. వాగ్నర్ గ్రూప్‌కు ఎలాంటి చట్టబద్ధత లేదని ఈ సందర్భంగా పుతిన్ పేర్కొన్నారు. 'ప్రైవేట్ మిలటరీ సంస్థలకు సంబంధించి దేశంలో ఎలాంటి చట్టాలు లేవు. కాబట్టి, రష్యాలో ప్రైవేట్ ఆర్మీ లేదు. ప్రైవేట్ మిలటరీ కాంట్రాక్టర్ల విషయమై ప్రభుత్వం, పార్లమెంట్ చర్చించాల్సి ఉంది'అని పుతిన్ వివరించారు. వాగ్నర్ గ్రూప్ కిరాయి సైనికులు రష్యా రక్షణ శాఖతో ఒప్పందానికి రావడం లేదా పొరుగునున్న బెలారస్‌కు వెళ్లిపోవడం, రిటైర్ కావడం వంటి అవకాశాలను ఇచ్చినట్లు గతంలో పుతిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా, వాగ్నర్ గ్రూప్‌నకు చెందిన కొందరు సభ్యులు బెలారస్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించినట్లు చెబుతున్నారు.

శాంతించిన యమున

- తగ్గుముఖం పడుతున్న వరద ప్రవాహం
- ఢిల్లీలో ఇంకా ముంపులోనే పలు ప్రాంతాలు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన యమునా నది శుక్రవారం కొంత శాంతించింది. నదిలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అయినప్పటికీ పలు కీలక ప్రాంతాలు ఇంకా వరద ముట్టడిలోనే ఉన్నాయి. నది నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న సుప్రీంకోర్టు, రాజ్‌ఘాట్ దాకా వరద నీరు చేరింది. యమునా నదిలో నీటమట్టం గురువారం 208.66 మీటర్లకు చేరుకోగా, శుక్రవారం సాయంత్రం 6 గంటలకల్లా 208.17 మీటర్లకు తగ్గిపోయింది. వరద ప్రవాహం ధాటికి దెబ్బతిన్న ఇంద్రప్రస్థ వాటర్ రెగ్యులేటర్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పరిశీలించారు. త్వరగా మరమ్మతులు పూర్తి చేస్తామని కేజ్రీవాల్ చెప్పారు. ఈ రెగ్యులేటర్ దెబ్బతినడం వల్లే నదిలోని వరద ఇతర ప్రాంతాలకు వేగంగా విస్తరించింది. ఇసుక బస్తాలు, కంకరతో వరద ప్రవాహాన్ని ఆపేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, సైనిక జవాన్లు, ఢిల్లీ అధికారులు శ్రమిస్తున్నారు. నగరంలోని రోడ్లపై వరద నీరు ఇంకా తగ్గలేదు. రహదారులు చిన్నపాటి నదులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లను ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. వాహనాలను అనుమతించడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం కొనసాగుతున్నాయి. వరదలో చిక్కుకుపోయిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. శ్మశానాలు సైతం జలమయం కావడంతో అంత్యక్రియలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. వరద తీవ్రత దృష్ట్యా పలు శ్మశాన వాటికలను మూసివేసినట్లు నగర మేయర్ షెల్లీ ఒబెరాయ్ చెప్పారు.

వరదలపై ఆరా తీసిన ప్రధాని మోదీ

ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. ఢిల్లీలో వరద పరిస్థితిపై ఆరా తీశారు. మరో 24 గంటల్లో యమునా నదిలో ప్రవాహం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, అతి త్వరలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని మోదీకి అమిత్ షా వివరించారు.

చంద్రబాబు మిత్రుడు, సింగపూర్ మంత్రి

ఎస్. ఈశ్వరన్ అరెస్టు

సింగపూర్: అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సింగపూర్ రవాణా శాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్‌ను ఈ నెల 11న(మంగళవారం) అరెస్టు చేసినట్లు అవినీతి వ్యవహారాల దర్యాప్తు సంస్థ(సీపీఐబీ) శుక్రవారం వెల్లడించింది. అనంతరం ఆయన బెయిల్‌పై విడుదలైనట్లు తెలియజేసింది. ఈశ్వరన్‌ను సీపీఐబీ కస్టడీలోకి తీసుకున్నట్లు బుధవారమే వార్తలు వచ్చాయి. కానీ, దర్యాప్తు సంస్థ అధికారికంగా ప్రకటించడం ఇదే మొదటిసారి. అయితే, కేసు దర్యాప్తుపై సీపీఐబీ వివరాలు బయటపెట్టలేదు. ఈశ్వరన్‌ను అరెస్టు చేసిన రోజే ఆయన సన్నిహితుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఓంగ్ బెంగ్ సెంగ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈశ్వరన్‌తో ఆర్థిక లావాదేవీలపై ఆయనను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఓంగ్ బెంగ్ సెంగ్ కూడా షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈశ్వర్‌పై ఆరోపణలు రాగానే సింగపూర్ ప్రధానమంత్రి లీ సీన్ లూంగ్ స్పందించారు. దర్యాప్తు పూర్తయ్యే దాకా విధులకు దూరంగా ఉండాలని ఈశ్వరన్‌ను ఆదేశించారు.



అసలేం జరిగింది?

మలేషియా పౌరుడైన ఓంగ్ బెంగ్ సెంగ్ సింగపూర్‌లో హోటల్ ప్రాపర్టీస్ లిమిటెడ్(హెచ్‌పీఎల్) పేరిట సంస్థను నిర్వహిస్తున్నాడు. 135 మిలియన్ డాలర్ల విలువైన ఫార్ములా వన్ రేసింగ్ ప్రాజెక్టు నెలకొల్పుతామంటూ సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రభుత్వం తరఫున మంత్రి ఈశ్వరన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం.. 40 శాతం నిధులను ఓంగ్ బెంగ్ సెంగ్, మిగతా 60 శాతం నిధులను సింగపూర్ టూరిజం బోర్డు సమకూర్చాల్సి ఉంటుంది. ప్రభుత్వ వాటా విషయంలోనే గోల్‌మాల్ జరిగిందని సీపీఐబీ అనుమానిస్తోంది. పెద్ద ఎత్తున కమిషన్లు చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. సింగపూర్ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కొందరికి వ్యక్తిగత ప్రయోజనాలు చేకూర్చేందుకు ఈశ్వర్ పలు సందర్భాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడితో ఈశ్వరన్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమరావతిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి ఒప్పందం విషయంలో అప్పట్లో ఈశ్వరన్ పేరు బాగా వినిపించింది. ఈ ప్రాజెక్టును సింగపూర్ ప్రైవేట్ సంస్థల కన్సార్టియంకు అప్పగిస్తూ 2017 మే 12న ఈశ్వరన్‌తో చంద్రబాబు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందంపై ఈశ్వరన్ స్వయంగా సంతకాలు చేశారు.

గవర్నర్‌తో సీఎస్, డీజీపీ భేటీ

సాక్షి, చెన్నై: రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్‌రవితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, డీజీపీ శంకర్ జివ్వాల్ శుక్రవారం భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌లో ఈ భేటీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బు , డీజీపీ శైలేంద్రబాబు గత నెల ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో కొత్త సీఎస్‌గా శివదాస్ మీనా, డీజీపీగా శంకర్ జివ్వాల్ నియమితులయ్యారు. వీరు ఈనెల మొదటివారంలో బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో గవర్నర్ వారం రోజులు ఢిల్లీ పర్యటనలో ఉండడంతో వీరు కలుసుకోలేదు. శుక్రవారం గవర్నర్ చెన్నైకు రావడంతో మర్యాదపూర్వకంగా ఈ ఇద్దరు అధికారులు వేర్వేరుగా గవర్నర్‌ను కలిశారు. వీరికి అభినందనలు, శుభాకాంక్షలను గవర్నర్ తెలియజేశారు. అలాగే, రాష్ట్రంలోని పరిస్థితులు, శాంతిభద్రతల గురించి చర్చించారు.

న్యూస్‌రీల్

చీర, ధోవతి పథకానికి రూ. 200 కోట్లు

సాక్షి, చెన్నై: సంక్రాంతి సందర్భంగా ఉచిత ధోవతి, చీర పంపిణీ పథకానికి ముందస్తుగా రూ.200 కోట్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, లబ్ధిదారులకు ఈ ఉచితాలు సక్రమంగా అందుతున్నాయా అని పరిశీలించడం, పంపిణీ వ్యవస్థలో మార్పులకుగాను ప్రత్యేక కమిటీని నియమించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఏదో ఒక కానుకలను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఓ సారి నగదు, మరోసారి వస్తువుల కిట్లు అంటూ పంపిణీ చేశారు. అలాగే, ప్రతిఏటా చీర, ధోవతిలను అందజేస్తున్నారు. రేషన్ కార్డులు కలిగి ఉన్న వారిలో కోటి 68 లక్షల మందికి చీరలు, కోటి 63 లక్షల మందికి ధోవతిలను అందజేస్తున్నారు. 2024 సంక్రాంతి సందర్భంగా వీటిని పంపిణీ చేయడానికి ముందస్తు పనులు మొదలెట్టారు. చీర, ధోవతిల ఉత్పత్తి పనులకు గాను రూ. 200 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం పంపిణీ వ్యవస్థలో మార్పులు, లబ్ధిదారులకు సక్రమంగా చేరుతున్నాయా అని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని నియమించారు.

గస్తీ ముమ్మరం


- మూడు రాత్రులు సోదాలు
- చెన్నై పోలీసుల దూకుడు

సాక్షి, చెన్నై: చెన్నై నగరంలోని నేరగాళ్లు, రౌడీలు, అతివేగంగా వాహనాలు నడిపే వారు, మద్యం మత్తులో దూసుకొచ్చే వారు, బైక్ రేసింగ్‌తో దూసుకెళ్లే యువత భరతం పట్టే విధంగా శుక్రవారం రాత్రి నుంచి చెన్నై పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. ఆదివారం అర్ధరాత్రి వరకు ఈ సోదాలు జరగనున్నాయి. ప్రతి వారంలో చివరి రోజు మందుబాబుల భరతం పట్టే విధంగా పోలీసులు వాహన తనిఖీలు జరుపుతూ వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఏకంగా వారంలో మూడు రోజులు గస్తీ, తనిఖీకి కొత్త కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఆదేశించారు. దీంతో శుక్రవారం రాత్రి నుంచి నగరంలోని 300 మార్గాలను ఎంపిక చేసుకుని సోదాకు శ్రీకారం చుట్టారు. రాత్రుల్లోనే రౌడీలు అజ్ఞాతం నుంచి బయటకు వస్తున్నట్టు ఇప్పటికే సమాచారం ఉంది. ఇలాంటి వారిని అదుపులోకి తీసుకునే విధంగా అనేక కూడళ్లలో ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. అలాగే, నగరంలోని నిఘా నేత్రాల ఆధారంగా రాత్రుల్లో వాహన కదలికలు, మద్ ం మత్తులో దూసుకెళ్లే వారు, బైక్ రేసింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి భరతం పట్టే విధంగా ఈ సోదాలు జరుగుతున్నాయి. తమకు పట్టుబడే వారి వాహనాలను సీజ్ చేయడం, అరెస్టు చేయడం లేదా, జరిమానా విధించడం వంటి చర్యలతో ఈ మూడు రోజుల గస్తీ సాగనున్నదని పోలీసులు పేర్కొన్నారు.

వందేభారత్ రైలుపై రాళ్ల దాడి

సాక్షి, చెన్నై: చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం వందే భారత్ రైలుపై గుర్తుతెలియని ముఠా రాళ్ల దాడికి పాల్పడింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైలు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి ప్రతిరోజూ మైసూర్, కోయంబత్తూరుకు వందే భారత్ రైలు నడుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున 4.30 గంటల సమయంలో బేస్ బ్రిడ్జ్ యార్డ్ నుంచి సెంటర్ రైల్వేస్టేషన్‌కు వందే భారత్ రైలు ఖాళీగా వెళుతోంది. ఆ సమయంలో సెంట్రల్ స్టేషన్ సమీపంలో చీకటిలో దాగి ఉన్న దుండగులు రైలుపై రాళ్లతో దాడి జరిపారు. దీంతో రైలు రెండు బోగీల అద్దాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. అదృష్టవశాత్తు రైలు ఖాళీగా ఉండడంతో ప్రమాదం తప్పింది.

కుక్కల దాడిలో కృష్ణజింక మృతి



తిరుత్తణి: కుక్కల దాడిలో కృష్ణజింక ప్రాణాలు కోల్పోయిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తిరుత్తణి ఆర్కేపేట రాష్ట్ర రహదారి ఎస్‌వీజీ పురం వద్ద శుక్రవారం సాయంత్రం కుక్కల దాడిలో కృష్ణజింక ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించిన గ్రామీణులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న అటవీ శాఖ అధికారులు జంక కళేబరాన్ని ఖననం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 67,300 మంది స్వామివారిని దర్శించుకోగా, 32,802 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.83 కోట్ల కానుకలు సమర్పించారు.

స్వరాన్ని పెంచండి



ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

- గళాన్ని వినిపించండి
- కేంద్రంతో ఢీకి 37 అస్త్రాలు
- డీఎంకే ఎంపీల సమావేశంలో తీర్మానం

సాక్షి, చెన్నై: సర్వాన్ని పెంచండి, తమిళ గళాన్ని ఉభయ సభల వేదికగా వినిపించండి అని డీఎంకే ఎంపీలకు సీఎం స్టాలిన్ ఆదేశించారు. పార్లమెంట్, రాజ్యసభల వేదికగా కేంద్రంతో ఢీకొట్టేందుకు 37 అస్త్రాలను డీఎంకే ఎంపీలు సిద్ధం చేసుకున్నారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు జరగబోతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశాలలో తమిళ గళాన్ని వినిపించే విధంగా కీలక నిర్ణయాలు తీసుకునేందుకు పార్టీల ఎంపీలతో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ శుక్రవారం సమావేశమయ్యారు. తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం ఆవరణలోని మురసోలిమారన్ ఆడిటోరియంలో సమావేశం కొన్ని గంటల పాటు జరిగింది. ఇందులో పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, ప్రిన్సిపల్ కార్యదర్శి కేఎన్ నెహ్రూ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఐ.పెరియస్వామి, పొన్ముడి, అందియూరు సెల్వరాజ్, కనిమొళి, రాజా, దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండియన్, పార్టీ ఎంపీలు, రాజ్యసభ సభ్యులు హాజరయ్యారు. జాతీయ స్థాయిలోని పరిస్థితులు, అంశాలు, రాష్ట్రంలో కేంద్రం రూపంలో ఎదురవుతున్న సమస్యలు, వివాదాలు, గవర్నర్ తీరు సహా వివిధ అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. పార్లమెంట్ వేదికగా గర్జించే విధంగా ప్రతి సభ్యుడు తమిళ గళాన్ని వినిపించాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు. ప్రజలకు కేంద్రం చేసిన మోసాలు, పలు రాష్ట్రాలలో కేంద్రం కారణంగా జరుగుతున్న అరాచకాలు, జాతీయ స్థాయిలో కీలకంగా ఉన్న పలు సమస్యలను పార్లమెంట్‌లో వినిపించాలన్నారు. అలాగే, తమిళనాడును, తమిళ ప్రజలను ఇరకాటంలో పెట్టే విధంగా, మోసం చేసే రీతిలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఉభ సభల్లో ప్రస్తావించాలని వివరించారు.

ఢీ కొట్టేందుకు 37 అస్త్రాలు..

కేంద్రాన్ని ఉభయ సభల వేదికగా ఢీకొట్టేందుకు 37 అంశాలతో అస్త్రాలను సిద్ధం చేశారు.సమావేశంలో తీర్మానం రూపంలో ఈ అంశాలను ప్రస్తావించారు. ఇందులో 9 ఏళ్ల పాటు తమిళనాడు, దేశ ప్రజల్ని ఏవిధంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం మోసం చేస్తోందో అనే అంశాలను ప్రస్తావిస్తూ వివరించారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు, అమలుకు నోచుకోని పలు పథకాలను గుర్తుచేశారు. జీఎస్టీ అమలు, బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వంటి అంశాలను పొందుపరిచారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెంపును ప్రస్తావిస్తూ, ప్రశ్నించే వారిని బయటపెట్టి దారిలోకి తెచ్చుకునే విధంగా కేంద్రం ఏ విధంగా సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను ప్రయోగిస్తున్నదో వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, గవర్నర్ల ద్వారా ప్రజాస్వామ్యాన్ని పాతిపెట్టే విధంగా జరుగుతున్న పరిణామాలను ప్రస్తావించారు. రాజకీయ శాసనాలను పరిరక్షించడం లక్ష్యంగా, గవర్నర్ల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉభయ సభల్లో కేంద్రంతో ఢీకొట్టే విధంగా తీర్మానాలు చేశారు.

సెంథిల్‌కు చుక్కెదురు!

- ఈడీకి అరెస్ట్ అధికారం
- అన్ని చట్టబద్ధంగానే జరిగాయి
- మూడో న్యాయమూర్తి తీర్పు
- చికిత్స తర్వాత కస్టడీకి అనుమతి
- హెబియస్ కార్పస్ పిటిషన్ తిరస్కృతి



సెంథిల్ బాలాజి

సాక్షి, చెన్నై: మనీ లాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజీకి శుక్రవారం హైకోర్టులో చుక్కెదురైంది. మూడో న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు ఆయన మద్దతుదారుల్ని షాక్‌లోకి నెట్టింది. అరెస్టు, కస్టడీ వ్యవహారం చట్టబద్ధంగానే జరిగినట్టు పేర్కొంటూ, కేసును ముందుకు తీసుకెళ్లేందుకు ఈడీకి అధికారం ఉందని న్యాయమూర్తి కార్తికేయన్ స్పష్టం చేశారు. సెంథిల్ సతీమణి మేఘల దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

క్యాష్ ఫర్ జాబ్స్ కేసు వ్యవహారంలో మనీ లాండరింగ్ కేసులో మంత్రి సెంథిల్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్టుకు వ్యతిరేకంగా ఆయన సతీమణి మేఘల దాఖలు చేసిన పిటిషన్‌పై గత నెల హైకోర్టు ద్విసభ్య బెంచ్ న్యాయమూర్తులు నిషాభాను, భరత చక్రవర్తి భిన్న తీర్పులు ఇచ్చారు. ఒకరు ఈడీ వ్యవహారాలను వ్యతిరేకించగా, మరొకరు సమర్థిస్తూ తీర్పు చెప్పారు. దీంతో ఈకేసులో మూడో న్యాయమూర్తి ప్రమేయం అనివార్యమైంది. మూడో న్యాయమూర్తిగా కార్తికేయన్‌ను హైకోర్టు నియమించింది.

రెండు రోజులు వాదనలు..

మూడో న్యాయమూర్తి ప్రధానంగా మూడు అంశాలను అస్త్రంగా చేసుకుని ఈడీ, సెంథిల్ తరపున వాదనలను విన్నారు. ఇందులో ఒకటి ఈ పిటిషన్ విచారయోగ్యమా, రెండోది అరెస్టు, కస్టడీ వ్యవహారంలో ఈడీకి అధికారం ఉందా, మూడోది కస్టోడియల్ కాలం గురించి వాదనలు వాడి వేడిగా జరిగింది. సెంథిల్ తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, ఎన్‌ఆర్ ఇలంగోలు వాదన వినిపించారు. ఈడీ తరపున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది తుషార్ మెహతా వాదించారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తుది వాదనలు జరిగాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో న్యాయమూర్తి తన అభిప్రాయాలను తీర్పుగా వెలువరించారు.

తీర్పుతో షాక్..

గత విచారణలో ద్విసభ్య బెంచ్‌లోని న్యాయమూర్తి భరత చక్రవర్తి ప్రస్తావించిన అంశాల తరహాలోనే కార్తికేయన్ తీర్పు వెలువరించారు. అరెస్టు, కస్టడీ అంశాలలో ఈడీకి అన్ని అధికారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం సెంథిల్ ఆస్పత్రిలో ఉండడంతో చికిత్స ముగిసినా నంతరం ఆయన్ను కస్టడీకి తీసుకుని విచారించవచ్చని ఆదేశించారు. సెంథిల్ అరెస్టుతో ఆస్పత్రిలో చేరారని ఈ కాలాన్ని కస్టోడియల్ కాలంగా పరిగణించలేమని స్పష్టం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఈడీ విచారణ జరిగిన నేపథ్యంలో ఎందుకోసం విచారణ, అరెస్టులు అన్న సమాచారం సెంథిల్ బాలాజీకి తెలియ కుండా ఉండే అవకాశాలు లేవని పేర్కొన్నారు. అరెస్టు ప్రక్రియలన్నీ చట్టబద్ధంగానే పేర్కొంటూ, కస్టడీ, విచారణతో తన నిర్దోషిత్వాన్ని సెంథిల్ నిరూపించుకునే అవకాశం ఉంటుందంటూ, మేఘల దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

తీర్పుపై అసహనం..

మూడో న్యాయమూర్తి తీర్పుపై సెంథిల్ న్యాయవాది ఎన్‌ఆర్ ఇళంగో అసహనం వ్యక్తం చేశారు. చట్టంలో లేని అంశాల ఆధారంగా న్యాయమూర్తి కొత్త తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. ఈడీ పోలీసులతో సమానం కాదని పేర్కొంటూనే, పోలీసులకు ఉన్న అధికారం వారికి ఉందని న్యాయమూర్తి వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఈనెల 24న సుప్రీంకోర్టులో ప్రధాన కేసు విచారణకు రానున్నదని, ద్విసభ్య బె ంచ్, మూడో న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులను, చట్టాలలో పేర్కొనని అంశాలను, గత తీర్పులను సుప్రీం కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఇదిలాఉండగా సెంథిల్ బాలాజి ప్రధాన కేసు విచారణకు రాబోతున్న నేపథ్యంలో తమ విచారణకు మరో ఆరు నెలలు అవకాశం ఇవ్వాలని తమిళనాడు సెంట్రల్ క్రైం బ్రాంచ్ సుప్రీంకోర్టులో శుక్రవారం మరో పిటిషన్ దాఖలు చేసింది.

మన స్కూల్‌తో 6,796 బడుల అభివృద్ధి

- మంత్రి అన్బిల్ మహేశ్



మంత్రి అన్బిల్ మహేశ్

సాక్షి, చెన్నై: మనబడి, మన ఊరి బడి పథకం ద్వారా 6,796 పాఠశాలలను అభివృద్ధి చేశామని విద్యామంత్రి అన్బిల్ మహేశ్ తెలిపారు. శుక్రవారం తిరుచ్చికాట్టూరులోని ఆది ద్రావిడ సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్యకేంద్రాన్ని, విద్యార్థులకు అల్పాహార పథకాన్ని మంత్రి మహేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అల్పాహారం పథకం విస్తృతం చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. 10, 12 తరగతులలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది పదో తరగతి తప్పిన విద్యార్థులు అనేక మంది సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తులు చేసుకోలేదన్న సమాచారం వచ్చిందన్నారు. దీంతో ఆ విద్యార్థులను గుర్తించి పరీక్ష రాసే విధంగా చర్యలు చేపట్టామని వివరించారు. మన బడి, మన ఊరి బడి పథం ద్వారా ఇప్పటివరకు 6,796 బడులు అభివృద్ధి చేశామన్నారు. ఈ పాఠశాలలు ఎంతో సుందరంగా తీర్చిదిద్దబడ్డాయని వివరించారు. పాఠశాలల భవనాలు, ఇతర వసతుల కల్పన అంశాల గురించి మేనేజ్‌మెంట్ కమిటీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి అనుమతులు ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల నియామకం కసరత్తులు వేగంగా జరుగుతున్నాయని, మూడు వేల మంది ఉపాధ్యాయులను నియమించేందుకు కనీసం ఆరు నెలలు సమయం అవసరం అవుతోందన్నారు.

విస్తృతంగా మియావాకి అడవుల రూపకల్పన



సీఎం స్టాలిన్‌తో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్



మొక్కలు నాటుతున్న కేంద్ర మంత్రి

- విస్తృతంగా మియావాకి అడవుల రూపకల్పన..!
- కోవళంలో మొక్కలు నాటిన కేంద్ర మంత్రి
- సీఎం స్టాలిన్‌తో భేటీ

సాక్షి, చెన్నై: చెన్నై నగర శివార్లలో ఖాళీ స్థలాల మియావాకి అడవుల రూపకల్పన విస్తృతం కావాలని కేంద్రం అటవీ, పర్యావరణశాఖమంత్రి భూపేంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. చెన్నై శివారులోని కోవళంలో ఓ ప్రైవేటు సంస్థ నేతృత్వంలో మియావాకి అడవుల రూపకల్పనలో భాగం మొక్కలు నాటే కార్యక్రమంలో కోవలం సమీపంలో జరిగింది. పర్యావరణ పరిరక్షణకు విస్తృత చర్యలు చేపట్టాలని ఈసందర్భంగా మంత్రి సూచించారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గురించి మియావాకి అడవుల రూపకల్పన వేగాన్ని నగరాలలో విస్తృతం చేయాలని ఆదేశించారు. అనంతరం సచివాలయంలో సీఎం స్టాలిన్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఈసందర్భంగా పర్యావరణ, అటవీ సంబంధింత పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపట్టిన, చేపట్టనున్న కార్యక్రమాలను పరిశీలించారు.

కోర్టుకు అన్నామలై!

- టీఆర్ బాలు పిటిషన్ విచారణకు హాజరు
- సైదాపేట కోర్టు ఆవరణలో బీజేపీ నేతల హంగామా
- ఆగస్టు 24న మళ్లీ హాజరుకు ఆదేశం
- నెలాఖరులో మరో అవినీతి జాబితా



అన్నామలై కోర్టుకు హాజరు..బీజేపీ హంగామ

సాక్షి, చెన్నై: డీఎంకే పార్లమెంటరీ నేత, ఆ పార్టీ కోశాధికారి టీఆర్‌బాలు దాఖలు చేసిన పరువునష్టం దావా కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శుక్రవారం కోర్టు మెట్లు ఎక్కారు. బీజేపీ వర్గాల హంగామాతో సైదాపేట కోర్టు పరిసరాల్లో ఉత్కంఠ నెలకొంది. డీఎంకే అవినీతి అక్రమాలు అంటూ గత నెల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఓ జబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది వివాదానికి దారి తీసింది. అన్నామలైకు డీఎంకే వర్గాలు నోటీసులు పంపిస్తూ వివరణ కోరారు. ఆయన స్పందించకపోవడంతో కోర్టులో పిటిషన్ల దాఖలు చేశారు. ఇప్పటికే అన్నామలైపై సీఎం స్టాలిన్ పరువు నష్టం దావా వేశారు. డీఎంకే తరపున సీనియర్ నేత ఆర్‌ఎస్ భారతి మరో పిటిషన్ వేశారు. అలాగే, టీఆర్ బాలు కూడా దావా వేశారు. సైదాపేట కోర్టులో ఈ పిటిషన్‌ను ఇటీవల దాఖలు చేశారు. ఆధార రహిత ఆరోపణలు చేసి తన పరువుకు అన్నామలై భంగం కలించారని టీఆర్ బాలు ఆ పిటిషన్‌లో వివరించారు. వివరణ కోరుతూ నోటీసులు పంపినా సమాధానం లేదని, అందుకే అన్నామలై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేసినట్టు కోర్టుకు సూచించారు. ఈ పిటిషన్‌ను సైదాపేట కోర్టు న్యాయమూర్తి అనిత ఆనంద్ విచారణకు స్వీకరించారు.

కోర్టుకు హాజరు..

ఈ దావా విచారణ నిమిత్తం కోర్టుకు రావాలని అన్నామలైను న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో సైదాపేట కోర్టు వద్దకు అన్నామలై వచ్చారు. ఆయనకు మద్దతుగా బీజేపీ నాయకలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి నినాదాలు హోరెత్తించారు. హంగామా సృష్టించారు. ప్రధాన మార్గం గుండా కాకుండా, న్యాయమూర్తులు క్వార్టర్స్ మార్గంలో కోర్టు లోకి వెళ్లేందుకు అన్నామలై ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసమయంలో కోర్టు ఆవరణలో కాసేపు ఉత్కంఠ నెలకొంది. అనంతరం ప్రధాన మార్గంలోనే కోర్టులోకి అన్నామలై వెళ్లారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు హాజరయ్యారు. పిటిషన్ అంశాలను న్యాయమూర్తి ప్రస్తావిస్తూ తర్వాత విచారణ ఆగస్టు 24వ తేదీ జరుగుతుందని, ఆ రోజున స్వయంగా కోర్టుకు రావాలని అన్నామలైను ఆదేశించారు. వెలుపల మీడియాతో మాట్లాడిన అన్నామలై, డీఎంకే అవినీతి ఫైల్స్ రెండో భాగం ఈనెలాఖరులో విడుదల చేస్తానని ప్రకటించారు. కేసులకు తాను భయపడనని స్పష్టం చేశారు.

యాత్రకు లక్షన్నర మంది..

రాష్ట్రంలో బీజేపీ బలోపేతం దిశగా ఈనెలాఖరులో నా మట్టి..నా ప్రజలు నినాదంతో అన్నామలై పాద యాత్ర చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ యాత్రతో అన్నామలైతో కలిసి అడుగులు వేయడానికి లక్షన్నర మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రామేశ్వరం నుంచి ఈనెల 28న ఈ యాత్రను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. చెన్నై వరకు జనవరి 11వ తేదీ వరకు ఈ యాత్ర జరగనుంది. అన్ని నియోజక వర్గాలను కలుపుతూ రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈయాత్రలో అన్నామలైతో పయనం చేయదలచిన వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

వేలూరు: విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతిచెందాడు. రాణిపేట సమీపంలోని తండలం గ్రామం చెరువు కట్ట వీధికి చెందిన తులసి కుమారుడు మణిగంఠన్(8) రాణిపేటలో 3వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మణిగంఠన్ తల్లిదండ్రులు ఇద్దరూ గొడవపడ్డారు. ఆ సమయంలో భయాందోళన చెందిన మణిగంఠన్ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఇంటి బయట తెగిపడి ఉన్న విద్యుత్ తీగపై కాలు పెట్టడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి వాలాజ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

తిరువళ్లూరు: కుటుంబ కలహాలతో విరక్తి చెందిన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఈకాడు గ్రామంలో జరిగింది. తిరువళ్లూరు జిల్లా ఈకాడు ప్రాంతానికి చెందిన కపిల్‌దేవ్ భార్య నిత్య(35). వీరికి పదేళ్ల కిందట వివాహం జరిగింది. కుటుంబ ఆర్థిక సమస్యలతో తరచూ దంపతుల మధ్య ఘర్షణ జరిగేది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నిత్య ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గుర్తించిన కపిల్‌దేవ్ ఉరికి వేలాడుతున్న భార్యను కిందకు దించి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిత్య గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీ శేఖర్ కేసు రద్దు కుదరదు

- మద్రాసు హైకోర్టు తీర్పు



సాక్షి, చెన్నై: ఎస్.వి.శేఖర్‌పై హైకోర్టులో ఉన్న రెండు కేసుల్లో ఒక కేసును రద్దు చేయడం కుదరదని, మరో కేసును కొట్టివేస్తూ మద్రాసు హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే...గత 2018లో నటుడు, బీజేపీ నేత ఎస్వీ శేఖర్ మహిళా జర్నలిస్టుల గురించి సామాజిక మాధ్యమాల్లో పరువుకు నష్టం వాటిల్లే రీతిలో వాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో తమిళనాడు జర్నలిస్టుల సంక్షేమ సంఘం తరపున సెక్రటరీ మిదార్ మొయిద్దీన్ పిటిషన్ దాఖలు చేశారు. దీని ఆధారంగా సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్, చెన్నైలోని సైబర్ క్రైమ్ యూనిట్, మహిళలపై వేధింపుల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. అదేవిధంగా 2020లో అప్పటి ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామిపై తప్పుడు సమాచారం అందించి, జాతీయ జెండాను అవమానించేలా యూట్యూబ్ వీడియోను ప్రచురించినందుకు ఎస్వీ శేఖర్‌కు వ్యతిరేకంగా రాజారత్నం చేసిన ఫిర్యాదు మేరకు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కేసు నమోదు చేసింది. చెన్నై జిల్లా కలెక్టరేట్‌లోని ఎంపీలు, ఎమ్మెల్యేలపై ప్రత్యేక కోర్టు విచారణలో ఉన్న ఈ రెండు కేసులను కూడా కొట్టివేయాలని కోరుతూ ఎస్వీ శేఖర్ మద్రాసు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు జస్టిస్ ఎన్ ఆనంద్ వెంకటేష్ ముందు విచారణకు వచ్చాయి. ఎస్వీ శేఖర్ తరపు న్యాయవాది ఎస్వీ శేఖర్ సామాజిక మాధ్యమాలలో పెట్టిన వాటిని వెంటనే తొలగించారని, అంతేకాకుండా తన చర్యలకు క్షమాపణలు చెప్పారని వాదించారు. అప్పుడు న్యాయమూర్తి తప్పుడు సమాచారాన్ని నమోదు చేసి, తప్పుడు వ్యాఖ్యలు చేసి వెంటనే తొలగించాం, మన్నించండి అంటే చేసినవి తప్పులు కాకుండా పోతాయా అన్ని ప్రశ్నించారు. ఈ స్థితిలో శుక్రవారం ఈ కేసులపై న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ తీర్పును వెల్లడించారు. మహిళా జర్నలిస్టులను విమర్శిస్తూ పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు ప్రచురించిన కేసులో క్షమాపణలు చెప్పినంత మాత్రాన జరిగిన నష్టాన్ని సరికట్టలేమని అభిప్రాయపడుతూ ఆ కేసును కొట్టివేయలేమని తేల్చి చెప్పారు. అదేవిధంగా ఫార్వర్డ్ చేయడం వల్ల కలిగే ఏదైనా నష్టానికి దాని వినియోగదారు పూర్తిగా బాధ్యత వహిస్తారు. అతను దాఖలు చేసిన సాక్ష్యాలను అంగీకరించాలా వద్దా అనేది ప్రత్యేక న్యాయస్థానం నిర్ణయిస్తుంది. ఈ కేసు విచారణ కోర్టుపై ఎలాంటి ప్రభావం చూపదు. ప్రత్యేక న్యాయస్థానం ఆరు నెలల్లో కేసును పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా జాతీయ జెండాను అవమానించిన కేసును రద్దు చేస్తూ తీర్పునిచ్చారు.

20న అన్నాడీఎంకే నిరసన ప్రదర్శన

కొరుక్కుపేట: ధరల పెరుగుదలకు నిరసనగా అన్నాడీఎంకే ఈనెల 20న ఉదయం 10 గంటలకు రెవెన్యూ జిల్లాల కేంద్రాల్లో కలెక్టరేట్‌ల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో పెరంబలూరు, కన్యాకుమారి, సేలం, తేని, తంజావూరు, తిరుచ్చి జిల్లాల్లో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనకు సంబంధించిన నేతల వివరాలను ఎడపాడి పళనిస్వామి ప్రకటించారు. పెరంబలూర్–షెమ్మలై, కన్యాకుమారి – తలవైసుందరం, సేలం– పావరమటి, తేని– గోకుల ఇందిర, తంజావూరు– మోహన్, తిరుచ్చి– కల్యాణ సుందరం ఎన్నికయ్యారని ప్రధాన కార్యదర్శి ఎడపాడి వెల్లడించారు.

క్లుప్తంగా

అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ వలర్మతి

పళ్లిపట్టు: ఎంఆర్ఎఫ్ టైర్ ఫ్యాక్టరీ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలకు రూ.2.5 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను రాణిపేట కలెక్టర్ వలర్మతి శుక్రవారం ప్రారంభించారు. అరక్కోణం సమీపంలోని ఎంఆర్ఎఫ్ రబ్బర్ ఫ్యాక్టరీ ద్వారా సేవా కార్యక్రమాల నిధుల ద్వారా రూ.2.5 కోట్లతో ఇచ్చిపుత్తూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు అదనపు తరగతి గదుల భవనం నిర్మాణ పనుల భూమిపూజకు పంచాయతీ సర్పంచ్ పద్మనాభన్ అధ్యక్షత వహించారు. ఇందులో రాణిపేట కలెక్టర్ వలర్మతి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంఆర్ఎఫ్ టైర్ ఫ్యాక్టరీ జీఎం జాన్ డేనియల్, డిప్యూటీ జీఎం ఎల్విన్, యూనియన్ చైర్‌పర్సన్ నిర్మల, యూనియన్ కౌన్సిలర్ ఆశ పాల్గొన్నారు.

లంచం కేసులో అటవీశాఖ అధికారి



రేంజర్ జ్ఞానప్పన్

తిరువళ్లూరు: చట్టరీత్యా అనుమతి పొంది సాగు చేసిన ఎర్రచందనం దుంగలను రవాణా చేయడానికి అనుమతి కోసం వచ్చిన వ్యక్తి వద్ద రూ.5వేలు లంచం తీసుకున్న అటవీశాఖ అధికారిని ఏసీబీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరుపతి జిల్లా వరదయ్యపాళెం శాటిలైట్ కాలనీ ప్రాంతానికి చెందిన మునస్వామి కుమారుడు మునిబాబు(40). ఇతను సంబంధిత సంస్థ చట్టప్రకారం ఎర్రచందనం సాగు, రైతులకు ఎర్రచందనం నారు పంపిణీతో పాటు చైనా దేశాలకు ఎర్రచందనం దుంగలను ఎగుమతి చేసే వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనవరి నెలలో తిరువళ్లూరు జిల్లా మాదరపాక్కం పల్లవాడ, తేక్కమూరు గ్రామాల్లో చట్టరీత్యా అనుమతి పొంది సాగు చేసిన ఎర్రచందనం దుంగలను నరికి గోదాముకు తరలించడానికి యత్నించాడు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను తిరువళ్లూరు జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం నుంచి పొందాడు. అనంతరం సంబంధిత అనుమతి పత్రాలను గుమ్మిడిపూండి ఫారెస్టు రేంజర్‌కు సమర్పించి అతడి నుంచి మరో అనుమతి పొంది రవాణా చేయాల్సి వుంది. ఈ నేపథ్యంలో గత 6న రేంజర్ కార్యాలయానికి వెళ్లిన మునిబాబు రేంజర్ జ్ఞానప్పన్‌ను కలిసి అనుమతి ఇవ్వాలని కోరాడు. అయితే అనుమతుల కోసం రూ.10 వేలను లంచం డిమాండ్ చేశాడు. మునిబాబు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం సాయంత్రం లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు.

ఫార్మా రంగానికి పెద్దపీట

- ప్రభుత్వ కార్యదర్శి అరుణ్ రాయ్



ప్రారంభోత్సవంలో ప్రభుత్వ కార్యదర్శి అరుణ్‌రాయ్

కొరుక్కుపేట: ఫార్మా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ఎంఎస్ఎం ఈ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ అరుణ్ రాయ్ తెలిపారు. ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (తమిళనాడు, పుదుచ్చేరి అండ్ కేరళ స్టేట్ బోర్డ్) ఆధ్వర్యంలో ఫార్మాక్ సౌత్–2023 పేరుతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఫార్మా స్యూటికల్ ఎక్స్‌పోను చెన్నైలో ఏర్పాటు చేశారు. 8వ ఎడిషన్ ఫార్మాక్ సౌత్–2023 రెండు రోజుల ఎక్స్ పో ను శుక్రవారం అరుణ్ రాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం ప్రస్తుతం ఫార్మాసిటీ ఆఫ్ ది వరల్డ్ గా పిలువబడుతోందని అన్నారు. తమిళనాడులో ఫార్మా ఎంఎస్ఎంఈని ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ ఈ ఏడాది మేలో దిండివనం ఫార్మా పార్క్‌ను ప్రారంభించారని తెలిపారు. ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐడీఎంఏ) చైర్మన్ జె. జయశీలన్ స్వాగతోపన్యాసం చేస్తూ దేశంలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ 2024 నాటికి 65 బిలియన్లకు చేరుకుంటుందని, 2030 నాటికి ఇది 130 బిలియన్లకు చేరుకుంటుందని వివరించారు. కోవిడ్ సమయంలో అసోసియేషన్ అవసరమైన మందులను పంపిణీ చేయడానికి అవిశ్రాంతంగా పనిచేసిందని. ఐడీఎంఏ తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ స్టేట్ బోర్డ్‌తో పాటు ఇతర ఫార్మా అసోసియేషన్లు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షల చెక్కును చైర్మన్ జె జయశీలన్ మాజీ చైర్మన్ ఎస్‌వీ వీరమణి అందజేసినట్టు గుర్తుచేశారు. మాజీ అధ్యక్షుడు ఎస్‌వీ వీరమణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినూత్న నిరసన



ట్రాక్టర్లతో రైతుల నిరసన

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా కీల్ పెన్నాతూరులో తమిళనాడు వ్యవసాయ సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో పది డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ పది రోజులుగా రైతులు వినూత్నంగా ఆందోళన చేస్తున్నారు. కీల్ పెన్నాతూరు వ్యవసాయ గిడ్డంగి వద్ద ఈనెల 5న ప్రారంభించిన ఈ దీక్ష శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌లతో కలిసి రైతులు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపారు. కిలో మీటరు వరకు సాగిన ఈ ర్యాలీలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుణశేఖరన్, కార్యదర్శి ఏలుమలై మాట్లాడుతూ రైతులకు సబ్సిడీతో కూడిన విత్తనాలు సరఫరా చేయాలని, రైతులు పండించిన పంటను నేరుగా వ్యవసాయ గిడ్డంగిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. తమ పోరాటాలను తీవ్రతరం చేసేందుకు వెనుకాడబోమని తెలిపారు. సంఘం యూనియన్ కార్యదర్శి మునిరాజన్ పాల్గొన్నారు.

భర్తపై చర్యలు తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న మహిళ

అన్నానగర్: ముసిరి సమీపంలో భర్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళ శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగింది. తిరుచ్చి జిల్లా ముసిరి సమీపంలో తుంబళం పెరుమాళ్ పాళయంకు చెందిన కలైయరసి (23). ఈమెకు అదే గ్రామానికి చెందిన రాజశేఖరన్ (29)కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఈ స్థితిలో రాజశేఖర్ కలైయరసికి తెలియకుండా మూడు నెలల క్రితం మరో పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో కలైయరసి రాజశేఖరన్‌పై చర్యలు తీసుకోవాలని ముసిరి ఆల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు స్వీకరించలేదు. దీంతో కలైయరసి ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని గురువారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసింది. అనంతరం ఎస్ఐ లత కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో కలైయరసి ధర్నాను విరమించింది.

ఫ్రాన్స్‌లో తిరువళ్లువర్ విగ్రహం

- రూపొందించిన శిల్పి మునుస్వామి
- తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రధాని మోదీ సందర్శన



శిల్పి మునుస్వామి

కొరుక్కుపేట: ఫ్రాన్స్ ప్రభుత్వ అనుమతితో సెప్టెంబర్‌లో ఫ్రాన్స్‌లోని జెర్సీ సిటీలోని సెంట్రల్ పార్క్ కాంప్లెక్స్‌లో తిరువళ్లువర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. పుదుచ్చేరికి చెందిన పద్మ అవార్డు గ్రహీత శిల్పి మునుస్వామి ఈ విగ్రహాన్ని రూపొందించారు. కాంస్యంతో ఏడు అడుగుల ఎత్తుతో 600 కిలోల బరువుతో తిరువళ్లువర్ విగ్రహం ఉంటుంది. ఈ తిరువళ్లువర్ విగ్రహాన్ని మూడు నెలల క్రితం విమానంలో ఫ్రాన్స్‌కు తీసుకెళ్లారు. విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా తిరువళ్లువర్ సదస్సు కూడా జరుగుతుంది. అందరినీ ఆకర్షించేలా ఈ విగ్రహాన్ని రూపొందించారు. ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ శుక్రవారం ఈ విగ్రహాన్ని సందర్శించారు.

ఉపాధి హామీ కూలీల రాస్తారోకో



సేత్తుపట్టులో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

వేలూరు: సమస్యలు పరిష్కరించాలని ఉపాధి కూలీలు రాస్తారోకో చేశారు. తిరువణ్ణామలై జిల్లా సేత్తుపట్టు తాలుకా పిలాతి గ్రామంలో ఉపాధి కూలీలు మూడు విభాగాలుగా ఏర్పడి గ్రామ పంచాయతీలో ప్రతిరోజూ కాలువ పనులు చేస్తున్నారు. ఇందులో ఒక వర్గానికి చెందిన కూలీలను మూడు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి పనులు చేయించారు. ఈ విషయమై ఈ వర్గానికి చెందిన కూలీలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. శుక్రవారం ఉదయం పనులకు వచ్చిన కూలీలను సైతం మూడు కిలోమీటర్ల దూరం పనులకు కాలి నడకన తీసుకెళ్లడంతో ఆగ్రహించిన కూలీలు ఆరణి–వందవాసి రోడ్డులో రాస్తారోకో నిర్వహించి కూలీల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలిసి బెర్నమల్లూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కూలీలతో చర్చలు జరిపి రాస్తారోకోను విరమింపజేశారు.

విద్యా సహాయకాల పంపిణీ



సహాయకాలు అందజేస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: జీకేఎం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు సంక్షేమ సహాయకాలతో పాటు పేద విద్యార్థులకు విద్యా ఉపకార వేతనాలను వితరణ చేశారు. చెన్నై మైలాపూర్‌లోని రాధాకృష్ణన్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా తమాకా పార్టీ ప్రధాన కార్యాలయం కార్యదర్శి జీఆర్ వెంకటేష్, లయన్స్ క్లబ్ జిల్లా నిర్వాహకులు పాల్గొని సహాయకాలు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా 2023–2024 సంవత్సరానికిగాను జీకేఎం లయన్స్ క్లబ్ నూతన నిర్వాహకుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో క్లబ్ నూతన అధ్యక్షుడు డి.రఘు, ప్రధాన కార్యదర్శి రాజం ఎంబీ నాథన్, కోశాధికారి సుగంరాజ్, జిల్లా నిర్వాహకులు ఎస్.ఆర్.డి. ప్రేంకుమార్, ప్రతిమ బలరాం, సరళ, రాజు, మోహన, పళనియప్పన్, శరవణన్, సహాయరాజ్, తండలం రవి, నటుడు బాబు గణేష్ పాల్గొని ఈ ఏడాది చేపట్టనున్న పలు సంక్షేమ సేవా ప్రాజెక్టుల గురించి చర్చించారు.

రేలాలో అరుదైన శస్త్రచికిత్స



మీడియాతో మాట్లాడుతున్న వైద్యులు

సాక్షి, చెన్నై: తల వెనుక భాగంలోకి రెండు అంగుళాల చీల దూసుకెళ్లడంతో గాయపడ్డ ఉత్తరాది యువకుడికి రేలా వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సతో పునర్జన్మను ఇచ్చారు. శుక్రవారం జరిగిన సమావేశంలో రేలా ఆస్పత్రి న్యూరో సర్జరీ వైద్యుడు డాక్టర్ ఎం అన్బుసెల్వం ఈ చికిత్సను మీడియాకు వివరించారు. ఉత్తరాదికి చెందిన శ్రీబ్రహ్మ అనే యువకుడు చెన్నై శివారులోని నావలూర్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం విధుల్లో తల వెనుక భాగం నుంచి మెడ వరకు తీవ్ర నొప్పి రావడం, రక్త స్రావం జరగడంతో ఆందోళనకు లోనయ్యాడు. అక్కడున్న సిబ్బంది సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అతను పని చేసే చోట పనులు చేస్తుండగా నెయిల్ గన్ నుంచి చీల ప్రమాదవశాత్తు దూసుకొచ్చి అతడి తలను తాకినట్టు తేలింది. చివరకు రేలా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అత్యాధునిక పద్ధతులను ఉపయోగించి శస్త్రచికిత్సను విజయవంతం చేశామని అన్బుసెల్వం వివరించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నాడని, విధులకు కూడా వెళ్తున్నట్టు పేర్కొన్నారు.

మావీరన్‌ను చూసిన సంగీత



మా వీరన్‌లో శివకార్తికేయన్ ఇన్‌సెట్‌లో సంగీత

తమిళసినిమా: మావీరన్ చిత్రానికి ఇప్పుడు కొత్తగా పబ్లిసిటీ వచ్చేసింది. నటుడు శివకార్తికేయన్, అదితి శంకర్ జంటగా నటించిన చిత్రం మావీరన్. మడోన్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నటి సరిత ముఖ్యపాత్రను పోషించడం విశేషం. చాలా గ్యాప్ తర్వాత ఈమె ఇందులో తల్లి పాత్రలో నటించారు , దర్శకుడు మిష్కిన్, టాలీవుడ్ నటుడు సునీల్ ప్రతినాయకులుగా నటించిన ఈ చిత్రాన్ని అరుణ్ విశ్వ భారీ ఎత్తున నిర్మించారు. మా వీరన్ శుక్రవారం తెరపైకి వచ్చింది. దీన్ని ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ విడుదల చేసింది. మా వీరన్ చిత్రాన్ని తొలి రోజు తొలి ఆటను చూడడానికి నటుడు విజయ్ సతీమణి సంగీత థియేటర్‌కు రావడం విశేషం. ఇటీవల విజయ్, సంగీత దంపతుల గురించి రకరకాల వదంతులు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సంగీత విజయ్ నిర్వహించిన ఏ కార్యక్రమానికి హాజరుకాలేదు. విజయ్ విద్యార్థులకు ప్రోత్సాహకాల అందించిన కార్యక్రమంలో కూడా సంగీత పాల్గొనలేదు. కారణం ఆమె తన బిడ్డల సంరక్షణ బాధ్యతలను కోసం విదేశాల్లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అలాంటిది శుక్రవారం సంగీత ముఖానికి ముసుగేసుకుని శివకార్తికేయన్ నటించిన మావీరన్ చిత్రాన్ని చూడ్డానికి చెన్నైలోని ఒక థియేటర్‌కు రావడం వార్తగా మారింది. ఆ చిత్రానికి అదనపు ప్రచారాన్ని తీసుకొచ్చిందని చెప్పాలి. ఇక పోతే విజయ్ అభిమానులు ఆనంద పడిపోతున్నారు. కారణం ఇటీవల విజయ్ నిర్వహించిన ఏ కార్యక్రమానికి సంగీత హాజరు కాకపోవడంతో పలు రకాల వదంతులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడమే. కాగా విజయ్ తాజాగా నటిస్తున్న లియో చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం త్వరలో జరగనుంది. ఈ వేడుకల్లో సంగీత కచ్చితంగా పాల్గొంటారనే విశ్వాసాన్ని అభిమానులు వ్యక్తం చేస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

భరత్ 50వ చిత్రం లవ్



హీరోను సత్కరిస్తున్న లవ్ యూనిట్

తమిళసినిమా: తమిళంలో బాయ్స్, కాదల్ చిత్రాలతో కథానాయకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు భరత్. ఆ తర్వాత పలు భాషల్లో అనేక చిత్రాల్లో నటించి ఇప్పుడు అర్ధ సెంచరీ చిత్రం మైలురాయికి చేరుకున్నారు. ఈయన కథానాయకుడిగా నటించిన 50వ చిత్రం లవ్. నటి వాణిభోజనం నాయికగా నటించిన ఈ చిత్రాన్ని ఆర్పీ బాల స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. నటుడు వివేక్ ప్రసన్న రాధారవి జూనియర్ ముఖ్యపాత్ర పోషించిన ఈ చిత్రానికి పీజీ ముత్తయ్య ఛాయాగ్రహణం, లోనిరఫ్పేల్ సంగీతాన్ని అందించారు. ఈ చిత్రం ఈనెల 28న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం చిత్ర ఆడియో విడుదల కార్యక్రమాన్ని స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇది ప్రేమించి పెళ్లి చేసుకున్న ఒక జంట నేపథ్యంలో సాగే విభిన్న ప్రేమ కథా చిత్రం అని దర్శకుడు తెలిపారు. పెళ్లయిన జంట మధ్య ప్రేమ, సంతోషం, కోపం చిన్నచిన్న గొడవలు చివరికి ఎలాంటి పరిణామాలకు దారి తీశాయి అన్నదే ఈ చిత్ర కథ అని తెలిపారు. ఒక సంఘటనలో పొరపాటున భరత్ కారణంగా అతని భార్య హత్యకు గురవుతుందన్నారు. దానిని మార్చడానికి భరత్ తన స్నేహితులతో కలిసి ఏం చేశాడు అన్న పలు ఆసక్తికరమైన అంశాలతో చిత్రం సాగుతుందని చెప్పారు. ఈ చిత్రం తనుకు చాలా ముఖ్యమైనదని నటుడు భరత్ పేర్కొన్నారు. కాగా మిరల్ చిత్రం తర్వాత భరత్‌తో కలిసి లవ్ చిత్రంలో నటించడం సంతోషంగా ఉందని వాణిభోజన్ అన్నారు. ఇది మళయాళంలో మంచి విజయాన్ని సాధించిన లవ్ చిత్రాన్ని అదే పేరుతో తమిళంలో రీమేక్ చేశారన్నది గమనార్హం.

పడి లేచిన కెరటం కీర్తి



కీర్తిసురేష్

తమిళసినిమా: ప్రతి మనిషికి జీవితంలో ఎత్తుపల్లాలు సహజమే. ఇక్కడ ఏదీ నిరంతరం కాదు జయాపజయాలు అంతే. అదేవిధంగా విజయాలకు పొంగిపోవడం, అపజయాలకు కుంగిపోవడం సహజమే. ఇక నటి కీర్తిసురేష్ విషయానికొస్తే చాలా తక్కువ సమయంలోనే తానేమిటోనిరూపించుకున్నారు. అదేసమయంలో పలు ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. సీనియర్ నటి మేనక నిర్మాత సురేష్ వారసురాలిగా సినీ రంగప్రవేశం చేసిన కీర్తిసురేష్ తమిళంలో ఇదు ఎన్న మాయం అనే చిత్రం ద్వారా ఎంట్రీ ఇచ్చారు. ఏఎల్ విజయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నిరాశపరిచినా నటిగా కీర్తిసురేష్ మాత్రం మంచి మార్కులే తెచ్చుకున్నారు. ఆ తర్వాత రజిని మురుగన్ చిత్రాలతో విజయాలను అందుకున్న ఈమె తెలుగులో మహానటి చిత్రంతో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. అదేవిధంగా ఆరంభ దశలోనే లేడీ ఓరియెంటెడ్ కథా చిత్రాల నాయకిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అలాంటి పీక్ సమయంలో మరింత స్లిమ్‌గా తయారవడానికి కసరత్తులు చేశారు. ఫలితంగా చాలా దారుణమైన విమర్శలకు గురయ్యారు. కీర్తిసురేష్ ముఖంలో గతంలో ఉన్న గ్లామర్ పోయిందని, ఇక ఈమె చాప్టర్ క్లోజ్ అని దారుణమైన కామెంట్స్‌ను ఎదుర్కొన్నారు. అయితే అలాంటి సమయంలోనూ అదేముఖంతో తమిళంలో సాని కాగితం అనే చిత్రంలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. అయితే తెలుగులో ఆ సమయంలో ఆమె నటించిన కొన్ని చిత్రాలు ఆశించిన రీతిలో ఆడలేదన్నది వాస్తవం. ఆ తర్వాత మళ్లీ సరికొత్త అందాలను సంతరించుకున్న కీర్తిసురేష్ ఇప్పుడు వరుసగా సక్సెస్‌లను అందుకుంటున్నారు. ఆ మధ్య తెలుగులో నాని సరసన నటించిన దసరా మంచి విజయాన్ని సాధించగా, తాజాగా తమిళంలో ఉదయనిధి స్టాలిన్‌తో జత కట్టిన మామన్నన్ ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఇక త్వరలో తెలుగులో చిరంజీవికి చెల్లెలిగా నటించిన బోళాశంకర్ ఆగస్టు 11వ తేదీ రావడానికి ముస్తాబవుతోంది. తమిళంలో జయంరవితో సైరన్, హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రం రఘుతాత చిత్రాలు చేతిలో ఉన్నాయి.

విజయ్ వారసుడికి జంటగా దేవయాని వారసురాలు?

తమిళసినిమా: సినిమా రంగంలో వారసుల తెరంగేట్రం సర్వసాధారణం. ఇప్పటికే చాలామంది వారసులు వివిధ శాఖల్లో రాణిస్తున్నారు. తాజాగా ఒక కొత్త కాంబినేషన్‌కు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. నటుడు విజయ్ తన తండ్రి దర్శకుడు ఎస్ఏ. చంద్రశేఖర్ ద్వారా కథానాయకుడుగా పరిచయమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన కథానాయకుడిగా శిఖరాగ్రానికి చేరుకున్నారు. అదేవిధంగా నటి దేవయాని. ఈమె బహుభాషా నటి. తొట్టాల్ సీణుంగి చిత్రం ద్వారా తమిళంలో కథానాయకగా పరిచయమైన దేవయాని ఆ తర్వాత కాదల్ కోట్టై వంటి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. నీ వరివాయ్ ఎస్ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన రాజకుమార్. ఆ చిత్రంలో అజిత్, దేవయాని హీరో హీరోయిన్లుగా నటించారు. ఆ చిత్ర షూటింగ్ సమయంలోనే దర్శకుడు రాజకుమార్‌కు, నటి దేవయానికి మధ్య పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. కాగా వీరికి ఇద్దరు కుమారైలు. అందులో పెద్ద కుమార్తె ఇనియ కుమార్‌ను కథానాయకిగా పరిచయం చేయడానికి తన హాజరుతున్నాయి. రాజకుమార్ దర్శకత్వం వహించిన నీ వరువాయ్ ఎన చిత్రం 1999లో విడుదలైంది. ఇప్పుడు దానికి సీక్వెల్ చేయడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఇందులో విజయ్ కుమారుడు సంజయ్, తన కూతురు ఇనియకుమార్‌తోను, హీరోహీరోయిన్లుగా నటింపజేయడానికి ప్రయత్నిస్తున్నట్లు రాజకుమార్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తన కూతురు ఇనియాకు నటించాలని కోరిక ఉందని దీంతో సంజయ్‌కు జంటగా ఆమెను నటింపజేయాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు అయితే విజయ్ వారసుడు సంజయ్ తెరవెనుక బాధ్యతలు చేపట్టడానికి ఇష్టపడుతున్నట్లు సమాచారం. ఆయన కథానాయకుడిగా నటిస్తారా వేచి చూడాల్సిందే.



ఇనియ, సంజయ్

రైతుల వెతలు చెప్పే చిత్రం



వ్యవసాయి ఎనుమ్ నాన్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: సమస్త ప్రాణులకు జీవనాధారమైన నీరు, అడవులు, కొండలు అనేవి ప్రకృతి వరప్రసాదాలు. అలాంటిది ఇప్పుడు అడవుల ఆక్రమణ, నదులు దురాక్రమణ కాలానికి వచ్చాం. ఈ అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని తెరకెక్కించిన చిత్రం వ్యవసాయి ఎనుమ్ నాన్ అని ఆ చిత్ర దర్శక, నిర్మాత పి.పచ్చముత్తు తెలిపారు. పి కే ఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈయన నిర్మిస్తున్న చిత్రంలో నవ నటులు పూవరసన్, పుహళేంది కథానాయకులుగా పరిచయం అవుతున్నారు. నటి అక్షిత, భువన నాయకిలుగా నటిస్తున్న ఇందులో సరవణన్, వేల రామ్మూర్తి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మహేంద్రన్ ఛాయాగ్రహణం, నరేష్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్ర వివరాలను దర్శక, నిర్మాత పచ్చముత్తు తెలుపుతూ ఇది రైతుల కష్టాలను ఆవిష్కరించే కథా చిత్రంగా ఉంటుందన్నారు. ఇంతవరకు ఎవరూ చెప్పని కొత్తకోణంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు చెప్పారు. పరుత్తివీరన్ చిత్రం తరువాత నటుడు శరవణన్ ఇందులో విభిన్నమైన పాత్రల్లో నటించారు. వేల రామ్మూర్తి పాత్రకు కూడ అంతే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. చిత్ర షూటింగ్‌ను సేలం, ఆత్తూర్ ప్రాంతాల్లో నిర్వహించి పూర్తిచేసినట్లు తెలిపారు. ఈచిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుత్తణి: తిరుత్తణి పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మాసాంతర మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజినల్ ఇంజినీర్ పారిరాజ్ తెలిపారు. తిరుత్తణి టౌన్, అగూరు, పొన్పాడి, మద్దూరు, మురుకంబట్టు, పెరియకడంబూరు, కార్తికేయపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 10 మేకలు మృతి

అన్నానగర్: వాడిపట్టి సమీపంలో గురువారం రాత్రి కుక్కల దాడిలో పది మేకలు మృతిచెందాయి. మదురై వాడిపట్టి సమీపంలోని కొత్తమేడు ప్రాంతానికి చెందిన చంద్రన్ (45). ఇతని కుమార్తె ప్రియదర్శిని. ఈమె 14వ వార్డు వాడిపట్టి మున్సిపల్ ఏడీఎంకే కౌన్సిలర్. ఇంటి వెనకాల దొడ్డి నిర్మించి పది మేకలు పెంచుతోంది. ఈ స్థితిలో గురువారం రాత్రి మేకలకు మేత వేసి నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు లేచి చూసేసరికి దొడ్డిలో కుక్కల దాడిలో పది మేకలు చనిపోయినట్లు గుర్తించారు.

దాడి కేసులో ఏడుగురు అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై కొత్త చాకలి పేటలో యువకుడుపై కత్తితో దాడి చేసిన ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై కొత్త చాకలిపేటకు చెందిన తమిలరసన్ (26) గత 8వ తేదీ వ.వు.సి నగర్‌కు వచ్చిన సమయంలో ఏడుగురు అతన్ని చుట్టుముట్టి కత్తులతో దాడి చేశారు. గాయపడిన తమిలరసన్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించి పోలీసులు కిషోర్ కుమార్, లోకేష్, రాజ్‌కుమార్, భూపాలన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. జీవన్ కుమార్ హత్య కేసులో తమిళరసన్‌కు సంబంధం ఉన్నట్లు తెలిసింది. దీంతో అతనిపై కక్షతో జీవన్‌కుమార్ అన్న కిషోర్‌కుమార్ తన సహచరులతో కలిసి తమిలరసన్‌ను హత్య చేయడానికి ప్రయత్నించినట్లు విచారణలో తెలిసింది.

ఏసీబీ దాడులు

తిరువొత్తియూరు: నాగర్‌కోయిల్ సమీపంలో ఉన్న సుంగాన్‌కడై ప్రాంతానికి చెందిన లత. ఈమె ఆలూరు పట్టణ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు కొనుగోలు చేసినట్టు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు దీనికి సంబంధించి ఏసీబీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏసీబీ పోలీసులు శుక్రవారం ఉదయం 6 గంటలకు ఉన్న లత ఇంటికి వెళ్లి విచారణ చేశారు. విచారణ మధ్యాహ్నం వరకు కొనసాగింది. లత ప్రస్తుతం ఆలూరు అన్నాడీఎంకే కార్యదర్శిగా ఉన్నారని, ప్రస్తుతం వ్యవసా శాఖ సహకార సంఘ అధ్యక్షురాలుగానూ ఆమె ఉన్నారు.

బస్సులో నుంచి పడి విద్యార్థి దుర్మరణం

తిరువొత్తియూరు: చెన్నై తండయార్ పేటలో ప్రభుత్వ బస్సు ఎక్కుతున్న విద్యార్థి అదుపుతప్పి కింద పడి మృతిచెందాడు. చెన్నై, పులియంతోపు ప్రాంతానికి చెందిన సూర్య (19) చెన్నై కోయంబేడు ప్రాంతంలో ఉన్న ప్రైవేటు కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లడానికి కోయంబేడు వద్ద డీఎండీకే కార్యాలయం ఎదురుగా ఉన్న బస్ స్టాపింగ్‌లో సూర్య నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో వచ్చిన చెన్నై మింట్ వెళ్లే ప్రభుత్వ బస్సులో ఎక్కడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో కాలుజారి కింద పడ్డాడు. దీంతో బస్సు వెనక చక్రం అతనిపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి గంటల సూర్య మృతిచెందాడు. కాంచీపురానికి చెందిన బస్ డ్రైవర్ వెంకటేశులు (57)ను పోలీసులు అరెస్ట్ చేశారు.

బస్సు ఢీకొని తాత, మనవరాలు మృతి

అన్నానగర్: పెరియనాయకన్ పాళయం సమీపంలో శుక్రవారం బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో తాత, మనవరాలు మృతి చెందారు. కోయంబత్తూరు జిల్లా పెరియనాయకన్ పాళయం పక్కన ఉన్న వీరపాండి రైల్వేస్టేషన్ రోడ్ నెం.4కి చెందిన లోకనాథన్. ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్. ఇతనికి ఇద్దరు కుమార్తెలు అభినయ (17), హేమవర్షిణి (14) ఉన్నారు. వీరిద్దరూ ప్రెస్ కాలనీ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్లస్-1, 9వ తరగతి చదువుతున్నారు. వీరిని తాత రామసామి(75) ఉదయం పాఠశాలకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేవాడు. ఈ స్థితిలో రామస్వామి గురువారం సాయంత్రం 5 గంటలకు బైక్‌లో పాఠశాలకు వెళ్లి ఇద్దరు మనరాళ్లను ఎక్కించుకుని కోవై-మేట్టుపాళయం రోడ్డు సమీపంలోకి వచ్చాడు. అప్పుడు ప్రభుత్వ బస్సు బైక్‌ను ఢీకొంది. ఇందులో హేమవర్షిణి, రామస్వామి మృతి చెందారు. అభినయ తీవ్రగాయాలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పెరియనాయకన్ పాళయం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాబిలితో చెప్పనా!

నిప్పులు చిమ్ముతూ.. మబ్బులు చీల్చుకుంటూ.. జాబిల్లి వైపు దూసుకెళ్లిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంతో స్థానికులు సంబరాల్లో మునిగితేలారు. ఈలలేస్తూ చప్పట్లతో సాగనంపారు. జెండాలూపుతూ విజయగర్వంతో ఊగిపోయారు. నింగిలో కనిపిస్తున్నంత సేపు మున్వేళ్లపై నిలబడి తీక్షణంగా చూస్తూ నిలబడిపోయారు. కొందరు బైనాకూలర్లతో చూసి ఆనంద సాగరంలో మునిగితేలారు. మరికొందరు తమ సెల్ ఫోన్లలో బంధించి మురిసిపోయారు. నెలరాజుపై సాఫీగా దిగి..నిఘూడరహస్యాలు ఛేదించాలని ఆకాంక్షించారు.



- చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం
- భూకక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
- ఉత్కంఠగా ఎదురు చూసిన స్థానికులు
- ప్రేక్షకులతో నిండి పోయిన గ్యాలరీలు
- శాస్త్రవేత్తలకు వెల్లువెత్తిన అభినందనలు



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయం సాధించాలంటే ఆగస్టు 23 దాకా వేచి చూడాల్సి ఉన్నప్పటికీ ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 3,920 కిలోల బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టి మొదటి దశ విజయాన్ని అందుకున్నారు.



షార్ కేంద్రం వద్ద భద్రత



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న జనం

మూడు దశల రాకెట్ ప్రయాణం ఇలా..

ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ 43.43 పొడవు కలిగి 640 టన్నుల బరువుతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి నింగిలోకి నిప్పులు చిమ్ముకుండా మూడు దశలను ఛేదిస్తూ విజయవంతంగా దూసుకెళ్లింది. చంద్రయాన్-3 ఉపగ్రహంలో 2,145 కిలోల బరువు కలిగిన ప్రపొల్షన్ మాడ్యూల్, 1,749 కిలోల బరువు కలిగిన ల్యాండర్, 26 కిలోల బరువు కలిగిన రోవర్‌లను చందమామపై పరిశోధనలకు విజయవంతంగా పంపించారు. ఇందులో ఆరు ఇండియన్ పేలోడ్స్‌తో పాటు అమెరికా నాసాకు చెందిన ఒక పేలోడ్‌ను పంపించారు.

- మొదటి దశలో ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్-200 బూస్టర్లు సాయంతో నింగికి పయనమై రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనం సాయంతో 127 సెకండ్లలో మొదటి దశ పూర్తి చేశారు.
- రెండో దశలో ఎల్-110 అంటే 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 305.56 సెకండ్లకు రెండో దశను పూర్తి చేశారు.
- ఈ మధ్యలో 194.96 సెకండ్లకు రాకెట్ శిఖర భాగాన చంద్రయాన్-3 మిషన్‌కు రెండువైపులా అమర్చిన హీట్‌షీల్డ్స్ విడిపోయాయి.

ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ అభినందనలు

తడ: శ్రీహరికోట నుంచి శుక్రవారం లాంచ్ వెహికల్ మార్క్- 3 ద్వారా చంద్రయాన్-3ని విజయవంతంగా భూ కక్ష్యలో ప్రవేశ పెట్టిన ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. భారత ఖ్యాతిని ప్రపంచానికి వ్యాప్తి చేసిన ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు.

చప్పట్లతో మార్మోగిన గ్యాలరీలు

సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగించిన ఎల్‌వీఎం3-ఎం4 ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు పది వేల మందిదాకా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్‌లు, బస్సులు బారులు తీరాయి. అయితే షార్ కేంద్రం వారు మాత్రం ప్రతి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలోనే ఒక ప్రత్యేక గాలరీని ఏర్పాటు చేశారు. జమ్ము కశ్మీర్ నుంచి కూడా వీక్షకులు తరలివచ్చారు. రాకెట్ ప్రయోగాన్ని వీక్షించాలనుకునే వారితో పులికాట్ సరస్సులోని రోడ్డు కిక్కిరిసింది. రాకెట్ నింగికేగుతున్న సమయంలో వారంతా కొట్టిన చప్పట్లు, ఈలలు, కేకలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.





విశిష్ట సేవలకు గుర్తింపు



దంత వైద్యరంగంలో విశిష్ట సేవలను అందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించే విధంగా శుక్రవారం సవిత కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడాంటిక్స్ విభాగంలో జరిగింది. వినూత్న ఆలోచనలు, దంత సంరక్షణ కార్యక్రమాలలో రాణించిన, సేవలను అందించిన 25 మందిని ప్రోత్సహించే విధంగా టూత్ ఫ్రంట్ 2023 ఆవిష్కరణలకు బలాన్ని చేకూర్చే రీతిలో సత్కరించారు. - సాక్షి, చెన్నై

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



తిరుత్తణిలో ఆక్రమణ స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్

- ఫిర్యాదుతో రంగంలోకి తహసీల్దార్
- సర్వే చేసి స్వాధీనానికి చర్యలు

తిరుత్తణి: ప్రభుత్వ స్థలం ఆక్రమణకు సంబంధించి ఫిర్యాదుతో ఆర్డీఓ ఆదేశాలతో తిరుత్తణి తహసీల్దార్ శుక్రవారం రంగంలోకి దిగి తనిఖీ చేశారు. వెంటనే సర్వే చేసి ఆక్రమణకు గురైన స్థలం స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. తిరుత్తణి పట్టణం అరక్కోణం రోడ్డులోని జీజీ రవినగర్‌లో రూ.3కోట్ల విలువైన ఒకటిన్నర ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు ఆర్డీఓకు ఫిర్యాదులందాయి. ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్ మదన్, ఆర్ఐ కమల్, సర్వేయర్, వీర్వోల బృందం ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. సర్వేయర్ల బృందం సర్వే చేపట్టి రిపోర్టు ఆధారంగా ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు లొంగుబాటు

కొరుక్కుపేట: తిరుమంగళంలో మంత్రగాళ్ల వివాదంలో మాంత్రికుడు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో మదురై కోర్టులో ఇద్దరు వ్యక్తులు లొంగిపోగా, మరొకరిని అరెస్టు చేశారు. చెన్నైలోని తిరుమంగళం గాంధీనగర్ ప్రాంతంలోని ఓ ఇంటి నుంచి గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో దుర్వాసన వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల ప్రజలు తిరుమంగళం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా తలకు బలమైన గాయాలతో రక్తపు మడుగులో ఓ యువకుడు శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసు విచారణలో సయ్యద్ సికిందర్ (38) చెన్నైలోని పాత చాకలిపేట ప్రాంతానికి చెందినవారని, తిరుమంగళం గాంధీనగర్ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు తెలిసింది. అలాగే అదే ప్రాంతంలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్న బిల్లీ మాంత్రికుడు. పురుషోత్తమన్, విక్కీ , మరొక విక్కీ అతనితో ఉన్నారు. వారిద్దరి మధ్య వారం రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. వారి మధ్య గొడవల కారణంగానే సయ్యద్ సికిందర్ హత్య జరిగిందా అని పోలీసులు విచారణకు వచ్చారు. ఈ కేసులో విక్కీ, పురుషోత్తమన్ ఉదయం మదురై కోర్టులో లొంగిపోగా, మరో విక్కీని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ వసూలు

- రూ.లక్ష జరిమానా

తిరువళ్లూరు: కొనుగోలుదారుల నుంచి ఎంఆర్‌పీ ధర కంటే రూపాయి ఎక్కువగా వసూలు చేసిన వ్యవహారంలో నగరంలోని ప్రముఖ దుకాణానికి రూ.లక్ష జరిమానాను విధిస్తూ వినియోగదారుల ట్రిబ్యునల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తిరువళ్లూరు జిల్లా అండరసన్‌పేటకు చెందిన సతీష్. ఇతను పూందమల్లి కోర్టులో న్యాయవాది. ఇతను గత ఏడాది ఏప్రిల్‌లో తిరువళ్లూరులోని ది చెన్నై సిల్క్స్ దుకాణంలో బాటా చెప్పులు కొనుగోలు చేశాడు. వాస్తవానికి చెప్పులు ధర రూ.379. అయితే బిల్లులో రూ.380 వసూలు చేశారు. అయితే రూపాయి ఎక్కువగా వసూలు చేయడంపై ఉద్యోగులను నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో సతీష్ తిరువళ్లూరులోని వినియోగదారుల ట్రిబ్యునల్‌లో కేసు చేశారు. ఈ కేసు విచారణ ఏడాది పాటు సాగింది. విచారణ ముగిసిన నేపథ్యంలో ట్రిబ్యునల్ గ్రీవెన్స్ కమిషన్ అధ్యక్షురాలు లతామహేశ్వరి బాధితుడికి రూ.లక్ష పరిహారంగాను, కేసు నడిపినందుకు అయిన ఖర్చు కింద మరో ఐదు వేల రూపాయలతో కలిపి రూ.1.05 లక్షను చెల్లించాలని ఆదేశించారు.

కులాంతర వివాహం చేసుకున్న యువతిపై దాడి

- తల్లి అంత్యక్రియలకు వెళ్లిన సమయంలో ఘటన
- ఎస్పీని ఆశ్రయించిన యువతి



ఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరైన బాధితులు

తిరువళ్లూరు: తల్లి అంత్యక్రియలకు హాజరైన తమపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు కులం పేరుతో తమను దూషించిన వారిని అరెస్టు చేయాలని కోరుతూ బాధితులు ఎస్పీ పకెర్లా సెఫాస్ కల్యాణ్‌కు వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కం గ్రామానికి చెందిన భానుప్రియ(29). ఈమె తండలం గ్రామానికి చెందిన దళిత యువకుడు అమల్‌రాజ్(33)ను తొమ్మిదేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకుంది. వీరికి ముగ్గురు పిల్లలు. కులాంతర వివాహం చేసుకున్న భానుప్రియను మొదట్లో తల్లిదండ్రులు వ్యతిరేకించినా గత నాలుగు సంవత్సరాల నుంచి తల్లిదండ్రులు భానుప్రియను చేరదీశారు. ఈ నేపథ్యంలో గత 12న భానుప్రియ తల్లి మృతి చెందింది. దీంతో భానుప్రియ తల్లి అంత్యక్రియలకు ఆరంబాక్కం వెళ్లింది. అయితే అప్పటికే అక్కడ ఉన్న దశరథరెడ్డి, వేలురెడ్డి సహా పది మంది భానుప్రియపై దాడికి దిగారు. కులాంతర వివాహం చేసుకుని తమ పరువు తీశారని దూషిస్తూ అంతిమ యాత్రలో పాల్గొనకుండా వెలివేశారు. ఈ సంఘటనపై భానుప్రియ ఆరంబాక్కం పోలీసులు, ఆర్డీఓకు పిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును ఎస్పీ పకెర్లా సెఫాస్‌కల్యాణ్‌కు బదిలీ చేసిన సీఎంఓ సిబ్బంది తక్షణం విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే బాధిత యువతి వద్ద శుక్రవారం ఉదయం విచారణ చేపట్టారు. తనపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని కోరింది. వీరి సమస్యలను విన్న ఎస్పీ న్యాయం చేస్తామనీ హామీ ఇవ్వడంతో పాటు రాతపూర్వకంగా మరో ఫిర్యాదును బాధితుల నుంచి స్వీకరించారు. పోలీసులు తమకు న్యాయం చేయని పక్షంలో ఆందోళన చేస్తామని ప్రకటించారు. కాగా కులాంతర వివాహం చేసుకుందన్న నెపంతో తల్లి అంత్యక్రియలకు సైతం కన్నకూతురిని అనుమతించకుండా కొందరు కులపెద్దలు దాడికి దిగిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

వీఏఓ మృతి

తిరువళ్లూరు: ద్విచక్ర వాహనంలో వెళుతున్న వీఏఓ స్పృహ తప్పి కింద పడి మృతి చెందిన సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలుకా పాపన్‌కుప్పం గ్రామానికి చెందిన పుల్లయ్య కుమారుడు జయచంద్రన్(56). ఇతను ఈగువారిపాళ్యం గ్రామ నిర్వాహక అధికారిగా పనిచేస్తున్నాడు. కాగా ఈగువారి పాళ్యంలో విధులు ముగించుకుని గురువారం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రామచంద్రపురం వద్ద వెళుతుండగా హఠాత్తుగా స్పృహతప్పి కిందపడ్డాడు. విషయాన్ని గుర్తించిన వీఏఓ అసిస్టెంట్ మణిగండన్ జయచంద్రన్‌ను ఈగువారి పాళ్యంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే జయంద్రన్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

అన్నానగర్: ఇరానియల్ సమీపంలో ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. శుక్రవారం తాళం వేసి ఉన్న ఇంట్లో కుళ్లిపోయిన మృతదేహాలను వెలికితీశారు. కన్యాకుమారి జిల్లా ఇరానియల్ సమీపం తాండవిలై ప్రాంతానికి చెందిన బాబు (46) చిత్రకారుడు. అద్దె ఇంట్లో ఉంటూ తన ఇద్దరు చెల్లెళ్లతో కలిసి అక్కడే ఉంటున్నాడు. అక్క శ్రీదేవి (44), చెల్లెలు ఉషా పార్వతి (38). ముగ్గురికీ పెళ్లి కాలేదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగుకు అనుమానం వచ్చి ఇరానియన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లేసరికి అక్కడ హాలులో బాబు ఉరివేసుకుని, కింద నేలపై ఉషా పార్వతి శవమై పడి ఉంది. శ్రీదేవి వంటగదిలో ఉరి వేసుకుని ఉంది. ఈ ముగ్గురి మృతదేహాలు కుళ్లిపోయి ఉన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రయాన్-3 ప్రయోగంలో మహిళా శక్తి



చంద్రయాన్-3 ప్రయోగంలో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో మహిళా శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా శుక్రవారం మధ్యాహ్నం ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రాజెక్టులో 30 శాతం మంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేసినట్టు తెలుస్తోంది. అంతరిక్ష శాస్త్ర విజ్ఞాన రంగం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తామేమీ తక్కువ కాదన్నట్టుగా చంద్రయాన్-2 ప్రయోగంలో పనిచేసిన 30 శాతం మంది మహిళలు, చంద్రయాన్-3లో కూడా పనిచేశారు. త్రీ-ఇన్-ఒన్‌గా చెప్పబడుతున్న చంద్రయాన్-3 ప్రాజెక్టులో ప్రపొల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్లు రూపొందించడంలో మహిళా శాస్త్రవేత్తల కృషి కూడా ఉంది. అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, బెంగళూరులోని ప్రొఫెసర్ యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో పురుష శాస్త్రవేత్తలకన్నా తామేమీ తక్కువ కాదన్నట్టుగా పనిచేసి ల్యాండర్, రోవర్‌ను రూపొందించడంలో మహిళా శాస్త్రవేత్తలు భాగస్వామ్యం కూడా కలిసింది. ఇస్రోలో 30 మంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేస్తుండగా ఈ ప్రయోగంలో రీతూ కరిథల్, ఎం.వనిత అత్యంత కీలక వ్యక్తులుగా పనిచేశారు. బాలు శ్రీ దేశాయ్, డాక్టర్ సీత, కే కల్పన, టెస్సీ థామస్, డాక్టర్ నేహ సటక్ తదితర మహిళా శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములై మహిళాశక్తిని నిరూపించారు.

రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా రీతూ కరిథల్

చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా వ్యవహరించిన రీతూ కరిథల్ ‛‛రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా’’గా ఇస్రోలో అందరూ పిలుస్తున్నారు. మార్స్ అర్బిటర్ మిషన్ ప్రయోగంలో కూడా ఆమె డిప్యూటీ ఆపరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈమె 2007లో మాజీ రాష్ట్రపతి, అణు పరీక్షల నిపుణులు దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చేతులు మీదగా ఇస్రో యంగ్ సైంటిస్ట్ అవార్డు కూడా అందుకున్నారు. చంద్రయాన్-2 మిషన్‌లో అత్యంత కీలకమైన మహిళా శాస్త్రవేత్తగా అందరి మన్ననలను పొందారు. ఆమె చంద్రయాన్-3 ప్రాజెక్టులో కూడా పనిచేశారు. చంద్రయాన్-2 ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా పనిచేసిన ఎం.వనిత ఉపగ్రహాలు తయారు చేయడంలో దిట్ట. ఆమె డిజైన్ ఇంజినీర్‌గా శిక్షణ తీసుకుని చంద్రయాన్-2 అత్యంత కీలకమైన శాస్త్రవేత్తగా ఎంతో గుర్తింపు పొందారు. ‘‘ఆస్ట్రనామికల్ సొసైటీ ఆఫ్ ఇండియా’’ నుంచి 2006లో బెస్ట్ ఉమెన్ సైంటిస్టు అవార్డును అందుకున్నారు. చంద్రయాన్-3 ప్రాజెక్టులోనూ ఆమె కీలక పాత్ర పోషించారు.

క్లుప్తంగా...

25న విజయవాడలో డాక్ అదాలత్

సాక్షి, అమరావతి: తపాల సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర సమస్యలను పరిష్కరించడం కోసం ఈనెల 25న విజయవాడలో డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ అభినవ్ వాలియా ప్రకటించారు. విజయవాడ సర్కిల్ ఆఫీసులో జూలై 25న ఉదయం 11 గంటలకు జరిగే డాక్ అదాలత్‌కు నేరుగా హాజరు కావాల్సిందిగా కోరారు. రాష్ట్రంలోని ఇతరప్రాంతాల నుంచి ఫిర్యాదు చేయాలనుకునే వారు జూలై 21లోగా అందే విధంగా కే సుధీర్ బాబు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ-520013 చిరునామాకు పంపాల్సిందిగా కోరారు. పోస్ట్ కవర్‌పై పెద్ద అక్షరాలతో 'డాక్ అదాలత్' అని రాయాలని ఫిర్యాదును పరిశీలించిన తర్వాత పరిష్కారానికి సంబంధించిన వివరాలను లేఖ ద్వారా కానీ ఈ-మెయిల్ ద్వారా కానీ తెలిపారు.

బహుజన రాజ్యాధికారం జగనన్నతోనే సాధ్యం

- 1,020వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బహుజన నేతలు

తాడికొండ: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న బహుజన రాజ్యాధికారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 1,020వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలైన బహుజనులు దశాబ్దాలుగా అసైన్డ్, లంక భూములపై రిజిస్ట్రేషన్ హక్కుల కోసం వేయి కళ్లతో ఎదురుచూపు చూస్తున్నారని.. ఇందుకు అనుకూలంగా సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకోవడంతో నేడు రాష్ట్రంలో పేదల ఇంట పండుగ వాతావరణం నెలకొందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి బహుజన పరిరక్షణ సమితి నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పెరికే వరప్రసాద్, పులి దాసు, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

180 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు నిలిపివేత

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 180 ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2023-24 నుంచి 2025-26 వరకు ప్రవేశాలను నిలిపివేస్తూ ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 30 ప్రైవేటు అన్-ఎయిడెడ్, ఎయిడెడ్ కళాశాలలు బోధన రుసుముల నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వానికి ఎటువంటి పత్రాలు సమర్పించలేదు. మరో 150 కళాశాలల్లో గతేడాది కేటాయించిన సీట్లలో కేవలం 25 శాతంలోపు ప్రవేశాలు ఉండటం, ఆయా కళాశాలలు ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించే పరిస్థితుల్లో లేకపోవడంతో ప్రవేశాలను నిలిపివేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆస్టర్ గ్రూప్‌తో రమేష్ హాస్పిటల్స్ ఒప్పందం



సాక్షి, అమరావతి: ఏపీకి చెందిన రమేష్ హాస్పిటల్స్‌తో గల్ఫ్ దేశాలకు చెందిన ఆస్టర్ హాస్పిటల్స్ చేతులు కలిపింది. ఇక నుంచి ఏపీలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ పేరుతో అత్యాధునిక వైద్య సేవలను అందించనున్నట్లు శుక్రవారం విజయవాడలో ఇరు గ్రూపులు సంయుక్తంగా ప్రకటించాయి. యూఏఈ, దుబాయ్ దేశాల్లో 32 కు పైగా హాస్పిటల్స్, 127 క్లినిక్‌లు, 521 ఫార్మసీలు, 205 ల్యాబ్‌లు 30,000కు పైగా ఉద్యోగులతో ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ సర్వీసులను ఆస్టర్ అందిస్తోంది. రాష్ట్రంలో వైద్య సేవలు వేగంగా విస్తరిస్తుండటంతో రమేష్ హాస్పిటల్స్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు ఆస్టర్ హెల్త్ కేర్ వ్యవస్థాపక చైర్మన్, ఎండీ డాక్టర్ ఆజాద్ మూపెన్ తెలిపారు. ఆధునిక వైద్య సేవలకు ఇతర రాష్ట్రాలకు,దేశాలకు వెళ్లే అవసరం లేకుండా ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు, అంకాలజీ వైద్య విభాగంలో టెర్షరీ మరియు క్వార్టర్నరీ శ్రేణి వైద్య సంరక్షణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఆస్టర్ భాగస్వామ్యంతో రమేష్ హాస్పిటల్స్ ఒక బహుళజాతి సంస్థగా రూపాంతరం చెందిందని రమేష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్ చెప్పారు. ఈ భాగస్వామ్యంతో నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ఐరాసలో 'మన బడి'

ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణలకు అంతర్జాతీయంగా ప్రశంసలు

- న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో 'నాడు-నేడు' స్టాల్
- బాలికా విద్య, పాఠశాలల్లో వసతులు, డిజిటల్ బోధనకు అభినందనలు
- ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ఐరాస, ప్రపంచ బ్యాంకు సదస్సుల్లో మాట్లాడే అవకాశం
- సెప్టెంబర్‌లో 10 మంది ఏపీ విద్యార్థులకు అమెరికా వెళ్లే అవకాశం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణలు, మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విద్యార్థులకు ట్యాబ్‌లు, జగనన్న విద్యాకానుక ద్వారా బ్యాగులు, పుస్తకాలు, డిక్షనరీ, బెల్టు, బూట్లుతోపాటు గోరుముద్ద ద్వారా పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ లాంటివి ఐక్యరాజ్య సమితిలో ప్రత్యేకంగా చర్చకు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో సుస్థిర అభివృద్ధికి సంబంధించి ఉన్నత స్థాయి రాజకీయ సదస్సు (హై లెవెల్ పొలిటికల్ ఫోరం) న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో ఈనెల 10 తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. ఐరాసలో అంతర్భాగమైన ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సుకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, సంస్కరణలపై ఇందులో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలు, విద్యా ప్రమాణాలు, ప్రధానంగా బాలికా విద్యలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై నిర్వహించిన 'నాడు-నేడు' స్టాల్‌ను శుక్రవారం పలు దేశాల ప్రతినిధులు సందర్శించి కితాబిచ్చారు. ప్రధానంగా 44 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో నిరంతర నీటి సదుపాయంతో వాష్‌రూమ్‌లు, తాగునీరు, స్వేచ్ఛ పేరుతో శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీతో బాలికలు చేరికలు పెరగడం, ఇంగ్లిష్‌లో బోధన, బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్, విద్యా కానుక, ట్యాబ్‌ల పంపిణీ, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ విద్యా బోధన లాంటివి ప్రపంచ దేశాల ప్రతినిధులను ఆకర్షించాయి.

వేగంగా మెరుగైన ఫలితాలు..

ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ ఏపీలో విద్యా సంస్కరణల గురించి వివరించారు. సుస్థిర అభివృద్ధిలో విద్య పాత్ర కీలకమని బలంగా నమ్మిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్యలో లింగ వివక్ష, అసమానతలను తొలగించేందుకు చేపట్టిన నాడు-నేడు పథకం ద్వారా తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలను సాధించినట్లు చెప్పారు.

ఐరాస సదస్సుకు మన విద్యార్థులు

తక్కువ కాలంలోనే ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగంలో గణనీయమైన పురోగతి సాధించడంపై కెనడా స్కూళ్లు, కాలేజీల సోషల్ ఇన్నోవేషన్ ప్రాజెక్టు ముఖ్య అధికారి జూడీ ప్రశంసలు కురిపించారు. మన విద్యార్థులతో ముచ్చటించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఉన్నవ షకిన్ కుమార్ తెలిపారు. విద్యారంగంలో బాలికలు సాధించిన ప్రగతిని క్యాలిఫోర్నియా విద్యాశాఖ ప్రతినిధి షెరిల్ అభినందించారన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు జరిగే ఐరాస ప్రత్యేక సదస్సుకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 10 మంది విద్యార్థులను అమెరికా తీసుకెళ్లనున్నారు. ఐరాస ప్రతినిధులతో పాటు వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంకు సదస్సులో పలు దేశాల ప్రతినిధులను మన విద్యార్థులు కలుసుకుని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను స్వయంగా వివరించనున్నారు.

బాలిక విద్యకు ప్రశంసలు



కోవిడ్‌ను అధిగమించి విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతిపై సదస్సులో అంతర్జాతీయ ప్రతినిధులు చర్చించారు. ఏపీలో చేపట్టిన విద్యా సంస్కరణలు, చదువులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం చేపట్టిన పథకాల ద్వారా సాకారమైన మార్పులను ప్రశంసించారు. బాలిక విద్యకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, వారు సాధిస్తున్న విజయాలు అంతర్జాతీయ ప్రతినిధులను ఆకర్షించాయి. మన విద్యార్థులను కలసి స్వయంగా మాట్లాడేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెప్టెంబర్‌లో జరిగే సదస్సుకు రాష్ట్రం నుంచి 10 మంది విద్యార్థులను అమెరికా తీసుకెళ్లాలని నిర్ణయించాం.

– ఉన్నవ షకిన్ కుమార్, ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్

పాలమూరు-రంగారెడ్డి కొత్త ప్రాజెక్టే

- ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు చేసే అధికారం కొత్త ట్రిబ్యునల్‌దే
- దానికి తెలంగాణ 90 టీఎంసీలు కేటాయించింది
- ఆ జీవోను నిలిపివేయండి
- కేడబ్ల్యూడీటీ-2కు ఏపీ విజ్ఞప్తి
- ఈ జీవో ద్వారా ట్రిబ్యునల్ పరిధిలోకి చొరబడిందని వెల్లడి
- ఈ ప్రాజెక్టు పాతదేనని వాదించిన తెలంగాణ
- విచారణను సెప్టెంబరు 25కు వాయిదా వేసిన ట్రిబ్యునల్

సాక్షి, అమరావతి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కొత్త ప్రాజెక్టేనని, దానికి నీటి కేటాయింపులు చేసే అధికారం కొత్త ట్రిబ్యునల్‌కే ఉందని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2కు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ ప్రాజెక్టుకు 90 టీఎంసీలు కేటాయిస్తూ తెలంగాణ సర్కారు జీవో జారీ చేయడం ద్వారా ట్రిబ్యునల్ పరిధిలోకి చొరబడిందని, ఇది ప్రమాదకరమని పేర్కొంది. ఆ జీవోను నిలిపివేయాలని ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ ఎత్తిపోతల పాత ప్రాజెక్టేనని తెలంగాణ వాదించింది. ఈ ప్రాజెక్టుకు కృష్ణా బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం కోసం ప్రయత్నిస్తున్నామని, అందువల్ల నీటి కేటాయింపుల జీవో రద్దు కోరుతూ ఏపీ దాఖలు చేసిన ఇంటర్‌లొకేటరీ అప్లికేషన్ (ఐఏ)ను కొట్టేయాలని కోరింది. రెండు రాష్ట్రాల వాదనలు విన్న ట్రిబ్యునల్.. తదుపరి విచారణను సెప్టెంబరు 25కు వాయిదా వేసింది. సెప్టెంబరు 25 నుంచి 27 వరకూ విచారణ జరగనుంది. ఉమ్మడి రాష్ట్రానికి కేడబ్ల్యూడీటీ-2 కేటాయించిన జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పంపిణీ చేయడానికి జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా కేంద్రం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ బుధవారం విచారణ ప్రారంభించింది. బుధవారం, గురువారం తెలంగాణ, శుక్రవారం ఏపీ ప్రభుత్వం వాదనలు వినిపించాయి.

మిగులు జలాలను వాడుకోవడానికే..

తెలంగాణ తరఫున సీనియర్ కౌన్సిల్ సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. చిన్న నీటివనరుల విభాగంలో దశాబ్దాలుగా తాము ఏడాదికి సగటున 44 టీఎంసీలకు మించి వాడుకోలేదని, కానీ విభజన సమయంలో 89 టీఎంసీలు వాడుకుంటున్నామని ఏపీ చూపిందని ట్రిబ్యునల్‌కు వివరించారు. ఆ క్రమంలోనే ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు పంచి తెలంగాణకు అన్యాయం చేశారని పేర్కొంది. చిన్న నీటి వనరుల విభాగంలో మిగిలిన 45 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు ఏపీ మళ్లించిన 80 టీఎంసీల్లో తమకు దక్కే 45 టీఎంసీలు కలిపి 90 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు కేటాయించామన్నారు. పాలమూరు-రంగారెడ్డి బేసిన్ పరిధిలోని ప్రాజెక్టేనని, దానికి నీటి కేటాయింపులు న్యాయబద్ధమేనని చెప్పారు. దీనికి ట్రిబ్యునల్ ఛైర్మన్ బ్రిజేష్‌కుమార్ స్పందిస్తూ.. విభజన చట్టంలో సెక్షన్ 89 ప్రకారం కేటాయింపులు లేని ప్రాజెక్టులకు మాత్రమే నీటిని కేటాయించే అధికారం తమకు ఉందన్నారు. నీటిని పునఃపంపిణీ చేసే అధికారం తమకు లేదని స్పష్టం చేశారు. దీనిపై వైద్యనాథన్ స్పందిస్తూ.. అలాంటప్పుడు ఏపీ దాఖలు చేసిన ఐఏను విచారించే అధికారం ట్రిబ్యునల్‌కు ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

కేటాయింపులకు మించి వాడుతున్న తెలంగాణ

తెలంగాణ చేపట్టిన మిషన్ కాకతీయ విజయవంతమైందని ఆ సర్కారే చెబుతోందని, దీన్ని బట్టి చూస్తే చిన్న నీటి వనరుల విభాగంలో వాడుకుంటున్న నీటిపై తెలంగాణ లెక్కలు సరైనవి కావని ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ కౌన్సిల్ జయదీప్‌గుప్తా ట్రిబ్యునల్‌కు వివరించారు. రాష్ట్రంలో బేసిన్ అవల 1960కి పూర్వం పూర్తయి, నీటిని వాడుకుంటున్న ప్రాజెక్టులకు బచావత్ ట్రిబ్యునల్ నీటిని కేటాయించిందంటూ తెలంగాణ వాదనలను తిప్పికొట్టారు. ట్రిబ్యునల్‌కు నీటి పునఃపంపిణీ అధికారం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి కొత్త ప్రాజెక్టేనని, దానికి నీటిని కేటాయించే అధికారం కొత్త ట్రిబ్యునల్‌కే ఉందని స్పష్టం చేశారు.

దళిత రైతులకు సంపూర్ణ హక్కులు

▶ మొదటి పేజీ తరువాయి

తాజాగా మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. భూమి లేని దళిత రైతుల జీవనోపాధి కోసం గతంలో రాష్ట్ర ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూములను కొనుగోలు చేసి అర్హులకు ఇచ్చింది. ఆ భూమి విలువలో కొంత మొత్తాన్ని కార్పొరేషన్ రుణంగా ఇవ్వడంతో దాన్ని తీర్చే వరకూ తనఖా పెట్టుకుంది. రుణాన్ని చెల్లించిన వారి భూములను తనఖా నుంచి విడుదల చేసేవారు. కొందరు రైతులు ఆ రుణాన్ని కట్టలేక భూమి పత్రాలను తనఖా నుంచి విడిపించుకోలేకపోయారు. ఇలా 16,213.51 ఎకరాలకు సంబంధించి 14,223 మంది రైతులు తనఖా నుంచి విడిపించుకోలేక, భూములపై హక్కులు లభించక దీర్ఘకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దళిత మహిళా రైతుల పేరుతో డాక్యుమెంట్లు

రుణాలను మాఫీ చేసి భూములపై తమకు పూర్తి హక్కులు కల్పించాలని రైతులు దశాబ్దాలుగా కోరుతున్నారు. 2008లో రుణాల మాఫీకి అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా వివిధ కారణాలతో అమలుకాలేదు. దీనిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. రుణాలు చెల్లించలేకపోయిన దళిత రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేయాలని నిర్ణయించారు. తద్వారా చాలా ఏళ్లుగా తాకట్టులో ఉన్న భూములను విడిపించి ఎలాంటి రుసుం తీసుకోకుండా వాటిని దళిత మహిళా రైతుల పేరుతో రిజిస్టర్ డాక్యుమెంట్లుగా ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. దీంతో దళిత రైతులకు వారి భూములపై సంపూర్ణ హక్కులు లభిస్తాయి.

రూ.2,133 కోట్ల ఖరీదైన భూములపై సంపూర్ణ హక్కులు

సకాలంలో రుణాలను చెల్లించి తాకట్టు నుంచి విడిపించుకున్న రైతులు సైతం ఆ భూములు ఇప్పటికీ నిషేధిత జాబితాలోనే కొనసాగుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లభించక, అవసరానికి అమ్ముకోలేక వేల ఎకరాలకు సంబంధించి రైతులు అవస్థ పడుతున్నారు. ఇప్పుడు ఆ భూములను 22 (ఏ) నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీలను ప్రభుత్వం మినహాయించింది. దళిత రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే భూములపై హక్కులు లభిస్తాయి. మొత్తంగా రుణాల మాఫీ, 22 (ఏ) నుంచి భూముల తొలగింపుతో మొత్తం 22,300 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. రూ.2,133 కోట్ల విలువైన ఈ భూములపై రైతులకు సంపూర్ణ హక్కులు లభించనున్నాయి.

'అసైన్డ్'పై హక్కులు అతి పెద్ద సంస్కరణ

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం భూముల చరిత్రలో అతి పెద్ద సంస్కరణగా రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అభివర్ణించారు. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారి రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. పేద రైతుల హోదాను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి ధర్మాన మీడియాతో మాట్లాడారు. 20 ఏళ్లుగా తమకిచ్చిన అసైన్డ్ భూమిని సాగుచేసుకుంటున్న వారికి అన్నిరకాల హక్కులను ప్రభుత్వం కల్పించిందని, గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కీలక నిర్ణయాన్ని తీసుకోలేదని చెప్పారు. 1977లో పీఓటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టం వచ్చిన నాటినుంచి అనేక మార్పులు వచ్చిన నేపథ్యంలో కీలక సంస్కరణ తేవాలని సీఎం జగన్ ఆలోచించారని తెలిపారు. అసైన్డ్ భూమిని అత్యవసర సమయంలో ఆదుకునే విలువైన ఆస్తిగా మారుస్తూ కేబినెట్ తీర్మానం చేసిందన్నారు. చట్టాలు తెలియక ఇప్పటికే అసైన్డ్ భూములను అమ్ముకుంటే వాటిని కొనుగోలు చేసిన వారికి మాత్రం ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. అసైన్డ్ భూమిపై హక్కు ఒరిజినల్ రైత్వారీ పట్టా పొందిన రైతుకు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఇప్పటికే అసైన్డ్ భూములను కొనుగోలు చేసినవారికి హక్కులు ఉండవని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 15.21 లక్షల మంది అసైన్డ్ రైతులు లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు.

భూ సంస్కరణలతో జీడీపీ వృద్ధి

భూవివాదాల పరిష్కారంపై తమ ప్రభుత్వం చూపినంత శ్రద్ధ మరే ప్రభుత్వమూ పెట్టలేదని స్పష్టం చేశారు. భూముల రీసర్వే దీనికి ఉదాహరణగా చెప్పారు. ఇప్పటివరకు 19 లక్షల మ్యుటేషన్లు జరిగాయని, భూరికార్డులన్నీ అప్‌డేట్ అవుతున్నాయని తెలిపారు. 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములు, 33 వేల ఎకరాల షరతులు గల పట్టా భూములను నిషేధిత జాబితా 22 (ఏ) నుంచి తొలగించి భూయజమానులకు సర్వహక్కులను కల్పించామన్నారు. పదేళ్లుదాటిన నివేశన స్థలాలపై కూడా పేదలకు సర్వహక్కులు కల్పించడంతో లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. లంక భూములకు సంబంధించి 9,600 ఎకరాలకు పట్టాలను మంజూరు చేశామన్నారు. భూ సంస్కరణలతో భూముల విలువ పెరిగి రాష్ట్ర జీడీపీ పెరుగుతుందన్నారు.

సీఎం జగన్ నిర్ణయం చరిత్రాత్మకం: మంత్రి నాగార్జున



సాక్షి, విశాఖపట్నం: పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములపై వారికి సంపూర్ణ హక్కులు కల్పిస్తూ సీఎం జగన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. శుక్రవారం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో 15,21,160 మంది అసైన్డ్ రైతులు 27,41,698 ఎకరాలను అత్యవసరాల కోసం విక్రయించుకునే అవకాశం కలుగుతుందన్నారు. పేదలు తనఖా పెట్టిన భూములను సైతం రాష్ట్ర ప్రభుత్వమే విడిపించి రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా భరించి వారికే అందించేలా నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. తద్వారా 16,123 ఎకరాలకు సంబంధించి 14,023 మందికి సంపూర్ణ హక్కులు లభిస్తాయన్నారు. దీనికి సంబంధించి రూ.2 కోట్ల రిజిస్ట్రేషన్ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేస్తుంటే ప్యాకేజీ స్టార్ పవన్‌కల్యాణ్ విమర్శలు చేయడం తగదని ధ్వజమెత్తారు.

సామాజిక న్యాయంలో సువర్ణాధ్యాయం: జూపూడి ప్రభాకర్‌రావు



సాక్షి, అమరావతి: సామాజిక బాధ్యతతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పేద రైతుల జీవితాలను మారుస్తోందని, సామాజిక న్యాయంలో ఇది సువర్ణాధ్యాయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. అసైన్డ్ భూములపై హక్కులు కల్పించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకే అధిక ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. పేద రైతుల పట్ల సీఎం చూపిన ఔదార్యానికి చేతులెత్తి నమస్కరిస్తున్నారని చెప్పారు. అంటరానితనంపై అవిశ్రాంతంగా పోరాటం చేస్తూ అంబేడ్కర్ ఆశయ సాధనకర్తగా సీఎం జగన్ నిలిచారని కొనియాడారు.

ఇక ఫ్రాన్స్‌లోనూ భారత యూపీఐ సేవలు

- ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నాం: ప్రధాని మోదీ
- ఫ్రాన్స్ నేషనల్ డే వేడుకల్లో పాల్గొన్న భారత ప్రధాని
- మోదీకి ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం

పారిస్: నగదు రహిత లావాదేవీల కోసం ప్రవేశపెట్టిన భారత యూపీఐ సేవలను ఫ్రాన్స్‌లోనూ ఉపయోగించుకొనేలా ఇక్కడి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, మన నవీన ఆవిష్కరణలకు కొత్త మార్కెట్‌ను తెరిచామని చెప్పారు. స్థానిక కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీ ప్రసంగించారు. ఫ్రాన్స్‌లోని మార్సిలీ నగరంలో కొత్తగా భారత కాన్సులేట్‌ను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. ఫ్రాన్స్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులకు ఐదేళ్ల గడువుతో కూడిన పోస్ట్-స్టడీ వర్క్ వీసాలు లభిస్తాయని తెలిపారు. ఈసారి ఫ్రాన్స్ పర్యటన తనకు చాలా ప్రత్యేకమని చెప్పారు. 25 ఏళ్ల క్రితం భారత్-ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని గుర్తుచేశారు. భారత్-ఫ్రాన్స్ మధ్య భాగస్వామ్యానికి ఇరు దేశాల ప్రజల అనుబంధమే పునాది అన్నారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ప్రవాస భారతీయులకు మోదీ పిలుపునిచ్చారు. పారిస్‌లోని ఎలిసీ ప్యాలెస్‌లో ప్రధానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ దంపతులు విందు ఇచ్చారు

భారత్-ఫ్రాన్స్ బంధం మరింత బలపడాలి

పారిస్‌లో శుక్రవారం అట్టహాసంగా జరిగిన నేషనల్ డే (బాస్టిల్ డే) వేడుకల్లో నరేంద్ర మోదీ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. నేషనల్ డే పరేడ్‌లో భారత్ త్రివిధ దళాలబృందం సైతం పాలుపంచుకుంది. రఫేల్ యుద్ధ విమానాల విన్యాసాలు ఆహూతులను అబ్బురపర్చాయి. నమ్మకమైన భాగస్వామి ఫ్రాన్స్‌కు 140 కోట్ల మంది భారతీయులు కృతజ్ఞులై ఉంటారని. ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడాలని మోదీ ఆకాంక్షించారు. నేషనల్ డే వేడుకలకు భారత ప్రధానిని అతిథిగా ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందని మాక్రాన్ ట్వీట్ చేశారు. భవిష్యత్తులో భారత్ నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోందని తెలిపారు.

మోదీకి ఫ్రాన్స్ అత్యున్నత పౌర, సైనిక పురస్కారం

ప్రధాని మోదీకి ఫ్రాన్స్ అత్యున్నత పౌర, సైనిక పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లెజియాన్ ఆఫ్ హానర్'ను ఇమ్మానుయేల్ మాక్రాన్ ప్రదానం చేశారు. ఈ పురస్కారం అందుకున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ చరిత్ర సృష్టించారు. ఈ పురస్కారం లభించడం పట్ల మోదీ ఆనందం వ్యక్తం చేస్తూ.. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గొప్ప గౌరవమని ట్వీట్ చేశారు. 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లెజియాన్ ఆఫ్ హానర్'ను 1802లో అప్పటి ఫ్రాన్స్ అధినేత నెపోలియన్ బోనపార్టీ ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ గత నెలలోనే ఈజిప్టు ప్రభుత్వం నుంచి 'ఆర్డర్ ఆఫ్ నైలు'ను స్వీకరించిన విషయం తెలిసిందే. కాగా, ప్రధాని మోదీకి 1916 నాటి సిక్కు సైనికాధికారి ఫొటో ప్రతిరూపాన్ని, 11వ శతాబ్దం నాటి చదరంగం పావుల(చార్లిమాగ్నే చెస్‌మెన్) నమూనాను మాక్రాన్ బహూకరించారు. అలాగే 1913 నుంచి 1927 మధ్య ప్రచురితమైన, మార్సెల్ ప్రౌస్ట్ రచించిన 'ఇన్ సెర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్' అనే సిరీస్ నవలలను అందజేశారు.

లీనా నాయర్‌తో భేటీ

ఫ్రెంచ్ లగ్జరీ గ్రూప్ 'చానెల్' గ్లోబల్ సీఈఓ లీనా నాయర్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. వృత్తిదారులు, కళాకారుల్లో నైపుణ్యాలు పెంచడం, ఖాదీ వస్త్రాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంపై ఆమెతో చర్చించారు. భారత సంతతికి చెందిన లీనా నాయర్ ప్రపంచ వేదికపై గొప్ప పేరు తెచ్చుకున్నారని ట్విట్టర్‌లో మోదీ ప్రశంసించారు.

రక్షణ సహకారమే మూలస్తంభం

రాబోయే 25 ఏళ్లలో భారత్-ఫ్రాన్స్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య సంబంధాలకు రక్షణ సహకారమే మూలస్తంభమని ఇమ్మానుయేల్ మాక్రాన్‌తో చర్చల సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. భారత్, ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేదిశగా వివిధ కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. దీనికిముందు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ''రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ 25 ఏళ్ల బలమైన పునాదిపై రాబోయే 25 సంవత్సరాలకు అవసరమైన రోడ్‌మ్యాప్ తయారుచేస్తున్నాం. రెండు దేశాల నడుమ రక్షణ సహకారం బలపడుతుండడం సంతోషకరం. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌కు ఫ్రాన్స్ ఒక ముఖ్యమైన భాగస్వామి. కేవలం మా ఆకాంక్షలు నెరవేర్చుకోవడమే కాదు, ఇతర మిత్ర దేశాల అవసరాలు సైతం తీర్చాలన్నదే మా ధ్యేయం. ప్రపంచశాంతి కోసం భారత్ కట్టుబడి ఉంది. ఉగ్రవాదంపై పోరాడే విషయంలో భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తున్నాయి. సీమాంతర ఉగ్రవాదంపై కఠిన చర్యలు అవసరమని భావిస్తున్నాం'' అని ప్రధాని మోదీ చెప్పారు. నూతన సాంకేతికతల అభివృద్ధికి ఫ్రాన్స్‌తో కలిసి పని చేస్తామని, దీనిపై చర్చించబోతున్నామని వివరించారు. మిత్రదేశాల కోసం కీలకమైన రక్షణ పరికరాలను, ఆయుధాలను భారత్, ఫ్రాన్స్ కలిసి ఉత్పత్తి చేస్తాయన్నారు. రక్షణ, అంతరిక్షరంగంలో మరింతగా సహకరించుకోవడానికి అవకాశం ఉందన్నారు.

590 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- జారీచేసిన ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్యశాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో 41 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల్లో 590 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ విధానాల్లో పోస్టుల భర్తీ చేపట్టనున్నారు. ఈ నెల 17 నుంచి [illegible] వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులోకి రానుంది. ఈనెల 26 దరఖాస్తుకు చివరి గడువు. ఓసీ అభ్యర్థులు రూ.వెయ్యి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, వికలాంగ అభ్యర్థులు రూ.500 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదు కొత్త వైద్యకళాశాలలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు కొత్తగా ఏర్పాటుచేసిన కడప మానసిక ఆస్పత్రి, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, పలు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్య పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయి. ఈ పోస్టుల భర్తీలో భాగంగా తాజా నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు చేపట్టిన సీఎం జగన్ ప్రభుత్వం 50 వేలకుపైగా పోస్టులను భర్తీచేసింది.

12న గుంటూరులో ఏపీజీఈఎఫ్ రాష్ట్ర మహాసభ

- సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి
- తాము చెప్పిన సమస్యల్లో 38 అంశాలపై ప్రభుత్వం సానుకూలం
- సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉద్యోగులతో భారీ ర్యాలీ
- అవగాహన లేకే జీపీఎస్‌పై కొందరు విమర్శలు



సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీజీఈఎఫ్) రాష్ట్ర మహాసభ ఆగస్టు 12న గుంటూరులో జరుగుతుందని సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి చెప్పారు. శుక్రవారం తాడేపల్లిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. నాలుగేళ్లలో తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సమస్యల్లో కీలకమైన 38 అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మహాసభ రోజున ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేసే స్థానంలో కొత్త నోటిఫికేషన్ ఇవ్వవద్దని ప్రభుత్వాన్ని కోరామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ తర్వాత కొత్త పోస్టుల భర్తీ చేపట్టాలని సీఎం జగన్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆ మేరకు సీఎస్‌కు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దశలవారీగా కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని చెప్పారన్నారు. 2004 సెప్టెంబర్ లోపు నియమితులైన ఉద్యోగులందరికీ ఓపీఎస్ ఇవ్వాలని, విశ్వవిద్యాలయాలు, పలు సొసైటీల్లో ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని కోరామన్నారు. ఉద్యోగులకు మేలు చేసేలా ఫెడరేషన్ పనిచేస్తుందన్నారు. ఉద్యోగికి, ప్రభుత్వానికి ఉభయతారకంగా ఉండేలా సీఎం జగన్ జీపీఎస్ తీసుకువచ్చారని తెలిపారు. దీనిపై అవగాహన లేకే జీపీఎస్‌ను కొందరు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. జీపీఎస్‌లో రిటైర్మెంట్ సమయంలో 50 శాతం పింఛన్, డీఏలు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, అన్ని అంశాలు దృష్టిలో పెట్టుకుని ఈ విధానం రూపొందించారని వివరించారు. వైఎస్ జగన్ మరో 30 ఏళ్లు రాష్ట్రానికి సీఎంగా కొనసాగుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శనివారం ॥ 15-7-2023

అదర్ సైడ్



'నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే ఆనంద తరంగాలలో వీరు...' అన్నది చంద్రయాన్-3 ఆ ఆనంద తరంగాలలో తేలియాడిన అసంఖ్యాక భారతీయులలో 'రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా'గా పేరు తెచ్చుకున్న రీతు కరిధాల్ ఒకరు. మూడు దశలు పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లింది. దేశాన్ని సంతోషంలో ముంచెత్తింది. 'చంద్రయాన్-3'లో 'నేను సైతం' అంటూ మిషన్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు స్వీకరించింది రీతు కరిధాల్. చిన్నప్పటి కలలు కలలుగానే ఉండిపోవు. కష్టపడితే ఆ కలలు నిజమవుతాయి. పదిమంది మన గురించి గర్వంగా చెప్పుకునేలా చేస్తాయి... అని చెప్పడానికి రీతు కరిధాల్ నిలువెత్తు నిదర్శనం. 'ఊపిరి సలపని పనుల్లో మహిళా శాస్త్రవేత్తలకు వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కుదురుతుందా? ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి?' అనే ప్రశ్నకు రీతు కరిధాల్ మాటల్లో సమాధానం దొరుకుతుంది...

కుటుంబమే నా బలం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన రీతు కరిధాల్‌కు చిన్నప్పుడు ఆకాశం వైపు చూడడం అంటే ఇష్టం. రాత్రులలో గంటల తరబడి ఆకాశంకేసి చూసేది. నక్షత్రాల గురించి ఆలోచించేది. 'చంద్రుడు ఒకసారి పెద్దగా, ఒకసారి చిన్నగా ఎందుకు కనిపిస్తాడు?'... లాంటి సందేహాలెన్నో ఆమెకు వచ్చేవి.

అంతరిక్షంపై రీతు ఆసక్తి వయసుతోపాటు పెరుగుతూ పోయింది.

హైస్కూల్ రోజులకు వచ్చేసరికి అంతరిక్షం, ఇస్రో, నాసాకు సంబంధించి పత్రికలలో వచ్చిన వార్తలు, వ్యాసాలను కట్ చేసి ఫైల్ చేసుకునేది.

'యూనివర్శిటీ ఆఫ్ లక్నో'లో ఎం.ఎస్‌సీ., బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసింది. 1997లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో చేరడం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో తొలి ఉద్యోగం. తొలి టాస్క్ తన ముందుకు వచ్చినప్పుడు...

'చాలా కష్టం' అనుకుంది.

ఆ సమయంలో ఆ కష్టాన్ని పక్కకు తోసి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేయడానికి తాను చదువుకున్న ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ కంటే తనమీద తనకు ఉన్న ఆత్మవిశ్వాసమే ఎక్కువగా ఉపయోగపడింది. ఆ తరువాత కూడా ప్రాజెక్ట్‌ల రూపంలో ఎన్నో సవాళ్లను విజయవంతంగా అధిగమించింది. 'టైమ్ అండ్ ది టార్గెట్'ను దృష్టిలో పెట్టుకొని కాలంతో పరుగు తీసింది.

'అప్పటికి నాకు ఇంకా పెళ్లి కాలేదు. పేయింగ్ గెస్ట్‌గా ఉన్నాను. పొద్దుటి నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది. అయితే అదేమీ నాకు భారంగా, కష్టంగా అనిపించేది కాదు. చేస్తున్న పని ఇష్టమైనది కావడమే దీనికి కారణం. అప్పట్లో ఎక్కువమంది మహిళలు ఇస్రోలో లేరు. ఒక ల్యాబ్ నుంచి మరో ల్యాబ్‌కు, ఒక బిల్డింగ్ నుంచి మరో బిల్డింగ్‌కు ఒంటరిగానే వెళ్లేదాన్ని. ఎప్పుడూ భయం అనిపించేది కాదు' అంటుంది రీతు.

ఒక్కోమెట్టు ఎక్కుతూ 'ఇస్రో' చేపట్టిన ఎన్నో ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు చేపట్టింది. ప్రతిష్ఠాత్మకమైన 'మంగళ్‌యాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేసింది.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు కోచింగ్ సెంటర్‌లకు వెళ్లేంత స్తోమత ఉండేది కాదు. చదువుపై తన ఆసక్తే తన శక్తిగా మారింది.

బీఎస్సీ పూర్తికాగానే 'ఏదో ఒక ఉద్యోగంలో చేరవచ్చు కదా' అనే మాటలు చుట్టాలు పక్కాల నుంచి వినిపించేవి. 'ఇస్రోలో పనిచేయాలనేది నా కల' అని వారికి స్పష్టంగా చెప్పేది రీతు.

తన పుస్తకం 'దోజ్ మాగ్నిఫిసెంట్ ఉమెన్ అండ్ దెయిర్ ఫ్లైయింగ్ మెషిన్స్' కోసం మిన్నీ వేద్ రీతు కరిధాల్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఆ ఇంటర్వ్యూలో తన అనుభవాలను ఇలా పంచుకుంది రీతు...


పిల్లలతో రీతూ కరిధాల్

'టైమ్ మేనేజ్‌మెంట్'కు అధిక ప్రాధాన్యత ఇచ్చే రీతు వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నించేది. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నా పిల్లల దగ్గర కూర్చొని వారితో హోంవర్క్ చేయించడం మరిచేది కాదు.

'ఇస్రోలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. లింగవివక్షతకు తావు లేదు. ప్రతిభ మాత్రమే ముఖ్యం అవుతుంది. రిమోట్ సెన్సింగ్, కమ్యూనికేషన్ శాటిలైట్స్ ఫీల్డ్‌లో సీనియర్ ఉమెన్ సైంటిస్ట్‌లు ప్రోగ్రామ్ డైరెక్టర్‌లు కావడం దీనికి నిదర్శనం. నా తొలి ప్రాజెక్ట్ చేయడానికి ఎంతోమంది సీనియర్‌లు ఉన్నప్పటికీ ఆ అవకాశం నన్ను వెదుక్కుంటూ వచ్చింది'

'టైమ్ మేనేజ్‌మెంట్'కు అధిక ప్రాధాన్యత ఇచ్చే రీతు వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోవడానికి ప్రయత్నించేది. వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా పిల్లల దగ్గర కూర్చొని వారితో హోంవర్క్ చేయించడం మరిచేది కాదు.

'మంగళ్‌యాన్ మిషన్'లో భాగమైనప్పుడు రీతు కుమారుడి వయసు తొమ్మిది, కూతురు వయసు నాలుగు సంవత్సరాలు. క్షణం తీరిక లేని పనుల్లో కూడా ఏదో రకంగా తీరిక చేసుకొని పిల్లలతో తగిన సమయం గడిపేది. వారు నిద్రపోయిన తరువాత ఆఫీసు పని మొదలుపెట్టేది. అలా పనిచేస్తూ కుర్చీలోనే నిద్రపోయిన రోజులు ఎన్నో ఉన్నాయి!

'ఒకసారి మా అమ్మాయికి జ్వరం వచ్చింది. హాస్పిటల్‌కు తీసుకువెళ్లే టైమ్ లేకపోవడంతో నా భర్త తీసుకువెళ్లాడు. ఆఫీసులో ఉన్న మాటేగానీ నా మనసంతా పాపపైనే ఉంది. పాపకు ఎలా ఉంది అని ఎప్పటికప్పుడు అడుగుతుండేదాన్ని. అపరాధ భావనతో బాధ అనిపించేది. కొన్నిసార్లు స్కూల్ ఫంక్షన్‌లకు వెళ్లడం కుదిరేది కాదు. అయితే కుటుంబం నాకు ఎప్పుడూ అండగానే నిలబడింది. అదే నా బలం.

ఆఫీసు నుంచి ఇంటికి ఆలస్యంగా రావడానికి కొన్ని కుటుంబాల్లో ఒప్పుకోరు. మగవాళ్ల విషయంలో అయితే పట్టింపులు ఉండవు. మంగళ్‌యాన్ మిషన్ కోసం పనిచేసే రోజుల్లో ఇంటికి ఆలస్యంగా వచ్చేదాన్ని. అయితే నాపై ఉండే పనిఒత్తిడి గురించి తెలిసిన కుటుంబసభ్యులు నన్ను అర్థం చేసుకున్నారు. ఇంట్లో ఏ చిన్న సమస్య వచ్చినా అది నేను చేసే పనిపై ప్రభావం చూపేది. అందుకే ఎలాంటి సమస్యలు రాకుండా, మనసు ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని' అంటుంది రీతు కరిధాల్.

✻ మనం మాట్లాడుకోవాల్సిందే!

వ్యసనాల బారిన పడిన వ్యక్తిని ఆ కుటుంబంలోని వారు మొదట్లో గుర్తించరు. తమ వాళ్లు మంచివాళ్లని, చెడు అలవాట్లకు బానిసలు కారని నమ్ముతారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు స్నేహితుల ప్రభావమో, మరొకటో అనుకుంటారు తప్ప సమస్యను పెద్దగా పట్టించుకోరు. ఈ సమస్యను ఫ్యామిలీ డినైల్ అంటున్నారు నిపుణులు. అడిక్షన్స్ గురించి అసలు మన కుటుంబాలు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నాయి..? ఎలాంటి నిర్ణయాలు అమలు చేస్తున్నాయి? ఈ అంశం పై 'మనం మాట్లాడుకోవాల్సిందే!'

నమ్మడమే ప్రమాదమా..!


ప్రతీకాత్మక చిత్రం

● అపార్ట్‌మెంట్‌లో దాదాపు అన్ని ఫ్లాట్స్ ఒకేలా ఉంటాయి. ఒక బ్బాయి రాత్రి టైమ్‌లో బాగా తాగేసి తమ ఇల్లు అనుకొని, వేరేవాళ్ల ఇంటి బెడ్‌రూమ్‌కి వెళ్లి పడుకున్నాడు. ఆ ఇంట్లో వాళ్లు పెద్ద గొడవ చేశారు. ఆ అబ్బాయి వాళ్ల తల్లితండ్రులు తమ పిల్లవాడిని తిట్టకుండా ఏదో పొరపాటున జరిగి ఉంటుందంటూ ఆ కుటుంబంతో గొడవ పడ్డారు.

● ఫ్యామిలీ ఫంక్షన్‌కి భర్త రాలేదు. 'ఏమైంది..'అని ఎవరైనా అడిగితే ఆరోగ్యం బాగోలేదు అంటారు. ఆ సదరు వ్యక్తి ఇంట్లో ఉండి తాగుతుంటాడు.

● మల్టిపుల్ అడిక్షన్స్‌కు అలవాటుపడిన ఓ అబ్బాయి వచ్చి కౌన్సెలింగ్ తీసుకుంటానంటే, తల్లి ఒప్పుకోలేదు. 'నీకేమైంది, బాగానే ఉన్నావ్ కదా! పై చదువుల కోసం అమెరికా వెళుతున్నావ్. బాధ్యత తెలిస్తే సెట్ అవుతావులే' అంటుంది.

● ఒక భార్య 'మా ఆయన తాగినప్పుడు చాలా క్రూరంగా బిహేవ్ చేస్తాడు. మిగతా సమయాల్లో చాలా చాలా బాగుంటాడు' అని సరిపెట్టుకుంటుంది.

● 'మా వాడు చాలా మంచోడు సార్, చాలా జాగ్రత్తగా ఉంటాడు. మొన్ననే తాగి డ్రైవ్ చేయడం వల్ల యాక్సిడెంట్ అయ్యింది' అంటాడు తండ్రి.

● కజిన్స్ రిలేటివ్ ఫంక్షన్‌లో ఒకబ్బాయి ఓవర్‌గా తాగాడు. మనవాడు కదా అని మరుసటి రోజు తల్లికి ఫోన్ చేసి 'అక్కా, మీ అబ్బాయి పార్టీలో ఓవర్‌గా తాగాడు' అని చెబితే 'మా అబ్బాయి అలాంటోడు కాదు, ఫ్రెండ్స్, కజిన్స్ బలవంతం చేసుంటారు' అని వెనకేసుకొచ్చింది. విషయం చెప్పిన వ్యక్తితో మాట్లాడటమే మానేసింది బంధుమిత్రులు ఎవరైనా 'మీ అబ్బాయి తాగుతుండగా ఫలానా చోట చూశాం' అని చెబితే వాళ్లతోనూ మాట్లాడటం మానేసింది. ఒకసారి కాలేజీలో గంజాయి తీసుకుంటూ పట్టుబడ్డాడు. తల్లిదండ్రులని పిలిస్తే 'మా అబ్బాయిని కావాలనే బ్లేమ్ చేస్తున్నారు. మీదే అసలు సమస్య అనేసింది.'

ఇలాంటి సమర్థింపులు ఎన్నో .. ఎన్నెన్నో మీకూ తెలిసే ఉంటాయి.

■ **వెరీ డేంజర్!!**

చాలామంది పేరెంట్స్ తమ పిల్లలు వ్యసనాల బారినపడ్డారనే విషయం తెలిసినా వారు ఒప్పుకోరు.

మందలించాల్సిందే!

ముందు తప్పించుకోవడం, సర్దుబాటు చేసుకోవడం నుంచి కుటుంబాల్లో ఉన్నవారు బయటకు రావాలి. కౌన్సెలింగ్ సమయంలో ముఖ్యంగా ఆడవాళ్లకు బలంగా ఉండాలని చెబుతాం. గట్టిగా మందలించమని చెబుతాం. 'ఇది మా వ్యక్తిత్వం కాదు కదా' అంటారు. కానీ, మంచితనాన్ని అలుసుగా తీసుకుంటున్నారు అని గుర్తించరు. సమస్యను భరిస్తూ ఉంటే ఏదో ఒక రోజున మిమ్మల్ని వ్యసనపరులు నిస్సహాయ స్థితికి తీసుకెళతారు. కుటుంబం బలంగా ఉండాలంటే మేజర్ రోల్ భార్య/తల్లిదే. ఆమె గట్టిగా ఉండాల్సిందే. కుటుంబం బాగుండాలంటే మంచిగవ్వాల్సిందే! అని చెప్పాలి. ఒకతను ఆల్కహాల్/డ్రగ్స్ వాడుతున్నాడంటే అతని మైండ్ నిలకడగా లేదని అర్థం చేసుకోవాలి. ఫ్రెండ్స్, రిలేటివ్స్, శ్రేయోభిలాషుల సాయంతోనైనా సమస్యను చక్కదిద్దాలి. 'థెరపీ అవసరం లేదు. సదరువ్యక్తికి తెలియకుండా మందులు ఇప్పిద్దాం' అనుకుంటారు. కానీ, యాంటీ క్రేవింగ్ మెడిసిన్స్ వాడటం వల్ల బ్రెయిన్‌కి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త సమస్యలు పుట్టుకు రావచ్చు. అవగాహన, బిహేవియరల్ థెరపీ ద్వారానే పరిష్కరించాల్సి ఉంటుంది. ముందుగా కుటుంబాల వాళ్లు... 1. ఇదొక వ్యసనం అని అంగీకరించాలి. 2. పూర్తి చికిత్స ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాలి. 3. చికిత్సకు కావాల్సినంత టైమ్ ఇవ్వాలి. నలుగురిలో తెలిస్తే పరువు పోతుందని భయపడుతుంటారు. ఏదైనా అనారోగ్యం చేస్తే హాస్పిటల్‌కు ఎలా వెళతామో సైకలాజికల్ సమస్య వస్తే అందుకు సంబంధించిన డాక్టర్‌ని కలవడానికి ఇబ్బంది పడకూడదు.



– డాక్టర్ గిడియన్,
డి–అడిక్షన్ థెరపిస్ట్

వ్యసనపరులకు కుటుంబాల నుంచి ఇలాంటి రక్షణ దొరికితే ఎప్పటికీ మార్పు రాదు సరికదా సర్దుకుపోవడం, కొట్టిపారేయడం చేస్తుంటే మీ కుటుంబం బీటలు వారడానికి సిద్ధంగా ఉందని గ్రహించాల్సిందే! అడిక్షన్ వెరీ వెరీ డేంజర్ డిసీజ్. ఈ సందర్భంలో కుటుంబంలో ఎవరిలోనైనా అడిక్షన్స్‌కు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయించడం మేలు.

■ **ధైర్యమే ఆయుధం**

వ్యసనాల బారిన పడ్డవారు నమ్మబలికే మాటలు చెబుతారు. సంఘటన తర్వాత 'సారీ..' అనేస్తారు. చిన్న చిన్న కానుకలు ఇచ్చి, తమ లోపాన్ని కప్పిపుచ్చుకునేవారుంటారు. దీంతో అమ్మ/భార్య/అక్క/ మన వాళ్లే కదా, మన పిల్లలే కదా.. మరోసారి ఇలా చేయరులే అనుకుంటారు. ఇదే విధమైన ప్రవర్తన కొన్నాళ్లకు ముదిరి ఇంట్లో భయోత్పాతాలను సృష్టిస్తుంటారు.

■ **కుటుంబం ప్రవర్తన మారాల్సిందే!**

కొడుకు/కూతురు/హజ్బెండ్/ఫాదర్ కి అడిక్షన్ పట్ల సపోర్ట్ ఇవ్వకూడదు. ఇంట్లో డబ్బులివ్వకపోతే బయట అప్పులు చేస్తారు. పదివేలు, ఇరవైవేలు అప్పు చేసినప్పుడు ఎవరైనా ఇంటి మీదకు వస్తే కుటుంబంలో ఉన్నవారిని బెదిరియ్యకుండా ఆ అప్పు తీర్చేస్తారు. సదరు వ్యక్తికి ఇబ్బంది కలగనీయకుండా అడ్డుగా నిలబడతారు. ఆ సమస్యను ఫేస్ చేయనీయకుండా వెనకేసుకొస్తారు. కాలేజీలో సమస్య వచ్చినా, మరో చోట సమస్య వచ్చినా తల్లిదండ్రులు కొడుకును కాపాడటానికి ట్రై చేస్తారు. దీనివల్ల పిల్లవాడు మరిన్ని తప్పులు చేసేలా ఆ కుటుంబంలోని వారు ప్రోత్సహిస్తున్నట్టే.



పాజిటివ్ పెళ్లిళ్లకు పెద్దదిక్కు

కొన్ని రకాల ఆరోగ్య సమస్యల పేరు పలకడానికి సైతం కొంతమంది సిగ్గుపడుతుంటారు. అలాంటిది ఆ రోగంతో బాధపడుతోన్న రోగికి మరో రోగి భాగస్వామి అయితే ఆ జంట మరికొంతకాలం సంతోషంగా జీవిస్తారని భావించిన అనిల్ వాలివ్ అలాంటి వారికి దగ్గరుండి మరీ పెళ్లి సంబంధాలు కుదురుస్తూ ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నాడు.



అనిల్ వాలివ్

పుణేకు చెందిన యాభైఏళ్ల అనిల్ వాలివ్ ప్రస్తుతం డిప్యూటీ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి (ముంబై)గా పనిచేస్తున్నాడు. అది 2005... అనిల్‌కు ఎంతో ఇష్టమైన స్నేహితుడు హెచ్‌ఐవీ సోకి తన కళ్ల ముందే చనిపోవడం. అతని కొడుకుకి కూడా హెచ్‌ఐవీ సోకడం అనిల్‌ను ఎంతో బాధించింది. తన స్నేహితుడి మరణాన్ని తట్టుకోలేక... ''హెచ్‌ఐవీ వచ్చినంత మాత్రాన అంతటితో జీవితం అయిపోదు. వాళ్లకు భాగస్వామి ఉంటే జీవితం మరికొన్నాళ్లపాటు బావుంటుంది'' అన్న ఉద్దేశ్యంతో 2005లో పాజిటివ్ సాథి వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. ప్రారంభంలో తన పైఅధికారులు కూడా ప్రోత్సహించడంతో వెబ్‌సైట్‌తో పాటు.. వివాహ వేదికలూ నిర్వహించేవాడు. అలా మొదలైన పాజిటివ్ సాథీ డాట్‌కామ్ క్రమంగా విస్తరించి నేడు వేలమంది పాజిటివ్ రోగుల పెళ్లిళ్లకు వారధిగా నిలుస్తోంది.

బ్రెయిన్ సర్జరీ అయినప్పటికీ..

ఒకపక్క ఉద్యోగం... మరోపక్క సామాజిక సేవ చేస్తోన్న అనిల్‌కు 2015లో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో సర్జరీ చేయించుకున్నాడు. పూర్తిగా కోలుకున్న తరువాత కూడా సామాజిక సేవలో మరింత మునిగి పోయాడు. తాను చేసే సాయం సమాజం మెరుగుపడడానికి ఉపయోగపడాలని నిర్ణయించుకుని హెచ్‌ఐవీ రోగులకు పెళ్లి సంబంధాలు కుదర్చడాన్ని మరింత సీరియస్‌గా తీసుకున్నాడు. హెచ్‌వీ రోగికి మరో హెచ్‌ఐవీ జతను జోడిస్తూ ఇప్పటిదాకా వేలమంది పెళ్లిళ్లకు సాయపడుతూనే ఉన్నాడు.

అంటరానివారిగా చూస్తుండడంతో...

ఆర్టీవో అధికారిగా అనేకమందిని కలుస్తుంటాడు అనిల్. ఒకరోజు రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల గురించి వస్తువులు రవాణా చేసే డ్రైవర్లకు ఉపన్యాసం ఇస్తున్నాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న ట్రక్కు డ్రైవర్లలో దాదాపు అందరు హెచ్‌ఐవీ సోకిన వారే అని తెలిసింది. హెచ్‌ఐవీ అని తెలియగానే..కుటుంబ సభ్యులు, చుట్టాలు, స్నేహితులు అంటరానివారుగా చూస్తూ, తమని వదిలేశారని అనిల్‌కు కన్నీటితో తమ బాధను వెళ్లబోసుకున్నారు డ్రైవర్లు. ముందునుంచి హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్న వ్యక్తులపై ఉన్న సానుభూతితో...హెచ్‌ఐవీ సోకిన డ్రైవర్ల జాబితా తీసుకుని డాక్టర్ల దగ్గరకు వెళ్లి వారికి ట్రీట్‌మెంట్ అందించాలని కోరాడు. కొంతమంది ముందుకు రావడంతో వాళ్లతో డ్రైవర్లకు వైద్యం అందిస్తూ సామాజిక కౌన్సెలింగ్‌ను అందిస్తున్నాడు. వీరిలో ఆసక్తి ఉన్నవారికి జతను వెదికిపెడుతున్నాడు.

ఎన్నిసైట్లు వెతికినా...

పాజిటివ్ అమ్మాయిల కోసం ఎన్ని మ్యాట్రిమోనీ సైట్లు వెతికినా ఎక్కడా హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్న వారికి సంబంధాలు చూసే సైటు ఒక్కటీ కనిపించలేదు. దీంతో తనే స్వయంగా సైటుని ప్రారంభించాలనుకున్నాడు. ఇందుకోసం ఆసుపత్రులలోని హెచ్‌ఐవీ రోగుల డేటాను సేకరించాడు. వారి అనుమతితోనే www.positivesaathi.com ను ప్రారంభించాడు. ప్రస్తుతం ఈ సైట్‌లో కొన్ని వేల మంది తమ జతకోసం రిజిస్టర్ చేసుకుని ఉన్నారు. ఇప్పటిదాకా మూడు వేలమందికిపైగా ఈ సైట్ ద్వారా వివాహం చేసుకున్నారు.

> **అర్ధంతరంగా పోకుండా..**
>
> సైట్ నిర్వహణ అంత సులభంగా లేదు. కొంతమంది నకిలీ ప్రొఫైల్స్ తో రిజిస్టరు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌లన్నీ సరిచూసుకోవడం కష్టం. ఎక్కువమంది తమ కులానికి చెందిన వారిని మాత్రమే పెళ్లిచేసుకోవాలనుకుంటున్నారు. ఇటువంటి సమస్యలు ఉన్నప్పటికీ పాజిటివ్ రోగులకు జతను వెతికే పనిలో నేను బిజీగా ఉన్నాను. ఇలా పెళ్లిళ్లు జరిగితే హెచ్‌ఐవీ వ్యాప్తి కొంతవరకైనా నిరోధించవచ్చవచ్చు. వాళ్లు అంటరాని వాళ్లలా అర్ధంతరంగా చనిపోకుండా, కొంతకాలం అయినా తోడుతో ఆనందంగా జీవిస్తారు.
>
> - అనిల్ వాల్వి


వరద సమయం

ఈత రావాలి ప్రాణం నిలవాలి

ఇది వానల కాలం. వరదల కాలం. కేరళలో ఈ సమయంలో పడవ ప్రమాదాలు సాధారణం. ప్రమాద తీవ్రత కంటే ఈత రాకపోవడం వల్ల జనం మరణిస్తున్నారని సాజి వెలస్సిరల్ అనే వ్యక్తికి అనిపించింది. చిన్న ఫర్నిచర్ షాపు నడుపుకునే ఇతడు గొప్ప ఈతగాడు కూడా. ఇంకేముంది. ఊళ్లో ఉన్న పెరియార్ నదిని స్విమ్మింగ్ పూల్‌గా చేసుకుని అందులోనే ఈత నేర్పుతున్నాడు. ఇప్పటికి 6000 మంది ఈత నేర్చుకున్నారు. వీళ్లందరి ప్రాణాలను నీళ్ల నుంచి ఇతడు రక్షించినట్టే. ప్రతి చోటా ఇలాంటి వాళ్లుంటే వేల ప్రాణాలు బతుకుతాయి.



గత మే నెలలో కేరళలోని తానురు దగ్గర బ్యాక్ వాటర్స్‌లో పడవ మునిగి 27 మంది చనిపోయారు. 'వాళ్లకు ఈత వచ్చి ఉంటే అందరూ బతికి ఉండేవారు. తుఫాను లేదు.. సముద్రమూ కాదు. ఈత వచ్చి ఉంటే పడవ బోల్తా పడినా ఆ బ్యాక్ వాటర్స్‌లో హాయిగా ఈదుకుంటూ గట్టెక్కవచ్చు. లేదా సహాయకబృందాలు చేరేవరకూ మెల్లగా తేలుతూనే ఉండొచ్చు' అంటాడు సాజి వెలస్సిరల్.


సాజి వెలస్సిరల్

ఈ ప్రమాదం కాదు ఇరవై ఏళ్ల క్రితం ఇతడు చూసిన ప్రమాదమే ఇతడి మనసు మార్చింది. కుమర్‌కోమ్‌లో పడవ బోల్తా పడి 29 మంది చనిపోయారు. అప్పుడు సాజి యువకుడు. తండ్రి మంచి స్విమ్మర్ కావడంతో ఆయన నుంచి ఈత నేర్చుకుని అద్భుతంగా ఈదుతున్నాడు. ఆ ప్రమాదంలో చనిపోయిన వారికి ఈత వచ్చి ఉంటే ప్రాణాలు మిగిలి ఉండేవి అనిపించింది. 'ఈత ఎందుకు రాదు' అని ప్రశ్నించుకున్నాడు. 'నేర్పేవారు లేకపోవడం వల్ల' అనే జవాబు వచ్చింది. 'నేనెందుకు నేర్పకూడదు' అనుకున్నాడు. అలా అతని ఈత సేవ మొదలైంది.

పెరియార్ నదిలో

సాజి వెలస్సిరల్ అలువా అనే చిన్న ఊరిలో ఉంటాడు. ఇది ఎర్నాకుళంకు 40 నిమిషాల దూరం. ఆ ఊళ్లో చిన్న ఫర్నిచర్ షాపు నడుపుకుంటూ జీవిస్తుంటాడు సాజి. అయితే అదే ఊరి నుంచి పెరియార్ నది ప్రవహిస్తూ ఉంటుంది. దాదాపు నిలువ నీరులా ఉంటుంది ప్రవాహం. 'దీనినే స్విమ్మింగ్‌పూల్‌గా చేసుకుని ఈత నేర్పిస్తాను' అని నిర్ణయించుకున్నాడు సాజి. 'ముందు నా కుటుంబం నుంచే మొదలెట్టాలి' అనుకుని తన ఇద్దరు పిల్లల్ని, స్నేహితుడి పిల్లల్ని తీసుకుని నదిలో ఈత నేర్పడం మొదలెట్టాడు. మూడు వారాల్లోనే పిల్లలు ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు (780 మీటర్లు) ఈదడం నేర్చుకున్నారు. దాంతో ఊరి దృష్టి సాజి మీద పడింది. అతడి దగ్గర ఈత నేర్చుకోవడానికి అందరూ క్యూ కట్టారు.

వెలస్సిరల్ రివర్ స్విమ్మింగ్ క్లబ్

నేర్చుకునేవారు పెరిగే కొద్దీ సాజికి ఉత్సాహం వచ్చింది. తన ఈత కేంద్రానికి వెలస్సిరల్ రివర్ స్విమ్మింగ్ క్లబ్ అనే పేరు పెట్టాడు. ప్రత్యేక దినాల్లో, పండగ వేళల్లో సామూహిక ఈత కార్యక్రమాలు నిర్వహిస్తాడు. నది ఈదే పోటీలు నిర్వహిస్తాడు. విశేషం ఏమిటంటే 70 ఏళ్ల ఆరిఫా అనే మహిళ ఇతని దగ్గర ఈత నేర్చుకుని చేతులు వెనక్కు కట్టుకుని మరీ ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు ఈదింది. శారీరకమైన అవకరాలు ఉన్నవారికి కూడా ఈత నేర్పే టెక్నిక్స్ ఇతని దగ్గర ఉన్నాయి. ఇతను ఈత నేర్పేటప్పుడు ఒక అంబులెన్సు ఒడ్డున, నదిలో రక్షణకు ఒక పడవ సిద్ధంగా ఉంటాయి.

'ఈత నేర్వాలి. ప్రాణాలు నిలుపుకోవాలి. ప్రమాదవశాత్తు నీళ్లల్లో పడితే ఈదలేక మరణించడం దురదృష్టకరం' అంటాడు సాజి. అతని హెచ్చరిక వినదగ్గది.

వలంటీర్లను ఏమీ చేయలేవు

- వారిని అరెస్టు చేయించగలిగితే ఉరేసుకుంటా
- ప్యాకేజీ అందుకున్నావు కాబట్టే బాబును విమర్శించడం లేదు
- పవన్ వ్యాఖ్యలపై మంత్రి కారుమూరి ఫైర్



తణుకు అర్బన్: 'సమాజానికి సేవ చేస్తున్న వలంటీర్లను నువ్వు ఏమీచేయలేవు.. ఏ ఒక్క వలంటీరుపై అయినా నువ్వు కేసు పెట్టించి అరెస్టు చేయించగలిగితే నేను తణుకు నరేంద్ర సెంటర్‌లో ఉరేసుకుంటా'.. అంటూ రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఏమన్నారంటే..

జనసేన ప్రభుత్వం వస్తే సచివాలయ వ్యవస్థతో పాటు వలంటీర్లను తొలగిస్తానని చెప్పగలవా పవన్? తణుకు బహిరంగ సభలో ఆయన మాట్లాడిన మాటలన్నీ పచ్చి అబద్ధాలు. పవన్ ఒక అబద్ధాలకోరు. జనసేన వస్తే ఏం చేస్తానో ప్రజలకు చెప్పడం మానేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడమే నీ పార్టీ అజెండాగా పెట్టుకున్నావు? సినిమాల ద్వారా రోజుకు నా సంపాదన రూ.రెండు కోట్లని చెబుతున్న నువ్వు ఆదాయపు పన్ను ఎందుకు సరిపడా చెల్లించడంలేదు? హిందుత్వంపై ఉపన్యాసాలిస్తున్న నువ్వు.. నీ దత్తతండ్రి చంద్రబాబు విజయవాడలో 300 దేవాలయాలు కూల్చినప్పుడు, రాజమండ్రి పుష్కరాల్లో 29 మంది అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నప్పుడు నీ హిందూత్వం ఎక్కడ పెట్టావు? చంద్రబాబు నుంచి ప్యాకేజీ అందుకున్నావు కాబట్టే ఆయన్ను విమర్శించడంలేదు.

యువతను చెడగొడుతున్నావు..

ఇక తాట తీస్తా, తోలు తీస్తా, మక్కెలు విరగ్గొడతా అనడమే కాక.. యువతను రెచ్చగొట్టే వ్యాఖ్యానాలు చేస్తున్నావు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, బెల్టు షాపులు ఎక్కువైపోయాయని అంటున్న నువ్వు తణుకులో ఒక్క బెల్టు షాపు ఉందని నిరూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా. ముఖ్యమంత్రిని పట్టుకుని జగ్గుభాయ్ అంటున్న నిన్ను విగ్గుభాయ్ అని పిలవాల్సి వస్తుంది జాగ్రత్త. తణుకులో టీడీఆర్ బాండ్లలో రూ.309 కోట్లు దోచుకున్నానని నాపై ఆరోపణలు చేస్తున్నావు కానీ.. అది నీ దత్తతండ్రి చంద్రబాబు హయాంలోనే జరిగింది.



నెల్లూరు జిల్లా మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలు, దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు



అన్నమయ్య జిల్లా నందలూరులో పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

కొనసాగుతున్న ఆగ్రహ జ్వాలలు

- పవన్ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ల నిరసన
- తమకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్



వలంటీర్లకు అండగా ఉంటామంటూ కాకినాడలో తీర్మానం చేస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు)/కాకినాడ సిటీ: వలంటీర్ల వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. పవన్ దిష్టి బొమ్మ దహనాలు, ర్యాలీలు నిర్వహించి వలంటీర్లు తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు పవన్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు మండలాల్లో వలంటీర్లు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రం మర్రిపాడులోని మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఏఎస్‌పేటలో వలంటీర్లు ధర్నా నిర్వహించారు. సైనికుల్లా పనిచేస్తున్న వలంటీర్లను కించపరచడం సరికాదని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా నందలూరులో పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు.

పవన్ వ్యాఖ్యలపై 'తూర్పు' జెడ్పీ ఆగ్రహం

వలంటీర్ల వ్యవస్థపై కొందరు వ్యక్తులు పనిగట్టుకొని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఖండించింది. ప్రజలకు సేవలను అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ, వలంటీర్లకు ప్రజాప్రతినిధులంతా అండగా ఉండే విధంగా జెడ్పీ సమావేశంలో తీర్మానం ఆమోదించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన ప్రతిపాదనను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులంతా వలంటీర్లకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని నిర్ణయించారు.

వలంటీర్లలో క్రిమినల్ శక్తులున్నాయి

- తణుకు వారాహి యాత్రలో పవన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు/తణుకు టౌన్: వలంటీర్లలో కొన్ని క్రిమినల్ శక్తులున్నాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో అనేక వ్యవస్థలు ఉన్నప్పుడు వలంటీర్లతో సమాంతర వ్యవస్థ నడపటం ఎందుకని ఆయన ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన వారాహి విజయయాత్రలో పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా ముఖ్యమంత్రిని ఏకవచనంతో సంబోధిస్తూ అడ్డగోలుగా విమర్శలు చేశారు. ఆయన ఏమన్నారంటే..

వలంటీర్లతో నా దిష్టిబొమ్మలు ఎన్నయినా తగలబెట్టించుకో.. నేను వెనకడుగు వేసేదే లేదు. మీకు తెలియకుండా 2.50 లక్షల మంది వలంటీర్లు తప్పు చేస్తున్నారు. జగన్ అధికారంలో లేనప్పుడు రేషన్, పింఛను ఆగిపోయాయా? పంచాయతీ నిధుల నుంచి రూ.11 కోట్లు వలంటీర్లకు, రూ.1,500 కోట్లు సచివాలయాలకు ఎలా ఇస్తావు? అవన్నీ సీఎం ప్రైవేట్ సైన్యం. సచివాలయాలకు నిధులిచ్చి పంచాయతీలకు నిధులివ్వలేదు. దీనిపై నేను కోర్టుకెళ్తా.

మద్యం ప్రియులకు అన్యాయం..

రాష్ట్రంలో గంజాయి అత్యధికంగా స్మగ్లింగ్ జరుగుతోందని నివేదికలు చెబుతున్నాయి. అలాగే, మద్యం మత్తులో 52 వేల మంది మహిళలపై నేరాలు జరిగాయని పార్లమెంట్‌లో చెప్పారు.. అసలు, నాణ్యత లేకుండా నాసిరకం మద్యం అమ్ముతున్నారు. మద్యం ధరలను పెంచేసి ఈ ప్రభుత్వం మద్యపాన ప్రియులకు చాలా అన్యాయం చేస్తోంది. రూ.60 ఉన్న దానిని రూ.160కి పెంచి వారికి మద్యాన్ని దూరం చేశారు. గతంలో లేని చెత్త పన్నును వేసి సామాన్యులపై భారం మోపారు. ఇక భవన నిర్మాణ కార్మికుల సెస్ నిధులను పక్కదారి పట్టించారు. నేను నెల్లూరులో 4వ తరగతి చదివే రోజుల్లో నిత్యావసరాలు కొనుగోలు చేశా, ఇప్పుడు చాలా ఎక్కువగా పెరిగిపోయాయి. అన్నవరంలో పురోహితులను వేలం పెట్టారు.. అది రాజ్యాంగ విరుద్ధమని మీకు తెలుసా? క్రైస్తవ, ముస్లిం మతాల్లో మీరు ఇలా చేయగలరా? దీనిపై కోర్టులో సవాల్ చేస్తా. ఇస్లాం సమాజంలో లేని ఈ ఆప్షన్ హిందూ సమాజానికి ఎందుకు?

జనసేన పార్టీని మూసేస్తారా?

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ప్రశ్న



సాక్షి, అమరావతి: 'మహిళా కమిషన్‌ను టార్గెట్‌గా చేసుకుని జనసేన కార్యకర్తలు కొందరు సోషల్ మీడియాలో అత్యంత దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు. రాజకీయ పార్టీల నేతలు, మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యంగా మాట్లాడుతున్నారు. దానికి బాధ్యత తీసుకుని జనసేన పార్టీని మూసేస్తావా పవన్.. ఇందుకు పవన్ బాధ్యుడు అంటే ఒప్పుకుంటావా?' అని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ప్రశ్నించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం 'మహిళ ఆత్మగౌరవ దినోత్సవం (ఉమెన్ డిగ్నిటీ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ ఒకరిద్దరు వలంటీర్లు తప్పు చేస్తే మొత్తం ఆ వ్యవస్థనే రద్దు చేయాలనడం సరికాదన్నారు. తప్పు చేసిన వారిపై ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకుందని వివరించారు. మహిళా కమిషన్‌ను కూడా గౌరవించని పవన్ హేళనగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇక 'క్యాష్‌లెస్' చెక్‌పోస్టులు

- రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో యూపీఐ పేమెంట్స్‌కు శ్రీకారం
- నగదు లావాదేవీలు బంద్
- అన్ని చెక్‌పోస్టుల్లో నూతన విధానం అమలు
- అవినీతి కట్టడికి రవాణాశాఖ కొత్త ప్రయోగం



చిత్తూరులోని రవాణా శాఖ చెక్ పోస్టు వద్ద ఆన్‌లైన్ పేమెంట్ చేస్తున్న వాహనదారులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: రవాణాశాఖలో ఇప్పటికే అన్ని రకాల లైసెన్సులను ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్న రవాణాశాఖ.. ఇక సరిహద్దుల్లో కూడా ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతర్రాష్ట్ర రవాణా చెక్‌పోస్టులను ఇక క్యాష్‌లెస్‌గా మార్చేందుకు శ్రీకారం చుట్టింది. రవాణాశాఖకు చెందిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో యూపీఐ పేమెంట్స్ విధానాన్ని ప్రారంభించింది. తద్వారా చెక్‌పోస్టుల్లో అవినీతిని కట్టడికి ఉపయోగపడుతుందని రవాణాశాఖ అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో ఈ విధానం అమల్లోకి వచ్చింది. అన్ని చెక్‌పోస్టుల్లో క్యాష్‌లెస్ విధానం అమలు కావడంతో అవినీతికి అడ్డుకట్ట పడుతుందని రవాణాశాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

అన్ని ట్యాక్స్‌లూ ఆన్‌లైన్‌లోనే..

వాస్తవానికి రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. క్యాష్‌లెస్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయాలని రవాణాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. బోర్డర్ ట్యాక్స్, టెంపరరీ పర్మిట్ ట్యాక్స్, వలంటరీ ట్యాక్స్, కంపౌండింగ్ ఫీజు ఇలా అన్నింటినీ అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయడం ద్వారా చెల్లించే వెసులుబాటు కల్పించారు. అంతేకాకుండా హెచ్‌టీ టీపీఎస్://ఏపీఆర్ టీఏసిటిజెన్ డాట్ ఈ ప్రగతి డాట్ ఓఆర్‌జీ ద్వారా చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్ విధానంతో అవినీతి కట్టడితో పాటు చెక్‌పోస్టుల వద్ద లైన్లలో నిలబడి చెల్లించే బాధ తప్పనుంది. తద్వారా వాహనాలను ఎక్కువ సమయం నిలిపి ఉంచే సమయం కూడా తగ్గడం ద్వారా వాహన రవాణా ప్రయాణ సమయం కూడా తగ్గనుందని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రవాణాశాఖ చెక్‌పోస్టులివే..

రాష్ట్రానికి అటు కర్ణాటక, ఇటు తమిళనాడు, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు మధ్య అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను రవాణాశాఖ నిర్వహిస్తోంది. మొత్తం 15 చెక్‌పోస్టులు.. ఇచ్ఛాపురం, జీలుగుమిల్లి, పంచలింగాల, పెనుకొండ, సున్నిపెంట, తిరువూరు, గరికపాడు, పలమనేరు, తడ, బీవీ పాలెం, రేణిగుంట, నరహరిపేట, దాచేపల్లి, మాచర్ల, బెండపూడి ప్రాంతాల్లో రవాణాశాఖ నిర్వహిస్తోంది.

సీఎం ఆదేశాలతో

చెక్‌పోస్టుల వద్ద క్యాష్‌లెస్ విధానాన్ని ప్రవేశపెట్టాం. ఇక నుంచి చెక్‌పోస్టుల్లో నగదు లావాదేవీలను పూర్తిగా నిలిపివేశాం. అవినీతిరహిత పరిపాలన దిశగా ముఖ్యమంత్రి ఆదేశాలతో ఎటువంటి మధ్యవర్తులకు తావులేకుండా ఈ విధానం తోడ్పడనుంది. ట్రాఫిక్ ఇబ్బందులకు కొత్త విధానంతో చెక్ పడుతుంది.

– మనీష్‌కుమార్ సిన్హా, రవాణాశాఖ కమిషనర్

అబద్ధాలతో ఉనికి చాటుకుంటున్నారు

- అచ్చెన్నాయుడు ఆరోపణలపై మంత్రి బొత్స కౌంటర్



అరసవల్లి: గ్రామగ్రామాన ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఎలాగైనా అడ్డుకోవాలనే టీడీపీ అచ్చెన్నాయుడు ఇష్టానుసారం అబద్ధాలను మాట్లాడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. డీఆర్సీ సమావేశానికి శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బటన్ నొక్కుతున్నా డబ్బులు పడటం లేదంటూ పనికిమాలిన ప్రచారాలు చేస్తున్న అచ్చెన్నాయుడు భవిష్యత్‌కు గ్యారంటీ లేక అలా వాగుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు చేసిన ఒక్క మంచి పనేంటో అచ్చెన్నాయుడు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు దోపిడీ చేసి, ఇప్పుడు నేరుగా ప్రజలకు లబ్ధిచేస్తున్న జగనన్న ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. నిజంగా ఎవరికైనా లబ్ధి అందకపోతే.. అలాంటి వారి కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా.. ఆఖరికి తపస్సు చేసినా కూడా చంద్రబాబు ఈ రాష్ట్రానికి మరి సీఎం కాలేరని చెప్పారు. ఎలాగోలా ప్రజల దృష్టి మార్చాలని తెగ ప్రయత్నాలు చేస్తున్నారని, ఎన్ని కుట్రలు పన్నినా, చంద్రబాబుకు అధికారం దక్కదని ఆయన స్పష్టం చేశారు. మంత్రితోపాటు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులున్నారు.

సినిమా





హాలీవుడ్.. షట్ డౌన్

- రోడ్డెక్కిన రచయితలు.. నటీనటులు
- అరవయ్యేళ్ల తర్వాత నటీనటులు, రచయితల మరో సమ్మె


ప్రపంచవ్యాప్తంగా సినిమా పరిశ్రమకు 'పెద్దన్న' అని హాలీవుడ్‌కి పేరు. భారీ బడ్జెట్ చిత్రాలతో, అత్యున్నత సాంకేతిక విలువలతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంది హాలీవుడ్. ఇప్పుడు ఆ హాలీవుడ్ నిరసనలతో భగభగమంటోంది. సమ్మె సైరన్ తప్ప యాక్షన్.. సౌండ్‌లాంటి షూటింగ్ లొకేషన్లో వినిపించే మాటలు వినిపించడంలేదు. నటీనటులు మేకప్ వేసుకోవడంలేదు.. రచయితలు కలం మూత తెరవడంలేదు. దాంతో షూటింగులు నిలిచిపోయాయి. కరోనా టైమ్‌లో వెలవెలబోయినట్లు స్టూడియోలు కళ తప్పాయి. ఇన్నాళ్లుగా సమ్మె చేస్తూ వచ్చిన రచయితల సంఘానికి నటీనటుల సంఘం మద్దతు తెలిపింది. 'వేతనాలు పెంచండి... గౌరవించండి... సౌకర్యాలు సమకూర్చండి..' అంటూ పలు నినాదాలతో సమ్మె కొనసాగిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళదాం..

హాలీవుడ్ చిత్ర పరిశ్రమని డబుల్ స్ట్రయిక్ కుదిపేస్తోంది. ఓ వైపు కొన్నాళ్లుగా 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. తాజాగా 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెకు పిలుపునిచ్చింది. తాము రాసే టీవీ షోలు, ఓటీటీ సిరీస్‌ల నుంచి మంచి లాభాలు ఆర్జిస్తున్న నిర్మాణ సంస్థలు తమకు కనీస వేతనాలు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో పదకొండు వారాలుగా రచయితలు సమ్మె చేస్తున్నారు. ఇప్పుడు హాలీవుడ్ నటీనటులు సైతం రైటర్స్ సమ్మెలో చేరాలని నిర్ణయించుకున్నారు. నిర్మాణ సంస్థలు, ఓటీటీలతో జరిపిన చర్చలు విఫలం కావడంతో భారతీయ కాలమానం ప్రకారం గురువారం రాత్రి సమ్మె ఆరంభమైంది. దీంతో షూటింగ్‌లు ఆగాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) హాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కృత్రిమ మేధస్సుతో పని చేసే ఓ యాంకర్‌ని ఇటీవలే పరిచయం చేశారు. ఈ సెగ హాలీవుడ్‌కు బాగానే తాకింది. కృత్రిమ మేధస్సుతో ముప్పు పొంచి ఉందని, తమ భవిష్యత్తుకి భరోసా ఇవ్వడంతో పాటు జీతాలు పెంచాలని, సరైన పని నిబంధనలను కల్పించాలని 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' ఆందోళనలకు పిలుపునిచ్చింది. 'ఏ' లిస్ట్ యాక్టర్స్‌తో సహా 1,60,000 మంది నటీనటులకు 'స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్–అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్ట్స్' ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రధాన నిర్మాణ స్టూడియోలతో జరిగిన చర్చలు విఫలం కావడంతో 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' నిరవధిక సమ్మెకు దిగింది. 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా', 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెతో ప్రస్తుతం కొనసాగుతున్న హాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షో షూటింగ్స్ ఎక్కడికక్కడ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.







'ఓపెన్ హైమర్' ప్రీమియర్ నుండి నిష్క్రమణ...

క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ ఫిల్మ్ 'ఓపెన్ హైమర్' ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా లండన్‌లో గురువారం ఈ సినిమా ప్రీమియర్ వేశారు. అయితే గురువారం అర్ధరాత్రి 'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మె ప్రారంభం కావడంతో 'ఓపెన్ హైమర్' ప్రీమియర్ నుండి యాక్టర్స్ రాబర్ట్ డౌనీ జూనియర్, సిలియన్ మర్ఫీ, మాట్ డామన్, ఎమిలీ బ్లంట్ వంటి స్టార్స్‌తో సహా పలువురు నటీనటులు వెళ్లిపోయినట్లు హాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. హాలీవుడ్ ప్రముఖ సంస్థలు 'పారామౌంట్, వార్నర్ బ్రదర్స్, డిస్నీ, నెట్‌ఫ్లిక్స్' వంటి వాటి ప్రధాన కార్యాలయాల వద్ద శుక్రవారం ఉదయం పికెటింగ్ (సమ్మె) ప్రారంభించారని టాక్.

ఎమ్మీ, ఆస్కార్ అవార్డ్ వాయిదా?

హాలీవుడ్‌లో మొదటిసారి 1960లో నటుడు రోనాల్డ్ రీగన్ నేతృత్వంలో రచయితల సంఘం, నటీనటుల సంఘం కలిసి డబుల్ స్ట్రైక్ చేశాయి. అలానే 1980లో స్క్రీన్ యాక్టర్స్ సమ్మె మూడు నెలల పాటలు జరిగింది. మళ్లీ 63 ఏళ్లకు ఇప్పుడు రచయితల, నటీనటుల సంఘం కలసి డబుల్ స్ట్రైక్ చేస్తుండటం విశేషం. ఈ సమ్మె ఇలాగే కొనసాగితే పెద్ద చిత్రాల విడుదల వాయిదా పడే పరిస్థితి. అలాగే సెప్టెంబర్ 18న జరగనున్న ఎమ్మీ అవార్డ్స్, టెలివిజన్ వెర్షన్ ఆస్కార్ అవార్డులు కూడా నవంబర్ లేదా వచ్చే ఏడాదికి వాయిదా పడే అవకాశం ఉందని హాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి.

సమ్మె బాధాకరం

'ది స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్' సమ్మెను స్టూడియోలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 'అలయన్స్ ఆఫ్ మోషన్ పిక్చర్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్స్' తప్పుబట్టింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. "సినిమాలు, టీవీ కార్యక్రమాలకు జీవం పోసే నటీనటులు లేకుండా స్టూడియోలు పని చేయవు. కాబట్టి సమ్మె అనేది ఆశించిన ఫలితం ఇవ్వదు. పరిశ్రమపై ఆధారపడిన వేల మంది కార్మికుల ఆర్థిక ఇబ్బందులకు దారి తీసే మార్గాన్ని యూనియన్ ఎంచుకోవడం బాధాకరం" అని పేర్కొంది.

యంత్రాలు రీప్లేస్ చేస్తాయి!

- సాగ్–ఆఫ్రా అధ్యక్షురాలు ఫ్రాన్ డ్రెస్చెర్

''మనందరం ఇప్పుడు ఏకతాటిపై నిలవకపోతే కచ్చితంగా మనల్ని యంత్రాలు రీప్లేస్ చేస్తాయి'' అన్నారు సాగ్–ఆఫ్రా (సీనియర్ యాక్టర్స్ గిల్డ్–అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్ట్స్) అధ్యక్షురాలు ఫ్రాన్ డ్రెస్చెర్. కొన్ని వారాలుగా సమ్మె చేస్తున్న డబ్ల్యుజీఏ (రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా)కి పూర్తి మద్దతు ప్రకటించారామె. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ''నటీనటులు అణచివేతకు గురవుతున్నారు. వారికి తగిన గౌరవం దక్కడంలేదు. చిత్రపరిశ్రమలో ఏం జరుగుతుందనేది అందరికీ చాలా ముఖ్యం. ఎందుకంటే ఇక్కడ ఏం జరుగుతుందో మిగతా అన్ని రంగాల్లోని కార్మికులకు అదే జరుగుతోంది. యజమానులు అత్యాశకు పోతున్నారు. యంత్రాలను నడిపించే సహాయకులను (కార్మికులను ఉద్దేశించి) మర్చిపోతున్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించడంలేదు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం. సీఈవోలకు ఏకంగా వందల మిలియన్ల డాలర్లలో అధిక వేతనాలు ఇవ్వడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ బాధితులు ఎవరంటే మేమే (కార్మికులు). వ్యాపారంలో ఉన్నవాళ్లు మా పట్ల వ్యవహరిస్తున్న తీరు షాకింగ్‌గా ఉంది'' అని ఘాటుగా స్పందించారు ఫ్రాన్ డ్రెస్చెర్.

తగ్గేదే లే...

"ఏఐ వల్ల ముప్పే" అంటూ సమ్మెలో భాగంగా నినాదాలు చేస్తున్నారు. ఇప్పటికే ఏఐ న్యూస్ రీడర్స్ వచ్చిన నేపథ్యంలో ఏఐ వల్ల చిత్ర పరిశ్రమలోనూ పెను మార్పు సంభవించే అవకాశం ఉందని హాలీవుడ్ కళాకారులు వాపోతున్నారు. అయితే ఏఐ వినియోగాన్ని తగ్గించాలన్న కళాకారుల డిమాండ్‌ని నిర్మాణ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. అలాగే నటీనటుల వేతనాలు పెంపుకు కూడా నిర్మాతలు సుముఖత వ్యక్తపరచడంలేదన్నది హాలీవుడ్ టాక్. ఈ నేపథ్యంలో నటీనటులు కూడా తమ డిమాండ్లను ఆమోదించేవరకూ సమ్మె కొనసాగించే తీరాలనీ, తగ్గేదే లే అనే పట్టుదలతో ఉన్నారనీ సమాచారం.

మాల్దీవులకు హాయ్



రజనీ కాంత్

వరుస షూటింగ్‌లతో బిజీ బిజీగా గడిపిన హీరో రజనీ కాంత్ హాలిడే ట్రిప్ కోసం మాల్దీవులు వెళ్లారు. చెన్నై నుంచి మాల్దీవుల రాజధాని మాలె వరకు శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్‌లో రజనీ ప్రయాణించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. ఓ ఫొటోలో ఎయిర్ హోస్టెస్ ఇచ్చిన ఫ్లవర్ బొకేతో నవ్వుతూ కనిపించిన రజనీ కాంత్, మరో ఫొటోలో బ్యాగ్ పట్టుకుని, కళ్ల జోడు పెట్టుకుని స్టైలిష్‌గా ఉన్నారు. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్' సినిమాలో తన పాత్ర (మొయిద్దీన్ భాయ్) షూటింగ్‌ని పూర్తి చేశారాయన. ఇప్పుడు కొంచెం విరామం దొరకడంతో రిఫ్రెష్ అయ్యేందుకు మాల్దీవులకు వెళ్లారు రజనీకాంత్. కాగా ఆయన నటించిన 'జైలర్' సినిమా ఆగస్టు 10న విడుదల కానుంది.

హత్య చేసిందెవరు?



విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని నటించిన తాజా చిత్రం 'హత్య'. బాలాజీ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రితికా సింగ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. లోటస్ పిక్చర్స్‌తో కలిసి ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్‌పై కమల్ బోరా, జి. ధనుంజయన్, ప్రదీప్ .బి, పంకజ్ బోరా, విక్రమ్ కుమార్, తాన్ శ్రీ దొరైసింగం పిళ్లై, సిద్ధార్థ్ శంకర్, ఆర్‌వీఎస్ అశోక్ కుమార్ నిర్మించిన 'హత్య' ఈ నెల 21న రిలీజవుతోంది. సురేశ్ ప్రొడక్షన్స్, ఏషియన్ సినిమాస్ సంయుక్తంగా తెలుగులో విడుదల చేస్తున్నాయి. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో విజయ్ ఆంటోని డిటెక్టివ్ పాత్ర చేశారు. ఈ క్యారెక్టర్‌లో ఆయన సరికొత్త లుక్‌లో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

బీట్ బాగుంది



శేఖర్ మాస్టర్

సాయికుమార్, ఆదిత్యా ఓం, ఐశ్వర్యా రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలి రాజపుత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నాతో నేను'. శాంతి కుమార్ తూర్లపాటి దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. సత్య కశ్యప్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రాజంపేట రాణిని...' అంటూ సాగే పాటని నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ విడుదల చేశారు. శాంతి స్వరూప్ సాహిత్యం అందించిన ఈ పాటను గీతామాధురి ఆలపించారు. ఈ సందర్భంగా శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ– ''ఈ మాస్ బీట్ పాట సంగీతం, కొరియోగ్రఫీ చాలా బావున్నాయి. సినిమా మంచి హిట్ కావాలి'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	502	66,061
నిఫ్టీ ▲	151	19,565

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	14,158	▲	19
డోజోన్స్	34,525	▲	130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,435	▼	6
డాక్స్	16,105	▼	36
షాంఘై	3,237	▲	1
నికాయ్	32,319	▲	28

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,338	▲	9
బంగారం (99.5 స్వచ్ఛత)	59,100	▲	9
వెండి (కేజీ)	74,979	▲	1,387

ఎస్‌బీఐ రుణ రేటు పెంపు

5 బేసిస్ పాయింట్ల పెరుగుదల

ముంబై: బ్యాంకింగ్ దిగ్గజం– స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్ఆర్) రుణ రేటును అన్ని కాలపరిమితులపై స్వల్పంగా 5 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) మేర పెంచింది. పెరిగిన రేటు జూలై 15 నుంచి అమల్లోకి వస్తుంది. ఎస్‌బీఐ వెబ్‌సైట్ ప్రకారం, ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణ రేట్లు 8 శాతం నుంచి 8.75 శాతం శ్రేణిలో ఉన్నాయి. ఎంసీఎల్ఆర్ అనేది ఒక బ్యాంకు వినియోగదారులకు ఇచ్చే రుణాల ప్రాథమిక కనీస రేటు. తాజా ఎస్‌బీఐ రుణ రేటు పెంపు రుణ గ్రహీతలపై ఆ మేరకు ఈఎంఐ భారం (ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన) పెరగనుంది. తాజా నిర్ణయం ప్రకారం...

- ఏడాది రేటు 8.50 శాతం నుంచి 8.55 శాతానికి పెరుగుతుంది.
- ఓవర్‌నైట్ రేటు 8 శాతంగా ఉంటుంది. నెల, మూడు నెలల రేటు 8.15 శాతం చొప్పున అమలవుతాయి.
- ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.45 శాతంగా ఉంటుంది.
- రెండేళ్ల ఎంసీఎల్ఆర్ 8.65%కి చేరుతుంది.
- మూడేళ్ల రేటు 8.75 శాతంగా ఉంటుంది.

స్కూట్ ఎయిర్‌లైన్స్ ప్రత్యేక ఆఫర్లు



హైదరాబాద్: సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ)లో భాగమైన స్కూట్ నెట్‌వర్క్ తాజాగా చౌక ఆఫర్లను ప్రకటించింది. హైదరాబాద్, వైజాగ్ సహా వివిధ నగరాల నుంచి విదేశాల్లోని 20 ప్రాంతాలకు ప్రయాణించేందుకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొంది. రూ. 6,200 నుంచి చార్జీలు మొదలవుతాయని వివరించింది. హైదరాబాద్ నుంచి పెర్త్ (ఆస్ట్రేలియా)కు రూ. 12,900 నుంచి, వైజాగ్ నుంచి సెబూ (ఫిలిప్పీన్స్)కు రూ. 11,900 నుంచి వన్‌–వే చార్జీలు (పన్నులు సహా) ప్రారంభమవుతాయని స్కూట్ తెలిపింది. ఈ సేల్ జూలై 18 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవధిలో బుక్ చేసుకున్న టికెట్లపై ప్రాంతాన్ని బట్టి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది.

రాకెట్ స్పీడుతో మార్కెట్ ర్యాలీ

- ఇంట్రాడే, ముగింపుల్లోనూ కొత్త రికార్డులు
- సూచీల ర్యాలీకి ఐటీ షేర్ల అండ
- తొలిసారి 66,000పైకి సెన్సెక్స్
- 19,500 ఎగువన నిఫ్టీ



ముంబై: చంద్రుడి వైపు విజయవంతంగా ప్రయాణిస్తున్న ఇస్రో చంద్రయాన్ లాగా.., దేశీయ స్టాక్ సూచీలూ ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నాయి. సానుకూల ప్రపంచ సంకేతాల అండతో శుక్రవారమూ సూచీలు ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు సృష్టించాయి. విదేశీ నిధుల వెల్లువ, ఐటీ రంగ షేర్లలో ర్యాలీ సెంటిమెంట్‌ను మరింత బలోపేతం చేశాయి. భారత టోకు ధరల ద్రవ్యోల్బణం మూడోనెలా దిగిరావడం ఇన్వెస్టర్లకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఫలితంగా తొలిసారి సెన్సెక్స్ 66,000 స్థాయిపైనా, నిఫ్టీ 19,500 ఎగువన ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు.., ఆఖరి గంట కొనుగోళ్లతో ఒక్కసారిగా సరికొత్త శిఖరాల వైపు పరుగులు తీశాయి. సెన్సెక్స్ ఉదయం 216 పాయింట్ల లాభంతో 65,775 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 601 పాయింట్లు పెరిగి 66,160 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసి చివరికి 502 పాయింట్ల లాభంతో 66,061 వద్ద ముగిసింది. నిఫ్టీ 79 పాయింట్లు పెరిగి 19,493 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్‌లో 181 పాయింట్లు ఎగసి 19,595 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది. మార్కెట్ ముగిసే సరికి 151 పాయింట్ల లాభంతో 19,565 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లకు అధిక డిమాండ్ లభించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. వినిమయ, కన్జూమర్, విద్యుత్ రంగాల షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు నష్టపోయి 82.16 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 781 పాయింట్లు, నిఫ్టీ 233 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జువెలరీ రిటైల్ సంస్థ సెన్‌కో గోల్డ్ షేరు తొలిరోజే భారీ లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.317)తో పోలిస్తే 36% ప్రీమియంతో రూ.431 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 40% దూసుకెళ్లి రూ.444 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 28% లాభంతో రూ.405 వద్ద ముగిసింది.
- ట్రేడింగ్‌లో ఐటీ షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. సెన్సెక్స్ 30 షేర్ల జాబితాలో తొలి అయిదు ఈ రంగానివే కావడం విశేషం. టీసీఎస్ (5%), టెక్ మహీంద్రా (4.50%), ఇన్ఫోసిస్ (4.50%), హెచ్‌సీఎల్‌టెక్(4%), విప్రో (3%) షేర్లు రాణించాయి.

ఉత్కర్ష్ ఐపీవో సూపర్ హిట్

ప్రైవేట్ రంగ సంస్థ ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్ సాధించింది. ఇష్యూ చివరి రోజు శుక్రవారానికల్లా 102 రెట్లు అధికంగా స్పందన లభించింది. బ్యాంక్ 12.05 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. దాదాపు 1,228.5 కోట్ల షేర్ల కోసం బిడ్స్ వెల్లువెత్తాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 125 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 72 రెట్లు అధికంగా దరఖాస్తు చేయడం గమనార్హం!

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల జారీ

మెగా విలీనంలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 311 కోట్లకుపైగా కొత్త షేర్లను జారీ చేసింది. ప్రతీ 25 షేర్లకుగాను 42 బ్యాంక్ షేర్లను తాజాగా కేటాయించింది. వెరసి రూ. 1 ముఖ విలువగల మొత్తం 3,11,03,96,492 బ్యాంక్ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు లభించాయి. ఇవన్నీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టవుతాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది.

టోకు ధరలు మూడోనెలా మైనస్‌లోనే..

- జూన్‌లో మైనస్ 4.12 శాతంగా ప్రతి ద్రవ్యోల్బణం
- ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి
- ఆహార ఉత్పత్తులు, ఇంధన, ప్రాథమిక లోహాల ధరలు డౌన్



న్యూఢిల్లీ: ఆహార ఉత్పత్తులు, ఇంధనం, ప్రాథమిక లోహాల ధరలు తగ్గుదల ప్రభావం మొత్తంగా టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) క్షీణతకు దారితీస్తోంది. క్రూడ్ పెట్రోలియం, సహజ వాయువు, టెక్స్‌టైల్స్ ధరలు కూడా జూలై తగ్గుదలను నమోదుచేసుకున్నాయి. ఆయా అంశాల నేపథ్యంలో డబ్ల్యూపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం జూన్‌లో అసలు పెరుగుదల లేకపోగా మైనస్ 4.12 శాతంగా నమోదయ్యింది. ఇలాంటి పరిస్థితిని ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. గత ఏడాది జూన్ నెల్లో హై బేస్ ఎఫెక్ట్ (16.23 శాతం) కూడా తాజా ప్రతిద్రవ్యోల్బణం పరిస్థితికి ఒక కారణం. ఈ తరహా పరిస్థితి నెలకొనడం వరుసగా ఇది మూడవ నెల కావడం గమనార్హం. ఇక ఇంతటి స్థాయిలో ప్రతిద్రవ్యోల్బణం ఎనిమిదేళ్ల కనిష్టం కావడం మరో విషయం. 2015 అక్టోబర్లో మైనస్ 4.76 ప్రతిద్రవ్యోల్బణం రికార్డయ్యింది. మేలో 4.3 శాతం ఉన్న వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 4.8 శాతానికి పెరిగిన నేపథ్యంలోనే టోకు ధరలు భారీగా తగ్గడం గమనార్హం. అయితే ఆర్థికవ్యవస్థకు కీలకమైన రెపో (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5 శాతం) రేటు నిర్ణయానికి సెంట్రల్ బ్యాంక్ వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్నే ప్రామాణికంగా తీసుకునే సంగతి తెలిసిందే.

ఎగుమతులు భారీ పతనం

- జూన్‌లో 22 శాతం డౌన్
- మూడేళ్లలో తీవ్ర స్థాయి
- విలువలో 32.97 బిలియన్ డాలర్లు
- దిగుమతులూ 17.48% క్షీణత
- వాణిజ్యలోటు 20 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మందగమన ప్రభావం ముఖ్యంగా అమెరికా, యూరోప్ మార్కెట్ల నిరాశావాద ధోరణి భారత్ వస్తు ఎగుమతులు–దిగుమతులపై ప్రభావం చూపుతోంది. జూన్‌లో వస్తు ఎగుమతులు 22 శాతం క్షీణించి 32.97 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గడచిన మూడేళ్లలో (కరోనా సంక్షోభ సమయం 2020 మే నెల్లో 36.47 శాతం క్షీణత) ఇంత స్థాయిలో వస్తు ఎగుమతుల పతనం ఇదే తొలిసారి. ఇక దిగుమతులు కూడా 17.48 శాతం క్షీణించి 53.10 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు జూన్‌లో 20.13 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

తొలి త్రైమాసికంలో క్షీణతే..

ఇక ఆర్థిక సంవత్సరం తొలి 3 నెలల్లో (ఏప్రిల్, మే, జూన్) చూస్తే వస్తు ఎగుమతులు 15.13 శాతం క్షీణించి 102.68 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 12.67%క్షీణించి 160.28 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వెరసి వాణిజ్యలోటు 57.6 బిలియన్ డాలర్లుగా ఉంది.

విభాగాల వారీగా...

- జూన్‌లో చమురు దిగుమతుల విలువ 33.8 శాతం తగ్గి 12.54 బిలియన్ డాలర్లుగా ఉండగా, ఏప్రిల్–జూన్ మధ్య 18.52 శాతం క్షీణతతో 43.4 బిలియన్ డాలర్లుగా ఉంది.
- పసిడి దిగుమతులు జూన్‌లో 82.38 శాతం పెరిగి 5 బిలియన్ డాలర్లకు చేరింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికాన్ని చూస్తే, 7.54 శాతం తగ్గి 9.7 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- జూన్‌లో వెండి దిగుమతులు 94.36 శాతం పడిపోయి 0.79 బిలియన్ డాలర్లకు చేరాయి.
- జూన్ ఎగుమతులకు సంబంధించి 30 కీలక రంగాల్లో 21 క్షీణత నమోదుచేసుకున్నాయి. వీటిలో పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్, రెడీమేడ్ దుస్తులు, ఇంజనీరింగ్, రసాయనాలు, రత్నాభరణాలు, తోలు, మెరైన్ ఉత్పత్తులు ఉన్నాయి.
- ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతులు జూన్‌లో 45.36% పెరిగి 2.43%గా నమోదయ్యాయి. ఏప్రిల్–జూన్‌లో ఈ ఎగుమతులు 47% పెరిగి 6.96 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

రూ. 8,200 కోట్లతో మేఘా ఈవీ ప్లాంటు!

బీవైడీతో కలిసి ఏర్పాటు యోచన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంటు ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. చైనాకు చెందిన బీవైడీ భాగస్వామ్యంలో తెలంగాణలో ఈ ఫెసిలిటీని స్థాపించాలని నిర్ణయించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే ప్లాంటుకు కావాల్సిన స్థలం, ఇతర సౌకర్యాల కోసం తెలంగాణ ప్రభుత్వాన్ని ఎంఈఐఎల్, బీవైడీ సంప్రదించనున్నాయి. ప్రతిపాదిత ప్రణాళిక కార్యరూపం దాలిస్తే ప్లాంటు కోసం ఇరు సంస్థలు కలిసి సుమారు రూ.8,200 కోట్లు వెచ్చించనున్నాయి. మేఘా అనుబంధ కంపెనీ అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఇప్పటికే బీవైడీ సాంకేతిక భాగస్వామ్యంలో ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేస్తోంది. అలాగే తెలంగాణలో ఎలక్ట్రిక్ బస్‌ల తయారీకై 150 ఎకరాల స్థలాన్ని ఒలెక్ట్రా కొనుగోలు చేసింది. అత్యాధునిక రీతిలో ఏటా 10,000 ఈ–బస్‌లను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యంతో ఇది రానుంది. ఎలక్ట్రిక్ టిప్పర్ల తయారీలోకి సైతం ఒలెక్ట్రా ఎంట్రీ ఇచ్చింది. తేలికపాటి వాణిజ్య వాహనాలు, త్రిచక్ర, ఇతర ఎలక్ట్రిక్ వాహనాలనూ పరిచయం చేయాలన్నది కంపెనీ ప్రణాళిక.

తుది దశలో టాటా–విస్ట్రాన్ డీల్



న్యూఢిల్లీ: యాపిల్ ఐఫోన్ల తయారీ సంస్థ విస్ట్రాన్‌కు చెందిన కర్ణాటక ప్లాంటును టాటా గ్రూప్ కొనుగోలు చేసే అంశం తుది దశలో ఉన్నట్లు సమాచారం. అనుబంధ సంస్థ టాటా ఎలక్ట్రానిక్స్ ద్వారా టాటా గ్రూప్ ఈ డీల్‌ను కుదుర్చుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్ పూర్తయితే యాపిల్ ఐఫోన్లను తయారు చేసే తొలి భారతీయ సంస్థగా టాటా నిలవనుంది. అలాగే, ఈ ప్లాంటులో ఐఫోన్లతో పాటు ఇతరత్రా కొత్త యాపిల్ ఉత్పత్తులను కూడా అసెంబుల్ చేసే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ప్రస్తుతం తైవాన్‌కు చెందిన విస్ట్రాన్‌తో పాటు ఫాక్స్‌కాన్, పెగాట్రాన్ వంటి సంస్థలు యాపిల్ ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో సింధు, లక్ష్య సేన్

యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం అమెరికాలో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 21–14, 21–12తో ప్రపంచ 30వ ర్యాంకర్ సుంగ్ షువో యున్ (దక్షిణ కొరియా)పై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 36వ ర్యాంకర్ గావో ఫాంగ్ జి (చైనా)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 1–3తో వెనుకబడి ఉంది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత యువతారలు లక్ష్య సేన్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ 21–8, 23–21తో జాన్ లూడా (చెక్ రిపబ్లిక్)పై, శంకర్ ముత్తుస్వామి 21–18, 21–23, 21–13తో మిషా జిల్బెర్మన్ (ఇజ్రాయెల్)పై గెలుపొందారు.



యశ్ ధుల్ సెంచరీ

యూఏఈ 'ఎ'పై భారత్ 'ఎ' విజయం

కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్–23 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు శుభారంభం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) 'ఎ' జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత 'ఎ' జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 176 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన భారత జట్టు 26.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ యశ్ ధుల్ (84 బంతుల్లో 108 నాటౌట్; 20 ఫోర్లు, 1 సిక్స్) వీరవిహారం చేశాడు. అజేయ సెంచరీతో భారత 'ఎ' జట్టును గెలిపించాడు. భారత జట్టు 41 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన దశలో నికిన్ జోస్ (53 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు)తో కలిసి యశ్ ధుల్ మూడో వికెట్‌కు అజేయంగా 138 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. అంతకుముందు యూఏఈ జట్టు 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 175 పరుగులు సాధించింది. హర్షిత్ రాణా 41 పరుగులిచ్చి 4 వికెట్లు, ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి 32 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు.

సౌత్ జోన్‌కు ఆధిక్యం

రాణించిన విద్వత్, హనుమ విహారి



విద్వత్

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ వెస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ జట్టు భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 129/7తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్ట్ జోన్ మరో 17 పరుగులు జోడించి మిగతా మూడు వికెట్లు కోల్పోయి 146 పరుగులవద్ద ఆలౌటైంది. సౌత్ జోన్ పేస్ బౌలర్ విద్వత్ కావేరప్ప 53 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. 67 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన సౌత్ జోన్ ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌత్ జోన్ జట్టు ఓవరాల్ ఆధిక్యం 248 పరుగులకు చేరుకుంది. కెప్టెన్ హనుమ విహారి (42; 7 ఫోర్లు), మయాంక్ అగర్వాల్ (35; 7 ఫోర్లు), రికీ భుయ్ (37; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

అల్‌కరాజ్‌తో జొకోవిచ్ 'ఢీ'

వింబుల్డన్ టోర్నీ సెమీఫైనల్స్‌లో వరుస సెట్‌లలో విజయం



జొకోవిచ్



అల్‌కరాజ్

లండన్: రికార్డుస్థాయిలో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం నొవాక్ జొకోవిచ్... కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం కార్లోస్ అల్‌కరాజ్... ఆదివారం జరిగే వింబుల్డన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో తలపడనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్) గంటా 50 నిమిషాల్లో 6–3, 6–3, 6–3తో ప్రపంచ మూడో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై... డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 2 గంటల 47 నిమిషాల్లో 6–3, 6–4, 7–6 (7/4)తో ఆరో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ)పై విజయం సాధించారు. జొకోవిచ్ తన కెరీర్‌లో 35వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరగా... అల్‌కరాజ్‌కిది రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కానుంది. అల్‌కరాజ్ గత ఏడాది యూఎస్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచాడు. సినెర్‌తో జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 25 సార్లు దూసుకొచ్చి 17 సార్లు పాయింట్లు గెలిచాడు. 33 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. తొమ్మిదోసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్ చేరిన జొకోవిచ్ ఏడుసార్లు విజేతగా నిలిచాడు. మెద్వెదెవ్‌తో జరిగిన మ్యాచ్‌లో అల్‌కరాజ్ నాలుగు ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 36 సార్లు దూసుకొచ్చి 28 సార్లు పాయింట్లు నెగ్గాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన ఈ స్పెయిన్ స్టార్ మెద్వెదెవ్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు.

జబర్ X వొండ్రుసోవా

నేడు వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్
సాయంత్రం గం. 6:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం





కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం నేడు వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆన్స్ జబర్ (ట్యునీషియా), మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) అమీతుమీ తేల్చుకోనున్నారు. 28 ఏళ్ల జబర్ గత ఏడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మరోవైపు ఓపెన్ శకంలో (1968 తర్వాత) వింబుల్డన్ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన 24 ఏళ్ల వొండ్రుసోవా కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడనుంది. 2019 ఫ్రెంచ్ ఓపెన్‌లో వొండ్రుసోవా ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. ముఖాముఖి రికార్డులో జబర్, వొండ్రుసోవా 3–3తో సమఉజ్జీగా ఉన్నారు. అయితే ఈ ఏడాది జబర్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ వొండ్రుసోవా గెలుపొందింది. నేడు వింబుల్డన్ ఫైనల్లో విజేతగా నిలిచిన ప్లేయర్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (రూ. 25 కోట్ల 29 లక్షలు), రన్నరప్ ప్లేయర్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (రూ. 12 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.

శాసించే స్థితిలో భారత్

- తొలి ఇన్నింగ్స్‌లో 421/5 డిక్లేర్డ్
- 271 పరుగుల భారీ ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 27/2



కోహ్లి

రోసీయు (డొమినికా): బ్యాటింగ్‌లో ఆధిక్యం, స్పిన్ బౌలింగ్‌తో ఆధిపత్యం ఇలా మూడో రోజు కూడా భారత్ హవానే కొనసాగింది. దీంతో తొలి టెస్టును శాసించే స్థితిలో టీమిండియా నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 312/2 శుక్రవారం మూడో రోజు ఆట ఆరంభించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 152.2 ఓవర్లలో 421/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. యశస్వి జైస్వాల్ (171; 16ఫోర్లు, 1 సిక్స్)కి జోసెఫ్ బౌలింగ్‌లో చుక్కెదురైంది. కోహ్లితో మూడో వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రహానే (3) విఫలమవగా... నింపాదిగా ఆడుతున్న కోహ్లి, జడేజా వచ్చాక అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీ క్రీజులో పాతుకుపోతున్న దశలో కోహ్లి (76; 5 ఫోర్లు) వెనుదిరిగాడు. అనంతరం జడేజా (37 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), ఇషాన్ (1 నాటౌట్) ఆచితూచి ఆడుతుంటే కెప్టెన్ రోహిత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. భారత్‌కు 271 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడి న విండీస్ టీ విరామ సమయానికి 2 వికెట్ల నష్టానికి 27 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఇంకా 244 పరుగులు చేయాలి.

పారుల్, తజిందర్‌లకు స్వర్ణ పతకాలు





బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజు భారత్‌కు మూడు పతకాలు లభించాయి. ఇందులో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం ఉన్నాయి. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో పారుల్ చౌదరీ విజేతగా నిలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పారుల్ 9 నిమిషాల 38.76 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సుధా సింగ్ (2013, 2017), లలితా బబర్ (2015) తర్వాత ఆసియా చాంపియన్‌షిప్‌లో 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో స్వర్ణం నెగ్గిన మూడో భారతీయ అథ్లెట్‌గా పారుల్ నిలిచింది. మహిళల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఉత్తరప్రదేశ్‌కే చెందిన 19 ఏళ్ల శైలీ సింగ్ రజత పతకం గెలిచింది. శైలీ సింగ్ 6.54 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచింది.

పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ తన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. పంజాబ్‌కు చెందిన 28 ఏళ్ల తజిందర్‌పాల్ ఇనుప గుండును 20.23 మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని గెల్చుకున్నాడు. బిలాల్ సాద్ ముబారక్ (ఖతర్), ఘరీబ్ అల్ జినకావి (కువైట్) తర్వాత ఆసియా చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండుసార్లు షాట్‌పుట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా తజిందర్‌పాల్ గుర్తింపు పొందాడు. మూడో రోజు పోటీల తర్వాత భారత్ ఐదు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో తొమ్మిది పతకాలతో మూడో స్థానంలో ఉంది.

ఆసియా క్రీడలకు భారత క్రికెట్ జట్ల ప్రకటన

మహిళల జట్టులో అనూష, అంజలి శర్వాణి... పురుషుల జట్టులో తిలక్ వర్మకు చోటు



అనూష



అంజలి



తిలక్ వర్మ

ముంబై: ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత మహిళల, పురుషుల టి20 క్రికెట్ జట్లను శుక్రవారం రాత్రి ప్రకటించారు. 15 మంది సభ్యులుగల భారత మహిళల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంజలి శర్వాణి, బారెడ్డి అనూషలకు టీమిండియాలో చోటు లభించింది. 15 మంది సభ్యులతో కూడిన భారత పురుషుల టి20 జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. హైదరాబాద్ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ టీమిండియాలోకి ఎంపికయ్యాడు. ఐపీఎల్ టి20 టోర్నీలో రాణించిన రింకూ సింగ్, జితేశ్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లకు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. ఆసియా క్రీడలు చైనాలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు జరుగుతాయి.

భారత మహిళల టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, దేవిక వైద్య, అంజలి శర్వాణి, టిటాస్ సాధు, రాజేశ్వరి గైక్వాడ్, మిన్ను మణి, కనిక అహూజా, ఉమా చెత్రి, బారెడ్డి అనూష.

భారత పురుషుల టి20 జట్టు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రాహుల్ త్రిపాఠి, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, షహబాజ్ అహ్మద్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్ కుమార్, శివమ్ మావి, శివమ్ దూబే, ప్రభ్‌సిమ్రన్ సింగ్.

డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు భారత్

ముంబై: స్వదేశంలో వన్డే ప్రపంచకప్ ముగిశాక భారత జట్టు బిజీ బిజీగా గడపనుంది. దక్షిణాఫ్రికాతో పూర్తిస్థాయి పర్యటన కోసం అక్కడికి బయల్దేరనుంది. డిసెంబర్, జనవరి నెలల్లో జరిగే ఈ పర్యటనలో టీమిండియా మూడు టి20లు, మూడు వన్డేలతో పాటు 'గాంధీ–మండేలా ట్రోఫీ' ఫ్రీడమ్ సిరీస్‌లో భాగంగా రెండు టెస్టులు కూడా ఆడుతుంది. ముందుగా డిసెంబర్ 10న తొలి టి20 (డర్బన్), 12న రెండో టి20 (కెబెర్హా), 14న ఆఖరి టి20 (జొహన్నెస్‌బర్గ్)లు జరుగుతాయి. అనంతరం 17న మొదటి వన్డే (జొహన్నెస్‌బర్గ్), 19న రెండో మ్యాచ్ (కెబెర్హా), 21న చివరి మ్యాచ్ (పార్ల్)తో పరిమిత ఓవర్ల సిరీస్ ముగుస్తుంది. టెస్టు సిరీస్‌లో తొలి టెస్టు డిసెంబర్ 26 నుంచి సెంచూరియన్‌లో మొదలవుతుంది. కేప్‌టౌన్‌లో జనవరి 3 నుంచి జరిగే రెండో టెస్టుతో సఫారీ పర్యటన ముగుస్తుంది.

ఆర్‌బీఐ క్విజ్ విజేతలు 'చిట్టివలస' విద్యార్థులు


విజేతలకు బహుమతులందిస్తున్న ఆర్‌బీఐ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఏపీ రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీ విజేతలుగా విశాఖకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిలిచారు. 26 జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను విశాఖలో నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖ జిల్లా చిట్టివలస జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలకు చెందిన చిరంజీవులు, జి.పవన్‌కుమార్, జేవీ కీర్తన్ విజేతలుగా నిలిచారు. ద్వితీయ స్థానంలో గుంటూరు జిల్లా విద్యార్థులు, తృతీయ స్థానంలో కాకినాడ జిల్లా విద్యార్థులు నిలిచారు. విజేతలకు ఆర్‌బీఐ ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్లు అత్తా ఒమర్ బషీర్, కే నిఖిల చేతుల మీదుగా బహుమతులు అందించారు. నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, ఎస్‌ఎల్‌బీసీ ఏపీ కన్వీనర్ నవనీత్‌కుమార్, ఆర్బీఐ జనరల్ మేనేజర్ ఆర్కే మహాన, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సైన్స్ ఆలోచనలు పెంచేలా శిక్షణ

- సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో సైన్స్ ఆవిష్కరణల పట్ల ఆలోచనలు పెంచేందుకు ఉద్దేశించిన అధికారుల నైపుణ్య శిక్షణ విజయవంతంగా ముగిసిందని సమగ్ర శిక్షణ ఎస్పీడీ బి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పుణె విజ్ఞానాశ్రమ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన ×నైపుణ్య శిక్షణ౯కు రాష్ట్రం నుంచి 26 జిల్లాల సైన్స్ అధికారులు హాజరైనట్లు వెల్లడించారు. ఈ సదస్సులో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థంగా నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలలను సైన్స్ ప్రయోగాలకు కేంద్రంగా తీర్చిదిద్దడం, వినూత్న ఆలోచనలకు ఆవిష్కరణల కేంద్రంగా ల్యాబ్‌లను వినియోగించడం వంటి అంశాలపై శిక్షణ పొందారన్నారు. ఈ వర్క్‌షాపును ప్రత్యేకంగా ఎస్సీఈఆర్టీ, యునిసెఫ్, సమగ్ర శిక్ష అధికారుల పర్యవేక్షణలో మొదటిసారి నిర్వహించినట్లు వివరించారు. శిక్షణ పొందిన వారు విద్యార్థులకు ప్రయోగాత్మక పాఠ్యాంశాలను బోధించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

శ్రీ చైతన్య చైర్మన్ బీఎస్ రావుకు ఘన నివాళి


బీఎస్‌రావుకు నివాళులర్పిస్తున్న చంద్రబాబు

పెనమలూరు: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావుకు పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. హైదరాబాద్‌లో మృతి చెందిన బీఎస్ రావు భౌతికకాయాన్ని గురువారం రాత్రి కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడప 100 అడుగుల రోడ్డులోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం పలువురు ప్రముఖులు వచ్చి ఆయనకు ఘన నివాళులర్పించారు. బీఎస్‌రావు భార్య ఝాన్సీలక్ష్మిబాయ్‌ని, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనకు నివాళులర్పించిన వారిలో నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నేత నారా లోకేశ్, నారా బ్రాహ్మణి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, వైవీబీ రాజేంద్రప్రసాద్, కొల్లు రవీంద్ర, పత్తిపాటి పుల్లారావు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, పారిశ్రామికవేత్త ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్, సీపీఎం నేత చిగురుపాటి బాబూరావు తదితరులున్నారు. కాగా బీఎస్‌రావు అంతియ యాత్ర శనివారం ఉదయం తాడిగడప 100 అడుగుల రోడ్డు నుంచి గోసాల శ్రీచైతన్య క్యాంపస్ వరకు ఉంటుందని తెలిపారు. అక్కడ స్థలంలో అంత్యక్రియలు చేస్తారు.

2 నుంచి గ్రూప్-1 ఇంటర్వ్యూలు

- ఎంపికైనవారి జాబితా విడుదల
- 110 పోస్టులకు 220 మంది ఎంపిక
- స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు 27 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్-1 ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. జనరల్, స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైనవారికి ఆగస్టు 2 నుంచి మౌఖిక పరీక్షలు ఉంటాయని వెల్లడించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టులకనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్టు కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. వచ్చే నెల 2న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విజయవాడ ఎంజీ రోడ్డులోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైనవారికి ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ఏపీపీఎస్సీ గతేడాది సెప్టెంబర్ 30న 111 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి 8న ప్రిలిమ్స్ (స్క్రీనింగ్) నిర్వహించి.. అదే నెల 27న ఫలితాలను వెల్లడించారు. 5,035 మంది మెయిన్స్ పరీక్షలకు ఎంపికయ్యారు. వీరికి జూన్ 3 నుంచి 10 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో నుంచి పోస్టుకు ఇద్దరు చొప్పున 110 పోస్టులకు 220 మందిని, స్పోర్ట్స్ కోటాలోని ఒక పోస్టుకు 39 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. నోటిఫికేషన్ ఇచ్చిన తక్కువ కాలంలోనే ఎలాంటి వివాదాలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించడం, అంతే వేగంగా ఇంటర్వ్యూలు కూడా నిర్వహించనుండటం ఏపీపీఎస్సీ చరిత్రలోనే ఇదే తొలిసారి. ప్రిలిమ్స్ పరీక్ష జరిగిన నాటి నుంచి 19 రోజుల్లో, మెయిన్స్ పరీక్షలు జరిగిన నాటి నుంచి 33 రోజుల్లోనే ఫలితాలను వెల్లడించడం విశేషం.

అధికారులకు అర్ధ వార్షిక పరీక్షలు

రాష్ట్రంలో పనిచేస్తున్న అఖిల భారత, రాష్ట్ర సర్వీసు అధికారులకు అర్ధ వార్షిక పరీక్షలను నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ ప్రకటించింది. వీరికి సెప్టెంబర్ 12 నుంచి 15 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపింది. ఆగస్టు 14లోగా ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్-2023 పరీక్ష ఫలితాలను ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ పరీక్షకు 11,236 మంది హాజరు కాగా, 10,908 మంది (97.08 శాతం) అర్హత సాధించారు. మేథమేటిక్స్‌లో వై.సాగర్, ఫిజికల్ సైన్స్‌లో ఎం.తిరుపతి నాయుడు, బయాలజీలో ఎల్.ఆస్మా, సోషల్ స్టడీస్‌లో ఎస్.బలరాం నాయుడు, ఇంగ్లిష్‌లో బి.నవీన్ మొదటి ర్యాంకులు సాధించారు.

ఏపీ పీజీసెట్ ఫలితాల వెల్లడి

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీజీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఏపీ పీజీ సెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి విడుదల చేశారు. ఏపీ పీజీసెట్‌కు 26,799 మంది విద్యార్థులు హాజరు కాగా, 22,858 మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాల్లో 21 సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షలో 85.29 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

గ్రామాల్లో ఉపాధి కళ

కూలీల బతుకుల్లో ఉపాధి హామీ వెలుగులు

- మరోపక్క గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు
- ఉద్యాన తోటల పెంపకంతో రైతులకు అండ
- రోడ్కు పక్కన భారీగా మొక్కల పెంపకం



కాకినాడ సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం చేపడుతున్న పనులు గ్రామీణ కూలీల బతుకుల్లో వెలుగులు నింపుతున్నాయి. మరో పక్క పల్లెల్లో ప్రగతి వెల్లివిరుస్తోంది. ఈ పథకం నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలు చేపడుతున్నారు. పథకం అమల్లోకి వచ్చాక వలసలు తగ్గాయి. ఉపాధి హామీ కింద వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా ఏర్పడటంతో కొనుగోలు సామర్థ్యం పెరిగింది. ఉపాధి నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్లతో పాటు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, విద్యాశాఖ కంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులను చేపడుతున్నారు.

కనీస వేతనం

జిల్లాలో 20 మండలాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం మరొక పనికి వెళుతున్నారు. ఉపాధి పనులకు రోజుకు కనీసం రూ. 257 వేతనం అందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇతర పనులకు వెళ్లడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందుతున్నారు. భార్యాభర్తలిద్దరూ పనులకు వెళితే రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు.

80 లక్షల పని దినాలు లక్ష్యం

ఉపాధి హామీ పథకంతో వలసలు కట్టడి చేయగలుగుతున్నాం. కూలీలకు పనుల కల్పిస్తున్నాం. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులు గుర్తించి పూర్తి చేస్తున్నాం. అడిగిన వారికి లేదనకుండా పనులు కల్పిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 80 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యాంగా నిర్దేశించాం.
అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ,.

ఈ ఏడాది చెల్లించిన వేతనాలు	:	రూ. 118.19 కోట్లు
పండ్ల తోటలు పెంపకం	:	309.92 ఎకరాల్లో
రోడ్ల కిరువైపులా నాటిన మొక్కలు	:	5.78లక్షలు
వైఎస్సార్ జలకళలో వేసిన బోర్లు	:	786
సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు	:	రూ.361.30 కోట్లు
ఇళ్ల స్థలాల అభివృద్ధికి..	:	రూ. 870.77 కోట్లు
ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు	:	రూ.1,249.40 కోట్లు

నాలుగేళ్లలో కల్పించిన పని దినాలు

సంవత్సరం	పనిదినాలు (లక్షల్లో)
2019-20	74.21
2020-21	82.88
2021-22	77.66
2022-23	58.47
2023-24	48.65

వ్యవసాయ రంగం అభివృద్ధి

- ఉపాధి పథకంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.
- ఎంట కాలువలు తీయడం, పూడికతీత, చెరువుల్లో మట్టి తీయడం, పొలాలకు రోడ్లు, వేయడం, చెక్ డ్యాంల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు.
- రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. గడచిన నాలుగేళ్లలో 1446.79 కిలోమీటర్ల పొడవునా 5.78 లక్షల మొక్కలు నాటారు.
- చిన్న సన్నకారు రైతుల భూముల్లో పండ్ల తోటల్ని పెంచుతున్నారు. నాలుగేళ్లలో రూ. 4.44 కోట్లతో 309.92 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.
- అర్హులైన చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేస్తున్నారు.
- రూ. 29.66 కోట్లతో 1449 బోర్లు మంజూరు కాగా 2020 నుంచి ఇప్పటి వరకు 786 బోర్లు వేశారు.




ఈ చిత్రంలోని చిన్నారి పేరు చతుర్వేద్. ప్రస్తుతం నగరంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యులే. పిల్లాడి బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మ్యాథ్స్‌లో ఇంటి వద్ద ట్యూషన్ పెట్టించారు. అదేవిధంగా ఎలాంటి పరిస్థితుల్లోనైనా నెగ్గుకురావాలనే ఉద్దేశంతో ఇంట్లోనే యోగా సాధన చేయిస్తున్నారు.



ఇంటి పట్టున.. ఇష్టంగా అభ్యాసన!


లక్షలు పోసి ప్రయివేట్ పాఠశాలల్లో చదివిస్తున్నా ఏదో వెలితి. మార్కులు ఎందుకు తక్కువ వస్తున్నాయి? ర్యాంకుల్లో ఎక్కడ తడబడుతున్నారు? తల్లిదండ్రుల ఆలోచన విద్యార్థులకు శాపంగా మారుతోంది. పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు క్షణం తీరికలేని విధంగా పిల్లల బుర్రకు పదును పెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఈ పరిస్థితి కొంత వరకు మేలు చేస్తున్నా.. ఒకానొక దశలో మానసిక రుగ్మతలకు కారణమవుతోంది. దాదాపుగా రోజంతా పుస్తకాలతోనే కుస్తీ పట్టడం.. ఇంటికి చేరుకున్నా అదే చదువులో ఇమిడిపోవడంతో కొత్త సమస్యలకు దారితీస్తోంది. జ్ఞానం ముఖ్యమే అయినా.. లోకజ్ఞానం అంతకు మించి ప్రాధాన్యం అనే విషయం మరుగున పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో పిల్లల మానసిక పరిపక్వత మెరుగుతో పాటు వ్యక్తిగత పర్యవేక్షణకు 'ఇంటి వద్దే ట్యూషన్' ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తోంది.

– సాక్షి, కర్నూలు డెస్క్



హోం ట్యూషన్లకు ఆదరణ

- ప్రయివేట్ పాఠశాలల్లో కనిపించని ప్రత్యేక చొరవ
- తీరిక లేని తల్లిదండ్రులు
- పిల్లలపై ప్రభావం చూపుతున్న పోటీతత్వం
- దిద్దుబాటు చర్యలకు ఇంటి వద్దకే ప్రత్యేక ఉపాధ్యాయులు
- చదువుతో పాటు వ్యక్తిగత పర్యవేక్షణ



నలుగురిలో కలవలేక..

పాఠశాల గదిలో కొందరు పిల్లలు ఇమడలేకపోతున్నారు. 30-40 మంది పిల్లల్లో కొందరు ఉపాధ్యాయుడిని ఏదైనా సమస్య అడిగితే ఏమనుకుంటారో, మిగతా పిల్లల ముందు చులకన అవుతామేమోననే భావన అధికంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నలుగురిలో ఒకరిగా మిగిలిపోతూ చదువులో వెనుకబడుతున్నారు. పెరిగిన వాతావరణం కూడా ప్రశ్నించేతత్వం లేకపోవడానికి కారణమవుతోంది.

సమయం సర్దుబాటు

పిల్లలను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా చదువుతో పాటు ఇతర వ్యాపకాల్లోనూ ఆరితేరాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. అయితే పాఠశాలలోనే అధిక సమయం గడపాల్సి వస్తుండటంతో మిగిలిన సమయాన్ని సర్దుబాటు చేస్తున్నారు. ఇందు కోసం అవసరమైన ట్యూషన్లు ఇంటి వద్దే ఏర్పాటు చేస్తున్నారు.

కార్పొరేట్ విద్య పల్లెలకూ విస్తరించడం, ఒకరిని చూసి మరొకరు తమ పిల్లలకు కాన్వెంట్ చదువులు చదివించాలనుకోవడం.. వెరసి విద్యను 'కొనుక్కోవాల్సిన' పరిస్థితి అధికమైంది. అక్కడ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారా, అనువైన సౌకర్యాలు ఉన్నాయా? ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో కార్పొరేట్ పాఠశాలల పెత్తనం అధికమైంది. తల్లిదండ్రుల్లో ప్రశ్నించే తత్వం లేకపోవడం వల్ల కాంక్రీట్ వనాల్లో చాలా వరకు విద్యార్థులు పోటీతత్వాన్ని తట్టుకోలేక మానసికంగా కుంగిపోతున్నారు. క్లాస్ రూంల్లో ఉపాధ్యాయులు పిల్లలందరికీ ఒకేవిధమైన బోధన అందించడం, వెనుకబడిన విద్యార్థులను పట్టించుకోకపోవడం కొత్త సమస్యలకు దారితీస్తోంది. ఒకరు కష్టపడితే ఇంటిల్లిపాది కూర్చొని తింటున్నారనే మాట ఒకప్పుడు. ఇప్పుడు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేస్తే తప్ప కుటుంబం గడవటం కష్టమవుతోంది. ఈనేపథ్యంలో ఉదయం లేచినప్పటి నుంచి సాయంత్రం ఇంటికి చేరే వరకు ఇద్దరిదీ ఉరుకులు పరుగుల జీవితమే. కార్పొరేట్ పాఠశాలలో చేర్పించామని సంబరపడిపోవడం తప్పితే.. పిల్లల చదువు ఏ స్థాయిలో ఉందనే విషయం పట్టించుకునే సమయం కూడా ఉండని పరిస్థితి. ర్యాంకు కార్డులు చూసి, అప్పుడు మేల్కోవడం.. పిల్లలకు చీవాట్లు పెట్టడం సరేసరి.. కానీ అందుకు కారణాలను విశ్లేషించుకోకపోవడం గమనార్హం.

ఒకప్పుడు తల్లి పంచన..

తల్లి ఆది గురువు అంటారు. ఒకప్పుడు తండ్రి బయటి వ్యవహారాలను చక్కబెడితే.. ఇంటిని ఇల్లాలు తీర్చిదిద్దేది. అందులో భాగంగానే పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి చేరుకోగానే అక్కడి పరిస్థితులు తెలుసుకోవడం, పక్కనే కూర్చొని చదివించడం జరిగేది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం వల్ల ఇంటికి వచ్చేలోపు అలసిపోతూ పిల్లలను పట్టించుకునే సమయం ఉండటం లేదనేది జగమెరిగిన సత్యం. ఇక భార్య ఇంటి పట్టునే ఉంటున్నా, గంటల కొద్దీ టీవీకి అతుక్కుపోయి సీరియళ్లతో కాలక్షేపం చేస్తుండటంతో పిల్లలు కూడా సెల్‌ఫోన్లకు బానిసలవుతూ చదువును అటకెక్కిస్తున్నారు.

కార్పొరేట్ చొరబాటు : తల్లిదండ్రుల ఆసక్తిని కార్పొరేట్ సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ట్యూషన్ చెప్పిస్తే కానీ తమ పిల్లాడు చదువులో మెరుగు కాలేదనే భావన ఈ సంస్థలకు కాసులు కురిపిస్తోంది. బైజూస్, వేదాంత తదితర కార్పొరేట్ సంస్థలు ఆన్‌లైన్ క్లాసుల పేరిట వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇటీవల ఓ కార్పొరేట్ సంస్థ ఆఫ్‌లైన్ ట్యూషన్‌ను కూడా కర్నూలులో ఏర్పాటు చేయడం గమనార్హం. డబ్బు పెట్టి విద్యను కొందామని చూస్తున్న తల్లిదండ్రులు కాస్త సమయం కేటాయించి పిల్లలకు మంచీచెడు తెలియజెబుదామని ఆలోచించకపోవడం గమనార్హం.

ఉపాధి కల్పిస్తున్న ట్యూషన్లు

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తి కత్తి మీద సాముగా మారింది. వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు ప్రయివేట్ ఉపాధ్యాయులకు తలబొప్పి కడుతుంది. అడ్మిషన్లు తీసుకొస్తేనే ఉద్యోగం ఉంటుందని, లేకపోతే మీ సేవలు అక్కరలేదని యాజమాన్యాలు తెగేసి చెప్పడం వాళ్ల కొంప ముంచుతోంది. ఈ నేపథ్యంలో హోం ట్యూషన్ చెప్పుకుంటే యాజమాన్యాల ముందు చేతులు కట్టుకోవాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆర్థికంగా ఉన్నవాళ్లే..

ప్రయివేట్ పాఠశాలల్లో దాదాపు 10 నెలల సిలబస్‌ను ఆరు నెలల్లో పూర్తి చేస్తున్నారు. యాజమాన్యాల ఒత్తిడితో ఉపాధ్యాయులు ఈ విషయంపైనే దృష్టి సారిస్తూ విద్యార్థుల పట్ల శ్రద్ధ కనపర్చే పరిస్థితి ఉండటం లేదు. ఇక పిల్లలు కూడా ఏదైనా సందేహం నివృత్తి చేసుకుందామంటే ఎక్కడ వెనుకబడ్డామనే ముద్ర వేస్తారోనని ఆత్మన్యూనతా భావనకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో కాస్త ఆర్థికంగా ఉన్న వాళ్లు ఇంటి వద్దే ట్యూషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న సబ్జెక్టులు, ఆర్థిక స్తోమత ఆధారంగా రూ.3వేల నుంచి రూ.10వేల వరకు తీసుకుంటున్నారు.

హోం ట్యూషన్ ఉపయోగాలు

- హోంవర్క్‌ను పూర్తి చేయించడంలో సహాయం.
- అప్పగించిన అసైన్‌మెంట్లను సకాలంలో పూర్తి చేయడం
- మంచి అలవాట్లు, నడవడికను అలవర్చుకోవడం
- సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు కొత్త విషయాలను నేర్చుకోవడం
- పిల్లలు ఏ విషయంలో వెనుకబడ్డారో తెలుసుకునే వెసులుబాటు
- సమయాన్ని అనుకూలంగా మలుచుకోవడం
- వ్యక్తిగత పర్యవేక్షణ కారణంగా ఆత్మస్థైర్యం పెంపు
- ఎలాంటి సందేహం వచ్చినా నివృత్తి చేసుకునే అవకాశం
- దూరం ప్రయాణించే అవసరం లేకుండా సమయాన్ని ఆదా చేసుకోవడం
- వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి

సందేహాల నివృత్తికి మార్గం



సబ్జెక్టులో వెనుకబాటుకు అనేక కారణాలు ఉంటాయి. హోం ట్యూషన్‌తో విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపర్చడం వల్ల ఎక్కడ లోపం ఉందనే విషయాన్ని తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు ఎంతో దోహదపడుతుంది. పాఠశాలలో చర్చించలేని ఎన్నో విషయాలను నివృత్తి చేసుకోవచ్చు.

– టి.డి.కిశోర్‌కుమార్, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, కర్నూలు

బేసిక్స్ లేకపోవడంతోనే వెనుకబాటు



నేను ఓ ప్రయివేట్ పాఠశాలలో పని చేస్తూనే సాయంత్రం హోం ట్యూషన్ చెబుతున్నా. కరోనా కారణంగా విద్యార్థుల్లో బేసిక్స్ లోపించి వెనుకబాటు కనిపిస్తుంది. ఇంటి వద్దే ట్యూషన్ వల్ల ప్రతి రోజూ విద్యార్థిని స్వయంగా పర్యవేక్షించవచ్చు. లోపాలను తల్లిదండ్రులకు వివరించి సరిదిద్దే ప్రయత్నం జరుగుతుంది.

– ఎస్.శివ, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, నంద్యాల

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943